సమావేశము – IX
వాల్యూము – I
నెం. 1

వెల : రూ. 27–00
13 మార్చి, 2018
మంగళవారం,
(శక సం. 1939,
ఫాల్గుణం బ.11)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

విషయ సూచిక

| | | | |
|---|---|---|---|
| I. | ప్రశ్నోత్తరాలు | ... | 2 |
| II. | సభా కార్యక్రమం :<br>ప్రత్యేక ప్రస్తావనలు | ... | 16 |
| III. | సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు | ... | |
| IV. | సభా సమక్షంలో పెట్టబడిన పత్రం | ... | 16 |
| V. | సభా కార్యక్రమం :<br>గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం మరియు చర్చ | ... | 16 |

# తెలంగాణ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామి గౌడ్ |
| డెప్యూటీ ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. వి. నరసింహాచార్యులు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్<br>శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి వి.ఎస్. ప్రసన్నకుమారి |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ బి. కమలాకర్<br>శ్రీమతి అలివేలు<br>శ్రీ ఎమ్. కృపాకర్ రావు<br>శ్రీమతి బి. ప్రమీల<br>శ్రీమతి యస్. నాగమణి<br>శ్రీ డి. శ్రీనివాసులు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ కె. భాస్కర శ్రీనివాస్ |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

## (తొమ్మిదవ సమావేశము – మొదటి రోజు)

## మంగళవారం, మార్చి 13, 2018

(సభ ఉదయం 10.00 గంటలకు ప్రారంభమైనది)

(గౌరవ డెప్యూటీ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు)

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్:–** గవర్నర్ గారు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సందర్భంగా చోటు చేసుకున్న విపరీత పరిణామం చాలా బాధాకరం, శోచనీయం. ప్రజాస్వామ్యానికే మచ్చ తెచ్చే సంఘటన చోటు చేసుకుంది. ఈ అమానవీయ చర్యలతో ప్రజాస్వామ్యానికే మకుటంగా నిలిచే పెద్దల సభలో గౌరవనీయులైన ఛైర్మన్ శ్రీ స్వామిగౌడ్ గారి పట్ల జరిగిన దాడి హేయమైనది. మనందరం తీవ్రంగా ఖండించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ప్రజాస్వామ్యవాదులుగా తమ నిరసన తెలియజేయడానికి ప్రతి ఒక్కరికీ హక్కు ఉన్నప్పటికీ, దానిని తెలియజేసే పద్ధతి కూడా ప్రజాస్వామ్య పద్ధతులలోనే ఉండాలి. మనమందరం ఇక్కడికి వచ్చేది ప్రజా సమస్యలను ప్రస్తావించి, తద్వారా ప్రజలకు సేవ చేయాలని. అంతేగాని, వ్యక్తిగత ప్రయోజనాలకో లేదా తమ ఉనికిని చాటుకోవడానికో కాదు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించడం మంచిది కాదు. కాబట్టి ఈ సందర్భంగా గౌరవ సభ్యులందరినీ కోరేది, మీ మీ సమస్యలు, నిరసనలు ప్రజాస్వామ్యయుతంగా వ్యక్తం చేస్తూ, ఈ పెద్దల సభ యొక్క గౌరవాన్ని, ఔన్నత్యాన్ని కాపాడవలసిందిగా కోరుతున్నాను. 12.03.2018 నాడు జరిగిన సంఘటనలను మనమందరం నిరసిస్తూ, ముక్త కంఠంతో ఖండించాలని కోరుతూ, గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరి గారిని తీర్మానాన్ని ప్రవేశపెట్టవలసిందిగా కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి:–** అధ్యక్షా, నిన్నటి రోజున గవర్నర్ గారి ప్రసంగం సందర్భంగా జరిగిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ, ఉభయ సభల బిఏసి సమావేశాలలో కూడా దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలు ఆ దురదృష్టకరమైన సంఘటనను ఖండించడం జరిగింది. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని, పెద్దల సభ ద్వారా ఒక మంచి సంకేతాన్ని పంపించాలనే ఉద్దేశంతో తమరి అనుమతితో నేను ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నాను.

**SRI KADIYAM SRIHARI, DEPUTY CHIEF MINISTER:-** Chairman Sir, I beg to move:

"That under Rule 308(2) of Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council, the following Members be suspended from the service of the House till the end of the Session:

1) Sri Mohd. Ali Shabbir
2) Sri Ponguleti Sudhakar Reddy
3) Sri T. Santosh Kumar
4) Sri Kuchukulla Damodar Reddy
5) Smt. Akula Lalitha
6) Sri Komatireddy Rajagopal Reddy"

**MR. DEPUTY CHAIRMAN:-** Motion moved. The question is:

"That under Rule 308(2) of Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council, the following Members be suspended from the service of the House till the end of the Session:

1) Sri Mohd. Ali Shabbir
2) Sri Ponguleti Sudhakar Reddy
3) Sri T. Santosh Kumar
4) Sri Kuchukulla Damodar Reddy
5) Smt. Akula Lalitha
6) Sri Komatireddy Rajagopal Reddy"

(PAUSE)

The Motion was adopted and the Members

named were suspended from the service of the House till the end of the Session.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్**:- (మైకు లేకుండా) వెళ్లిపోతాం అధ్యక్షా, అందుకు మేము సిద్ధమే. కానీ కనీసం సస్పెండ్ చేయడానికి గల కారణాలు చెప్పవలసిందిగా కోరుతున్నాను.

(అంతరాయం)

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ :-** సస్పెండ్ అయిన సభ్యులు దయచేసి వెళ్లిపోవలసిందిగా కోరుతున్నాను.

**శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**:- (మైకు లేకుండా) అధ్యక్షా, మీరు ఏ రూల్ ప్రకారం మమ్మల్ని సస్పెండ్ చేస్తున్నారు?

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్**:- (మైకు లేకుండా) ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. ఇది చాలా అన్యాయం.

(అంతరాయం)

**శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**:-(మైకు లేకుండా) ఎవరైతే దాడి చేశారో, వారి మీద చర్య తీసుకోండి.

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్**:- దయచేసి సస్పెండ్ అయిన సభ్యులు హౌస్ నుండి వెళ్లిపోవలసిందిగా నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

(శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ గారు, శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి గారు, శ్రీ టి. సంతోష్ కుమార్ గారు, శ్రీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి గారు, శ్రీమతి ఆకుల లలిత గారు మరియు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు 'ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం - దొంగల రాజ్యం దోపిడి రాజ్యం, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న వ్యవస్థ - నశించాలి' అంటూ నినాదాలు చేసుకుంటూ సభ నుండి నిష్క్రమించారు.)

**MR. DEPUTY CHAIRMAN:-** All the Papers are deemed to have been Laid on the table of the House and all the Papers are deemed to have been Placed on the Table:

Papers Laid:

1) A copy of the 2nd Annual Report of Telangana Power Finance Corporation Limited for the year 2015-2016, as required under Section 394 of the Companies Act, 2013;

2) A copy of the Notification issued in G.O.Ms.No.58, Agriculture & Co-operation (Mktg.II) Department, dated 27.12.2017 and published in Rules Supplement to Part-I Extraordinary of the Telangana Gazette Notification No.54, dated 29.12.2017, as required under Rule 189 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council;

3) A copy of the Notification issued in G.O.Ms.No.28, Agriculture & Co-operation (Mkt.I) Department, dated 26.2.2018 and published in Rules Supplement to Part-I Extraordinary of the Telangana Gazette Notification No.7, dated 27.2.2018, as required under Rule 189 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council.

Papers Placed:

1) A copy of the report on the decisions of the Business Advisory Committee taken at its meeting held on 12th March, 2018.

ANNOUNCEMENT

**MR. DEPUTY CHAIRMAN:-** I have to acquaint the House that on 12th March, 2018, the Governor was pleased to address the Members of both the Houses of Legislature and a true copy of the Address has been laid on the Table of the House.

I am to announce to the House that amendments to the Motion of Thanks to the Address by the Governor will be received by the Secretary to State Legislature upto 2 pm today.

## ఇప్పుడు క్వశ్చన్ అవర్. ప్రశ్న నెం.259

## రాష్ట్రంలో విత్తన పంటల సాగు

ప్రశ్న నెం.2598 (1)

సర్వశ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్ మరియు బలసాని లక్ష్మీనారాయణ, ఎం.ఎల్.సి.లు:- గౌరవ నీయులైన వ్యవసాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో విత్తన పంటల సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్యలేమిటి;

ఇ) రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయించిన విధంగా రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంపిణీ చేసే బ్యాంకు రుణాల పరిమాణం ఎంత?

గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రి (శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి):- అ) అవునండీ.

ఆ) టిఎస్ఎస్‌డిసి, హెచ్‌ఎసిఎ, ఎన్ఎస్‌సి మున్నగు విత్తన సరఫరా ఏజెన్సీలు రాష్ట్రంలో విత్తన ఉత్పత్తిని చేపడుతున్నాయి.

వ్యవసాయ శాఖ రాష్ట్ర విత్తన క్షేత్రాలలో విత్తన ఉత్పత్తిని చేపడుతున్నది.

ఆధార విత్తనాన్ని సరఫరా చేయడం ద్వారా రైతులతో శాఖ చేపట్టిన విత్తన గ్రామ కార్యక్రమ పథకం ద్వారా ధృవీకరించిన / నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేయడమవుతున్నది.

ఇ) ఎస్ఎల్‌బిసి వార్షిక పరపతి ప్రణాళికను రూపొందించి త్వరలో దీనిని నిర్ణయిస్తుంది.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి (ఉపాధ్యాయ నియోజకవర్గం - మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ మరియు కరీంనగర్)**:- అధ్యక్షా, ఇంతవరకు సాధారణ విత్తనాల కొనుగోలు రుణాలకు గాని, విత్తనాలను అభివృద్ధి చేసే సాగుకు సంబంధించిన రుణాలకు ప్రత్యేకమైన తేడా అంటూ లేదు. సాగు చేసి, విత్తనాలను ఉత్పత్తి చేస్తున్న రైతులకు ఎంతైతే సాగుకు వ్యయం అవుతుందో, దానికి అనుగుణంగా రుణం ఉండాలనేది మా యొక్క డిమాండు. రెండవది, ఇవ్వాళ సాగుకు అనుగుణంగా రుణం ఇవ్వడమనేది జరగడం లేదు. పంట సాగు చేసే వారందరికీ ఏ ఏ విత్తనాలకు ఎంత రుణ పరిమితి ఉంటుందనేది ఎస్ఎల్‌బిసి సమావేశంలో ప్రభుత్వం ఏమైనా ప్రతిపాదన చేసిందా అనే విషయమై స్పష్టత ఇవ్వాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

ఒక్కొక్క పంట విత్తనానికి ఎంత రుణం ఇవ్వాలి, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎలా ఉంటుందనే విషయాల మీద మన రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా ప్రతిపాదన చేసింది, గతంలో రుణాలు తక్కువగా ఉన్నందువల్ల, ఇప్పుడు వచ్చే ఖరీఫ్ నుంచి ప్రభుత్వం ఏ రకమైన రుణం ఇవ్వాలనేది ప్రతిపాదించిందో దాని గురించి వివరించవలసిందిగా కోరుతున్నాను.

**శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్ (శాసనసభ నియోజక వర్గం)**:- అధ్యక్షా, నూతన శాసన పరిషత్తు మందిరంలో ఈరోజు నుండి సమావేశాలను నిర్వహించడం ఒక శుభ పరిణామంగా భావిస్తూ, అందరికీ శుభాభినందనలు తెలియజేస్తున్నాను. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత మన గౌరవ ముఖ్యమంత్రిగారు మరియు రాష్ట్రమంత్రివర్యులు పంట సాగు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పెద్ద ఎత్తున ఫౌండేషన్ విత్తనాలను తయారు చేయడం జరిగింది. ఈ నాలుగు సంవత్సరాలలో మన ప్రభుత్వం చేసినటువంటి కృషికి దిగుబడులు పెరిగి రైతాంగానికి కొంత ఆదాయం కూడా పెరిగింది.

నిజామాబాద్ జిల్లాలో ఎర్ర జొన్న, పసుపు, మొక్కజొన్న, వరి పెద్ద ఎత్తున పండిస్తున్న సందర్భంలో అక్కడ కొన్ని ప్రయివేటు సంస్థలు వరి నార్లు తయారు చేస్తున్నాయి. ప్రభుత్వం ద్వారా నిజామాబాద్ జిల్లాలో ఒక విత్తనోత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే నిజామాబాద్ జిల్లాలోని రుద్రూరు, ఆర్మూర్, బాల్కొండ ప్రాంతాలలో పసుపు పంటను కూడా పండిస్తున్నారు. తమరి ద్వారా మంత్రిగారిని కోరేది, ఇతర రాష్ట్రాల నుండి మన రాష్ట్రానికి కొంత దిగుబడి వచ్చే విత్తనాలను తీసుకొచ్చి, కొన్ని ప్రయోగాత్మకంగా వేస్తున్నారు. కాబట్టి అటువంటి విత్తనాలను మన ప్రభుత్వమే ఉత్పత్తి చేస్తే బాగుంటుంది.

మన ప్రభుత్వం నాలుగు సంవత్సరాలనుండి అనేక ప్రయత్నాలు చేసి, పెద్ద ఎత్తున పంట దిగుబడి వచ్చే విధంగా ప్రయత్నం చేస్తోంది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు తీసుకున్న చర్యల వల్ల అధిక పంట దిగుబడులు రైతాంగానికి వస్తున్నాయి. అవి కూడా సరిపోనటువంటి నిజామాబాద్ జిల్లా మరియు ఇతర జిల్లాలలో ఇటువంటి మంచి వంగడాల కొరకు ప్రభుత్వం ఇంకా ఏమైనా పెంచే ప్రయత్నం చేస్తుందా, అని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను.

**శ్రీ బలసాని లక్ష్మి నారాయణ (స్థానిక సంస్థలు - ఖమ్మం)**:- అధ్యక్షా, తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరేది, ప్రతి సంవత్సరం రాష్ట్ర స్థాయి బ్యాంకర్స్ మీటింగ్స్ జరుగుతుంటాయి. ప్రతి బ్యాంకర్స్ మీటింగులో వ్యవసాయ రుణాలు ఇంత శాతం ఇవ్వాలని నిర్ణయించబడుతుంది. నా దగ్గర ఉన్న సమాచారం ప్రకారం వాణిజ్య బ్యాంకులు మరియు మిగతా బ్యాంకులు వ్యవసాయ రుణాలు రైతులకు సకాలంలో ఇవ్వనటువంటి పరిస్థితి ఈరోజు ఉన్నది. తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం పెద్ద ఎత్తున అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నది. రాబోయే రోజులలో ప్రతి రైతుకు ఎకరానికి, సంవత్సరానికి రూ.8,000/-ల చొప్పున పెట్టుబడి పెట్టాలని గౌరవ ముఖ్యమంత్రి గారు నిర్ణయం తీసుకోవడం జరిగింది. అటువంటి సందర్భంలో బ్యాంకర్స్ రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎంత శాతం ఇవ్వాలని నిర్ణయించారో, అది పూర్తయ్యే విధంగా వారికి వ్యవసాయ రుణాలను గత సంవత్సరం ఇచ్చారా, లేదా అని

అడుగుతూ, ఈ సంవత్సరమైనా ఖచ్చితంగా దానిని అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి:–** అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రధానంగా తెలంగాణ రాష్ట్రాన్ని విత్తన భాండారంగా మార్చాలనే సంకల్పంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోంది. విత్తన ఉత్పత్తి అనేది మూడు మార్గాల ద్వారా చేస్తున్నాం. ఒకటి, గ్రామాల్లో విలేజ్ సీడ్ ప్రోగ్రామ్ క్రింద రైతులకు ఫౌండేషన్ సీడ్ ఇచ్చిన తరువాత వారు ఉత్పత్తి చేసినటువంటి సర్టిఫైడ్ సీడ్‌ని గ్రామాల్లోని మిగతా రైతులకు పంపిణీ చేయడం జరుగుతోంది. రెండు, సీడ్ కార్పోరేషన్ సంస్థ ద్వారా ఇతర రైతులకు ఫౌండేషన్ సీడ్ ఇచ్చి, buy back agreement ప్రకారం వారి దగ్గర నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయడం. మూడు, రాష్ట్రంలో వ్యవసాయ శాఖకు పది సీడ్ ఫార్మ్స్ ఉన్నాయి. దాంట్లో ఉన్న భూమి గత అనేక సంవత్సరాలుగా బీడు భూమిగా మారిపోయి తుమ్మ చెట్లు మొలిస్తే, టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశాలకు అనుగుణంగా ఆ సీడ్ ఫార్మ్స్‌కు అక్కడ పైప్‌లైన్, బోర్లు, మోటార్ల ఏర్పాటు వంటి వివిధ రకాల మౌలిక సదుపాయాలు కల్పించి, ఆ సీడ్ ఫార్మ్స్ ద్వారా విత్తనాలను ఉత్పత్తి చేయడం జరుగుతోంది.

గౌరవ సభ్యులు పాతూరి సుధాకర్ రెడ్డి గారు చెప్పిన దానికి సంబంధించి, రైతులు విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నందుకు ప్రభుత్వం సీడ్ సబ్సిడీ ఇస్తోంది. ఆహార ధాన్యాలకు 50 శాతం, పప్పు ధాన్యాలకు 60 శాతం సీడ్ సబ్సిడీ ఇవ్వడం జరుగుతోంది. దాంతో పాటు వారు ఒక సలహా ఇచ్చారు. కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్, కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ ప్రకారం విత్తనాలను ఉత్పత్తి చేసే వారికి శిక్షణ ఉంటుంది కాబట్టి, నియమ నిబంధనలు పాటించాలి. బ్యాంకులు ఇచ్చే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచినట్లయితే బాగుంటుందని గౌరవ సభ్యులు అడిగారు. రాబోయే రోజుల్లో స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తాం. గౌరవ సభ్యులు పాతూరి సుధాకర్ రెడ్డి గారు సూచించిన విధంగా రైతులకు బ్యాంకుల నుంచి ఎక్కువ లోన్లు ఇప్పించే ప్రయత్నం చేస్తాం.

**10.20 ఉ.** సభ్యులు శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్ గారు అడిగిన ప్రశ్నకు సమాధానంగా, ఆర్మూర్, బాల్కొండ ప్రాంతాలలో ఎక్కువగా పసుపు పంటను పండిస్తారు. హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా రెండు బస్సులను ఏర్పాటు చేసి ప్రభుత్వ ఖర్చుతో కొంత మంది రైతులను అధ్యయనం కోసం చెన్నైకు పంపించడం జరిగింది. వారు 'సేలం' అనే ఒక మంచి వెరైటీ విత్తనాన్ని తీసుకొచ్చి పంటలు పండిస్తున్నారు. వారు చెప్పిన విధంగా రకరకాల విత్తనాలను ఎంపిక చేస్తున్నాము. తక్కువ పెట్టుబడి, తక్కువ విత్తనాలతో ఎక్కువ దిగుబడి ఇచ్చే వంగడాల ఎంపిక కొరకు మహారాష్ట్రకు ఒక బృందాన్ని పంపించడం జరిగింది. ఈ మధ్య కాలంలో బాల్కొండ నియోజక వర్గంలో 42 ఎకరాలలో "స్పైస్ పార్క్"ను ఏర్పాటు చేయడం జరిగింది. దీని ద్వారా కొన్ని పరిశోధనలు చేసి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలలో పసుపు పండించే రైతాంగానికి వారు చెప్పిన విత్తనాలను తెప్పించి అధిక దిగుబడి ఇచ్చే వంగడాల ఉత్పత్తి తయారీకి ప్రయత్నం చేస్తున్నాము.

గౌరవ సభ్యులు శ్రీ బలసాని లక్ష్మీనారాయణగారు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఖరీఫ్, రబీ పంటల కోసం రైతులకు దాదాపు 70 శాతం రుణాలను బ్యాంకులు ఇవ్వడం జరిగింది. రుణాలు ఇవ్వడంలో మ్యాన్యువల్ విధానంలో కొంత వేగంగా ఉండేది. కంప్యూటరైజేషన్ వలన కొంత జాప్యం జరిగి అనుకున్న సమయానికి కొంత మంది రైతులకు రుణాలు ఇవ్వలేక పోయారు. అయినప్పటికీ వారు చెప్పిన సూచన ప్రకారంగా రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌లో ముందుగానే రుణాలు అవసరమున్న రైతాంగానికి లక్ష్యాన్ని చేరుకునే విధంగా తప్పనిసరిగా ప్రభుత్వం బ్యాంకుల మీద ఒత్తిడి తీసుకొచ్చి మంజూరు అయ్యేటట్లు చూస్తామని తెలియజేస్తున్నాను.

## తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను (టి.ఎస్.ఆర్.టి.సి) బలోపేతం చేయుట

ప్రశ్న నెం. 2752(3)

డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి, సర్వశ్రీ పురాణం సతీష్ కుమార్ మరియు బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎం.ఎల్.సి.లు:– గౌరవనీయులైన రవాణా శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్ఆర్టిసి) గత కొన్ని సంవత్సరాలుగా నష్టాలను ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనా;

ఆ)అయితే, అందుకు గల కారణాలు ఏమిటి;

ఇ) నష్టాల నుండి బయటకు తీసుకువచ్చి సంస్థను పటిష్టపరచడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి?

**గౌరవనీయులైన రవాణా శాఖ మంత్రి (శ్రీ పి. మహేందర్ రెడ్డి)ః–** అ) అవునండీ.

ఆ)సంస్థ నష్టాలను ఎదుర్కోవడానికి గల ప్రధాన కారణాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1) ఉద్యోగుల వేతనాలలో 44 శాతం పెరుగుదలను అమలు చేసినందున పెరిగిన సిబ్బంది వ్యయం.

2) 2015 సంవత్సరంలో 4001 మంది ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించడం.

3) వేతన స్కేళ్ల సవరణపై బకాయిల చెల్లింపు.

4) సంవత్సరంలో రెండు సార్లు పెరిగిన కరువు భత్యం చెల్లింపు, సెలవులను నగదు రూపంగా మార్చడం.

5) హై స్పీడ్ డీజిల్(హెచ్ఎస్‌డి) అయిల్ ధరల పెంపుదల.

6) అప్పులపై చెల్లించిన వడ్డీలు.

ఇ) 1) 2013, సవరించిన పే స్కేళ్ల భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం 2015-16 & 2016-17 సంవత్సరాలలో సంస్థకి సహకారంగా రూ. 428.08 కోట్ల నికర మొత్తాన్ని ఇచ్చింది.

2) 2015-16 ఆర్థిక సంవత్సరానికి గ్రేటర్ హైదరాబాదు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా హైదరాబాదు నగర నిర్వహణలో సంస్థ ఎదుర్కొన్న నష్టాలను రీయింబర్సు చేయడానికి రూ.336.40 కోట్లను మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ విడుదల చేసింది.

3) 2015 - 16 సంవత్సరంలో ప్రభుత్వ పూచీ రుణం ద్వారా 2013 - 14 & 2014 - 15 సంవత్సరాలకి రూ.500.00 కోట్ల మేరకు రాయితీల మిగులు మొత్తాలను ప్రభుత్వం విడుదల చేసింది. తద్వారా నిర్వహణ పెట్టుబడి కొరతను తీర్చడమయింది.

4) 2017-18 సంవత్సరంలో ప్రభుత్వ పూచీ రుణం ద్వారా రూ.350.00 కోట్ల మేరకు 2015-16 సంవత్సరానికి రాయితీల మిగులు మొత్తాన్ని, 2016 - 17 సంవత్సరానికి కొంత మొత్తాన్ని కూడా ప్రభుత్వం విడుదల చేసింది.

5) అంతేకాక, 2017 - 18 సంవత్సరానికి బస్‌పాస్ రాయితీల రీయింబర్స్‌మెంట్ నిమిత్తం ప్రభుత్వం రూ.520.00 కోట్ల మొత్తాన్ని బడ్జెట్‌లో సమకూర్చి, రూ.230.00 కోట్ల మొత్తాన్ని విడుదల చేసింది.

6) 2015-16, 2016-17 సంవత్సరాలలో బస్సుల కొనుగోలు కోసం ప్రభుత్వం వరుసగా రూ.39.93 కోట్లు, రూ. 10.00 కోట్ల మొత్తాన్ని విడుదల చేసింది.

7) 2017-18 సంవత్సరానికి బస్సుల కొనుగోలు నిమిత్తం ప్రభుత్వం బడ్జెటులో రూ.140.00 కోట్ల మొత్తాన్ని కూడా సమకూర్చి, రూ. 70.00 కోట్ల మొత్తాన్ని విడుదల చేసింది.

**డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి (పట్టభద్రుల నియోజక వర్గం – వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ)ః–** అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం రాకముందు కాంగ్రెస్, తెలుగు దేశం ప్రభుత్వాలు ఆర్టీసీకి లాభాలు రావడం లేదని ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నాలు చేసారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ సంస్థను రక్షించుకుంటామని గౌరవ ముఖ్యమంత్రిగారు అన్నప్పుడు ఆర్టీసీ సిబ్బంది అంతా కలిసి అద్భుతంగా పని చేసి సంస్థను నష్టాల నుండి బయట పడేటట్లుగా చేసారు. గౌరవ మంత్రిగారు ఆర్టీసీ ఎందుకు నష్టపోతున్నదనేందుకు కారణాలు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం బస్ పాసుల రాయితీ, వికలాంగులకు సంబంధించిన రాయితీ, ఉద్యోగులకు సంబంధించిన రాయితీలను ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వాలు వీటికి రాయితీలు ఇవ్వలేదు. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి సంవత్సరం కూడా గత సంవత్సరానికి సంబంధించిన రాయితీలను కూడా చెల్లిస్తున్నది. కొత్త బస్సుల కొనుగోలు కోసం ఆర్టీసీ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం సహాయం చేస్తోంది.

అదేవిధంగా సంస్థకి ఎక్కువ నష్టాలు వస్తున్నాయన్న ఉద్దేశ్యంతో జీహెచ్ఎంసి దాదాపు రూ.350 కోట్లు ఇవ్వడం జరిగింది. ఇంకా అనేక రకాలుగా నష్టాలు వస్తుంటే కూడా ప్రభుత్వం సహాయం చేస్తోంది. అంటే ప్రభుత్వం ఇన్ని రకాలుగా ఆర్థిక సహాయం చేస్తున్నప్పటికీ ఆర్టీసీ సంస్థ తీసుకోవాల్సిన నిర్ణయాలు కొన్నింటిని తీసుకోవడం లేదని ఐఐఎం, బెంగుళూరు వారు ఒక రిపోర్టు ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా ఆ సంస్థలో న్యాయ విరుద్ధమైన వ్యవహారాలు జరుగుతున్నాయని, ప్రైవేటు బస్సుల వారు ఒకే నెంబర్‌తో నాలుగు బస్సులు అనేకమార్గాలలో నడుపుతున్నారని దానిని నియంత్రించాలనే సూచనలను తెలిపారు.

మన రాష్ట్రంలో 3,617 మార్గాలలో 10,300 బస్సులు 34 లక్షల కిలోమీటర్లు ప్రతి రోజూ తిరుగుతున్నాయి. ఏ మార్గాలలో బస్సులను నడపడం వలన ఎక్కువ లాభాలు వస్తాయనే దానిని గురించి ఆలోచించాలి. ఇంధన వినియోగం తక్కువ కావడానికి ఏ పద్ధతులను పాటిస్తున్నారు? న్యాయ విరుద్ధమైన పద్ధతిలో వాహనాలు నడుపుతున్న వారి మీద ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు? ఇన్ని రకాలుగా ప్రభుత్వం సహాయ సహకారాలను అందిస్తున్న సందర్భంలో నష్టాలు రాకుండా సంస్థ ఎటువంటి చర్యలను అనుసరిస్తున్నది? వంటి విషయాలను తెలియజేయ వలసిందిగా తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ పి. మహేందర్ రెడ్డి:-** అతి తక్కువ మంది ప్రయాణికులు ఉన్నా కూడా పల్లె వెలుగు బస్సులను నడిపించ వలసి వస్తోంది. దాని ద్వారా ఆర్టీసీ సంస్థకు చాలా నష్టాలు వస్తున్నాయి. దూర ప్రాంతాలకు బస్సులను నడిపితే లాభాలు ఎక్కువగా వస్తాయి. అందుకే అటువంటి ప్రయత్నాలు చేస్తున్నాము. మినీ బస్సులను నడిపించమని గౌరవ ముఖ్యమంత్రిగారు ఆదేశించడం వలన 230 మినీ బస్సులను నడిపిస్తున్నాము. ఆర్టీసీ సంస్థకు సంబంధించిన స్థలాలలో మినీ థియేటర్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లు, పెట్రోలు బంకులను ఏర్పాటు చేయడం ద్వారా లాభాలను ఆర్జించవచ్చని అటువంటి ప్రయత్నాలు కూడా చేస్తున్నాము. ఇంధన పొదుపు విషయంలో కూడా మూడు సంవత్సరాల నుండి దేశంలోనే టిఎస్ఆర్టీసీ అగ్రస్థానంలోనే ఉంది. మా ఎం.డి.గారు మరియు సిబ్బంది అందరూ ఇంధనం పొదుపు కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్టీసీ సంస్థకు 2015-16 రూ.776 కోట్లు, 2016-17 రూ.749 కోట్లు, 2017-18 రూ.476 కోట్లు నష్టాలు వచ్చాయి. గత సంవత్సరం జనవరి నెలలో రూ.30 కోట్ల మేరకు నష్టం తగ్గింది.

నష్టాలను తగ్గించడానికి సంస్థ చేసిన ప్రయత్నాలు ఫలించి 97 బస్ డిపోలకు గాను 27 డిపోలలో ఇప్పుడే లాభాలు రావడం మొదలు అయ్యాయి. నష్టాలలో ఉన్న 49 డిపోలను కూడా లాభాల బాట పట్టేలా ప్రయత్నాలు చేస్తున్నాము. గౌరవ ముఖ్యమంత్రి గారు బడ్జెట్‌లో దాదాపు రూ.1000 కోట్లను రోడ్డు రవాణా సంస్థకు కేటాయించడం జరిగింది. కొత్త బస్సులను తీసుకొని దూర ప్రాంతాలకు ప్రయాణించే విధంగా చర్యలు తీసుకుంటున్నాము. డా.పల్లా రాజేశ్వర్ రెడ్డిగారు అడిగిన ప్రశ్నకు సమాధానంగా అక్రమ రవాణాను అరికట్టడానికి రవాణా శాఖ మరియు ఆర్టీసీ సంస్థ కూడా చర్యలు తీసుకుంటున్నది. అదే విధంగా ఒక బస్సు నెంబర్ మీద రెండు, మూడు బస్సులను నడుపుతున్నారన్నారు. అటువంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నవారు ఎంత పెద్ద స్థాయిలో ఉన్న వారైనా వారి మీద కేసులు పెట్టి, అటువంటి చర్యలను అరికట్టి, ఆర్టీసీ సంస్థకు లాభాలు వచ్చే విధంగా తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నాను.

## వయో వృద్ధుల కొరకు సంక్షేమ పథకాల అమలు

ప్రశ్న నెం. 2578(5)

సర్వశ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి మరియు సబావత్ రాములు నాయక్, ఎం.ఎల్.సి.లు,:- గౌరవనీయులైన రోడ్లు, భవనాలు, మహిళ, శిశు అభ్యుదయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో వయోవృద్ధుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాల వివరాలు ఏమిటి;

ఆ) ఇందుకు వార్షికంగా ఖర్చు చేస్తున్న మొత్తం ఎంత;

ఇ) ప్రభుత్వం నిర్వహిస్తు న్న వృద్ధాశ్రమాల సంఖ్య ఎంత; వాటిని ఏ స్థలాలలో నిర్వహించడమవుతున్నది;

ఈ) ఇందుకు సంబంధించి వారికి అవగాహన శిబిరాలను నిర్వహించడమవుతున్నదా?

**గౌరవనీయులైన రోడ్లు, భవనాలు, మహిళ, శిశు అభ్యుదయ శాఖ మంత్రి(శ్రీ తుమ్మల నాగేశ్వర రావు):-** అ) రాష్ట్రం అమలు చేస్తున్న కార్యక్రమాల జాబితాను అనుబంధం రూపంలో సభా సమక్షంలో ఉంచడమయింది.

ఆ)2017-2018 సంవత్సరానికి వృద్ధుల పథకాల కోసం జాతీయ విధానం క్రింద రూ.2.04 కోట్ల మేరకు మొత్తాలను కేటాయించడమయింది.

ఇ) రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాలలో రెండు ప్రభుత్వ వృద్ధాశ్రమాలు పనిచేస్తున్నాయి. జనగామ జిల్లాలో ఎన్‌జిఓ నిర్వహించే వృద్ధాశ్రమానికి ఆర్థిక సహాయాన్ని సమకూర్చడమవుతున్నది.

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం రామ్‌పూర్ గ్రామంలో, కామారెడ్డి జిల్లా, కామారెడ్డిలో ఖమ్మం జిల్లా ఖమ్మంలో వృద్ధాశ్రమాలను నిర్వహించడానికి ఇండియన్ రెడ్

క్రాస్ సొసైటీ సంబంధిత జిల్లా బ్రాంచ్‌లకు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయడమయింది.

వృద్ధుల పథకం కోసం ఏకీకృత కార్యక్రమం క్రింద కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో తెలంగాణ రాష్ట్రంలో 17 వృద్ధాశ్రమాలు, ఒక సంచార మెడికేర్ యూనిట్ ఒక డే కేర్ సెంటర్ పనిచేస్తున్నాయి.

ఈ) అవునండీ.

**శాసన పరిషత్తు సభ్యులు అడిగిన ప్రశ్న నెం. 2578కి అనుబంధ సమాధానం.**

రాష్ట్రంలోని సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం ఈ క్రింది కార్యక్రమాలను అమలు చేయడమవుతున్నది.

1. సామాజిక భద్రత పింఛన్ల క్రింద, 65 సంవత్సరాలు ఆ పైబడిన వయస్సు గల 13,37,222 మంది పేద వృద్ధులకు వృద్ధాప్య పింఛన్‌గా నెల ఒక్కింటికి రూ.1000/- మొత్తాన్ని తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేస్తున్నది.

2. జిహెచ్ఎంసి ప్రాంతంలో 54 డే కేర్ కేంద్రాలు, 18 ఇ-గ్రంథాలయాలు పనిచేస్తున్నాయి.

3. సంచార ఆరోగ్య సంరక్షణ యూనిట్ - 104 గ్రామాలను సందర్శిస్తున్నది.

4. ఆసుపత్రులలో సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక క్యూ సౌకర్యాలు.

5. వయోవృద్ధ రోగులకు అనువైన ప్రత్యేక ఫర్నిచర్‌తో సన్నద్ధంగా ప్రత్యేక ఫ్యాకల్టీల సైకియాట్రిస్ట్‌తో హైదరాబాద్, నిమ్స్‌లో ప్రత్యేక జెరియాట్రిక్ శాఖ పనిచేస్తున్నది. జెరియాట్రిక్ వార్డులు తాండూరు, సంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లా ఆసుపత్రులలో కూడా పనిచేస్తున్నాయి.

6. టిఎస్ఆర్‌టిసి నిర్వహిస్తున్న బస్సులలో సీనియర్ సిటిజన్ల కోసం రెండు సీట్లు రిజర్వు చేయబడినవి.

7. 2007, తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం క్రింద జిల్లాలో నిర్వహణ ట్రిబ్యునల్స్, అప్పిలేట్ ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటు చేయడమయింది.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:-** అధ్యక్షా, వయో వృద్ధులను కొడుకులు, బిడ్డలు ఉన్నా ఎవ్వరూ కూడా పట్టించుకోకుండా బయటకి వెళ్లగొడుతున్న సంఘటనలకు సంబంధించిన విషయాలను మనం రోజూ వార్తా పత్రికలలో చూస్తున్నాము. ఆ వార్తలను చదువుతుంటే మనసు చలించిపోతోంది. వారికి హక్కులు ఉన్నాయా? లేవా అనే భావన కలుగుతుంది. ఆ వృద్ధులకు ఉండేటటువంటి హక్కులు ఏమిటి అనే అంశం మీద వారికి అవగాహన కల్పించవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్స్ ద్వారా అవగాహన సెంటర్స్‌ను నిర్వహించినట్లైతే వృద్ధులకు కొంత స్వాంతన చేకూర్చినట్లుగా ఉంటుంది. వీటికి సంబంధించిన విషయాలపై స్పష్టమైన వివరణ ఇవ్వవలసిందిగా తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ తుమ్మల నాగేశ్వర రావు:** అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు వృద్ధులు కూడా ఆత్మగౌరవంతో జీవించే విధంగా దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 60 సంవత్సరాలు పైబడిన వారందరికీ నెలకు రూ.1000/- చొప్పున గౌరవ ముఖ్యమంత్రిగారు పింఛను మంజూరు చేశారు. ఈ పథకం వల్ల తెలంగాణ రాష్ట్రంలో వృద్ధులు ఎవరి మీద ఆధారపడకుండా ఆనందంగా బ్రతుకుతున్నారు. అదే విధంగా ఎక్కడైతే వృద్ధులకు అన్యాయం జరుగుతుందో అటువంటి ప్రాంతాలలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలో అప్పిలేట్ అథారిటీలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. సభ్యులు పాతూరి సుధాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ తెలిపినటువంటి అంశాలను పరిశీలించి తగు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

**పరిశ్రమల ఏర్పాటు కొరకు ఎస్సీ మరియు ఎస్టీ అభ్యర్థులకు రుణాల మంజూరు**

ప్రశ్న నెం. 2560 (6)

సర్వశ్రీ డి. రాజేశ్వరరావు మరియు సభావత్ రాములు నాయక్, ఎం.ఎల్.సి.లు,:- గౌరవనీయులైన సమాచార సాంకేతిక విజ్ఞాన మరియు పరిశ్రమల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో పరిశ్రమలను నెలకొల్పడానికి ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూచీ లేకుండా రూ.5 కోట్ల విలువ గల రుణాలను మంజూరు చేసే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా;

ఆ) ఎస్సీ. ఎస్టీ, మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 35 శాతం చొప్పున సబ్సిడీ అంశాన్ని కల్పించే ప్రతిపాదన కూడా ఏదైనా ఉన్నదా;

ఇ) రూ. 75 లక్షల వరకు మాత్రమే సబ్సిడీ ఇస్తున్న విషయం వాస్తవమేనా;

ఈ) అయితే, మొత్తం రుణ పైకంపై సబ్సిడీ అంశాన్ని పెంచే విషయం పరిశీలనలో ఉన్నదా?

**గౌరవనీయులైన సమాచార సాంకేతిక విజ్ఞాన & పరిశ్రమల శాఖ మంత్రి (శ్రీ కె.తారక రామారావు)ః–** అ) అవునండీ. ఎస్‌సిపి నిధుల నుండి రూ. 200 కోట్లు, టిఎస్‌పి నిధుల నుండి రూ.100 కోట్లను కేటాయించడం ద్వారా రూ.5.00 కోట్లు (70 శాతం కాలపరిమితి రుణం, 20 శాతం మార్జిన్ మనీ రుణం, మిగిలిన 10 శాతం లబ్ధిదారుని విరాళం) వరకు ప్రాజెక్టు వ్యయంతో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలను సమకూర్చడానికి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు టి–ప్రైడ్ పథకంలో ప్రత్యేక రుణ పథకాన్ని ప్రతిపాదించింది. పథకం మార్గదర్శకాలు తుది దశలో ఉన్నాయి.

ఆ) అవునండీ. ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం చొప్పున ఎస్సీ, ఎస్టీ మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రాజెక్టు వ్యయంలో 45 శాతం చొప్పున పెట్టుబడి సబ్సిడీని సమకూరుస్తూ పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ టి–ప్రైడ్ పథకాన్ని అమలు చేస్తున్నది.

ఇ) అవునండీ.

ఈ) లేదండీ.

## కరీంనగర్ కొరకు పట్టణాభివృద్ధి సంస్థ

ప్రశ్న నెం. 2744 (7)

డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి, సర్వశ్రీ నారదాసు లక్ష్మణ్‌రావు మరియు టి. భానుప్రసాదరావు, ఎం.ఎల్.సి.లుః– గౌరవనీయులైన సమాచార సాంకేతిక విజ్ఞాన, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారూ దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) కరీంనగర్ పట్టణాభివృద్ధి నిమిత్తం విడిగా ఒక పట్టణాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఆ విషయం వివరాలేమిటి;

ఇ) దానిని ఎప్పటిలోగా ఏర్పాటు చేయడమవుతుంది?

**గౌరవనీయులైన సమాచార సాంకేతిక విజ్ఞాన, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ కె. తారక రామారావు)ః–** అ) అవునండీ.

ఆ)&ఇ) కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ ప్రాంతం, చుట్టుపక్కల 71 గ్రామాలను వర్తింపు చేస్తూ, "శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ" 24-10-2017 తేదిగల ఎం.ఎ.&యు.డి. (ప్లానింగ్.I(2)) శాఖ జి.ఓ.ఎంఎస్. నెం.270లో కరీంనగర్‌కు పట్టణాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయడమయింది

**డా. పల్లా రాజేశ్వర్ రెడ్డిః–** అధ్యక్షా, ఈ రాష్ట్రంలో పట్టణాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఆ విధంగా అభివృద్ధి చెందే క్రమంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేషన్స్ అన్నింటిని కూడా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా చేయడానికి నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషదాయకం. అయితే ఇక్కడ కొన్ని సమస్యలు వస్తున్నాయి. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తున్నప్పుడు 5, 10 కిలోమీటర్ల రేడియస్‌లో ఉన్న గ్రామాలను కలుపుతున్నప్పుడు ఆ చుట్టు ప్రక్కల గ్రామాల అభివృద్ధి ఈ ఫేజ్‌తో కలవడం లేదు. అక్కడ ఉండే మిగతా మౌలిక సదుపాయాలు కూడా అలానే ఉండటమే కాకుండా వారికి పన్నుల భారం కూడా అదనంగా పడుతున్నాయి.

కాబట్టి, అర్బన్ డెవలప్‌మెంట్‌లో కలుపుతున్నప్పుడు ఈ అభివృద్ధి ఆ 71 గ్రామాలకు కూడా వర్తించే విధంగా ఏమన్నా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారా? కార్పోరేషన్స్ అన్నింటికి గౌరవ ముఖ్యమంత్రి గారు దాదాపు రూ.100 కోట్లు ఇస్తామని చెప్పి ఇచ్చారు. కరీంనగర్‌ను 'స్మార్ట్ సిటీ' గా ప్రకటించి కేంద్ర ప్రభుత్వం కూడా కొన్ని నిధులను విడుదల చేసింది. మానేరు రివర్ ఫ్రంటేజ్ కాని, కేబుల్ బ్రిడ్జ్ కాని చేయాలని చెప్పి కొన్ని కొత్త ప్లానులు జరిగాయి. ఈ విధంగా అంటే మూడు రకాలుగా కార్పోరేషన్స్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు, స్మార్ట్ సిటీకి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు, వివిధ రకాల ప్రాజెక్టులు, అర్బన్ డెవలప్‌మెంట్ ద్వారా ఏమన్నా నిధులు కేటాయించడం జరిగిందా? వీటన్నింటిని ఇంటిగ్రేడ్ చేసి ఒక అద్భుతమైన పట్టణంగా తయారు చేయడానికి సమగ్ర ప్రణాళిక ఏమన్నా రూపొందించారా? అని తమరి ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ నారదాసు లక్ష్మణ్ రావు (స్థానిక సంస్థలు – కరీంనగర్)ః–** అధ్యక్షా, ఉత్తర తెలంగాణలో కరీంనగర్ పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. హైదరాబాదు తరువాత ఇది గొప్ప కేంద్రంగా ఉంది. 71 గ్రామాలతో శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయడం చాలా సంతోషించదగిన విషయం. కరీంనగర్ ఒక నగరంగా

అభివృద్ధి చెందడానికి ఈ సంస్థ ఎంతోగానో తోడ్పడుతుందని భావిస్తున్నాను. ఈ సంస్థను ఏర్పాటు చేశారు కాని దీనికి పాలక మండలిని ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. ఈ పాలక మండలిని ఎప్పుడు ఏర్పాటు చేస్తారు? దానిలో ఏ ఏ రంగానికి సంబంధించిన వారు ఎంతమంది సభ్యులు ఉంటారు? స్థానికంగా ఉన్నటువంటి నగరానికి సంబంధించిన ప్రజా ప్రతినిధులు కూడా అందులో సభ్యులుగా ఉంటారా? దీని యొక్క నిర్మాణ స్వరూపం ఏ విధంగా ఉండబోతోంది? వీటికి ప్రత్యేకమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్నదా? కేటాయిస్తే ఎంత మొత్తాన్ని కేటాయించింది? ఇవన్నీ ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలుపవలసిందిగా గౌరవ మంత్రిగారిని తమరి ద్వారా కోరుతున్నాను.

**శ్రీ కె. తారక రామారావు:–** అధ్యక్షా, రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత ముఖ్యమంత్రిగారి సారథ్యంలో చరిత్రలో ఏనాడు లేని విధంగా మొట్టమొదటి సారి కార్పొరేషన్లకు బడ్జెట్‌లోనే నేరుగా నిధులను కేటాయించే ఒక మంచి సాంప్రదాయానికి కూడా ఈ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

**10.40 ఉ.** వరంగల్ పట్టణాభివృద్ధి కొరకు రూ.300 కోట్లు కేటాయించడంతోపాటు, మిగిలిన నాలుగు కార్పొరేషన్లు ఏవైతే ఉన్నాయో వాటికి వంద కోట్ల రూపాయల చొప్పున కేటాయించడం జరిగింది. అవి నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం మరియు రామగుండం. ఈ ప్రాంతాలలో పట్టణీకరణ శరవేగంగా జరుగుతున్నందున, అభివృద్ధి కొరకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తూ, తెలంగాణ ప్రభుత్వం ఒక మంచి సంప్రదాయానికి శ్రీకారం చుట్టిందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. భారతదేశ వ్యాప్తంగా చూసినట్లయితే దాదాపు 30 శాతం ప్రజానీకం పట్టణాలలో నివసిస్తుండగా, తెలంగాణ రాష్ట్రంలో 40 శాతం మంది ప్రజలు పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్నట్లుగా ఒక సర్వేలో తేలింది.

ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్నది. దాని ప్రకారం 15,000 పై చిలుకు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలను నగర పంచాయతీ లేదా మున్సిపాలిటీలుగా ప్రకటించినందున, దానికి అనుగుణంగా మన రాష్ట్రంలో 45 శాతం జనాభా పట్టణ ప్రాంతాలలో నివసించబోతున్నారు. మరి పట్టణీకరణ ఇంత వేగంగా జరుగుతున్న నేపథ్యంలో, ఈ ప్రాంతాలన్నిటిలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి ఉండాలి, ప్రణాళికాబద్ధమైన పురోగతి ఉండాలనే ఉద్దేశ్యంతో, ఈ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అందులో భాగంగానే శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని కరీంనగర్ ప్రాంతంలో, నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఆ ప్రాంతంలో, అలాగే ఖమ్మంలో స్థంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని, అదేరకంగా సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఎక్కడైతే శరవేగంగా పట్టణీకరణ, పురోగతి కనబడుతున్నదో అక్కడ ఈ సంస్థలను ప్రతిపాదించడం జరిగింది. హైదరాబాద్‌కి సంబంధించినంత వరకు ఏ రకంగానైతే హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ 700 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉందో, అదే విధంగా ఇప్పుడు కొత్తగా తలపెట్టిన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ముఖ్య ఉద్దేశ్యం ఆ ప్రాంతాలలో మాస్టర్ ప్లానింగ్ చేయడం, తద్వారా ప్రణాళికాబద్ధమైన పురోగతిని సాధించడం. సాధారణంగా జరిగేది ఏమిటంటే పట్టణ ప్రాంతాలను ఆనుకుని ఉన్న గ్రామ పంచాయతీలలో ప్రణాళికాబద్ధమైన ఆలోచన గతంలో చేయకపోవడం వలన అక్కడ మౌలిక వసతులు కూడా లేకుండా ఇబ్బంది పడే పరిస్థితులు ఉన్నాయి. అందుకే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కొరకే ఈ కార్యక్రమాన్ని ప్రధానంగా చేపట్టడం జరిగింది.

గౌరవ సభ్యులు డా. పల్లా రాజేశ్వర రెడ్డి మరియు శ్రీ నారదాసు లక్ష్మణరావు గార్లు పట్టణ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు మరియు మున్సిపాలిటీల ఆదాయ వనరుల గురించి అడగడం జరిగింది. వాటికి నాలుగు మార్గాల ద్వారా ఆదాయం సమకూరుతోంది. ఒకటి పన్నుల రూపేణా సమకూరే వాటి స్వంత ఆదాయ వనరు, రెండు కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులు, మూడు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే వనరులు మరియు నాలుగవది ఆర్థిక సంఘం ద్వారా వచ్చే డెవల్యూషన్ ఫండ్స్.

తెలంగాణ ప్రభుత్వం చాలా వినూత్నంగా ఆలోచించి, గతంలో ఎన్నడూ జరగని విధంగా ఈ మధ్య కాలంలో హైదరాబాద్ మహా నగర మున్సిపాలిటీ ఇటీవలే మున్సిపల్ బాండ్లు జారీ చేయగా, అది బాంబే స్టాక్ ఎక్స్ఛేంజిలో లిస్ట్ కావడం కూడా జరిగిందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. అదే విధంగా తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ TUFIDC పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేసి, ఆ సంస్థ ద్వారా మౌలిక

వసతుల విషయంలో ప్రత్యేకమైన దృష్టిని పెట్టి, ఆ సంస్థ ద్వారా కూడా నిధులు విడుదల చేస్తున్నాము. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంలో ఉన్న వరంగల్, కరీంనగర్ పట్టణాలను స్మార్ట్ సిటీలుగా గుర్తించిన నేపథ్యంలో మనకు కేంద్రం నుండి వచ్చే అదనపు నిధుల ద్వారా ఆయా ప్రాంతాలలో మౌలిక వసతులను కల్పించి, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని మనవి చేస్తున్నాను. వీటి సమాహారంగా తెలంగాణ రాష్ట్రంలో అన్ని గ్రామ మరియు పట్టణ ప్రాంతాలలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి జరుగుతుందని మనవి చేస్తున్నాను. అభివృద్ధిని వేగవంతం చేసి, పర్యవేక్షణ జరపడానికి పాలక మండలులను త్వరలోనే నియమించబోతున్నాము. అందులో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి రంగంలో నిపుణులకు స్థానం కల్పిస్తూ, ప్రజల నుండి వచ్చిన వారికి, విశేషమైన అనుభవం గడించిన వారికి అలాగే అర్బన్ ప్లానింగ్ పట్ల అవగాహన ఉన్నవారికి అందులో స్థానం కల్పించడం జరుగుతుంది. అవసరమైతే శాసన పరిషత్తు సభ్యులు కూడా ఈ విషయంలో తగు సూచనలు, సలహాలను ఇవ్వవలసిందిగా కోరుతున్నాను. గౌరవ సభ్యులు డా. పల్లా రాజేశ్వర రెడ్డిగారు మాట్లాడుతూ, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు రావడం వల్ల చుట్టుపక్కల గ్రామాలలో పన్నులు పెరుగుతున్నాయి కాని, మౌలిక వసతుల విషయంలో మార్పులు రావడం లేదని ఒక మాట చెప్పారు. అది పాక్షికంగా మాత్రమే వాస్తవం. ఎందుకంటే పన్నులు కొత్తగా పెరగవు. డెవలప్‌మెంట్ చార్జీలు మాత్రమే పెరుగుతాయి. ఉదాహరణకు కరీంనగర్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో కొత్తగా 71 గ్రామాలు వచ్చాయి. అక్కడ కొత్తగా ఏదైనా లేఔట్ జరిగితే, లేఔట్ ఛార్జెస్ పెరుగుతాయి. అంతే తప్ప పన్నులు పెరగవు. కార్పొరేషన్ పరిధిలోకి రావడం వేరు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి రావడం వేరు. వసూలు చేసిన డెవలప్‌మెంట్ ఛార్జెస్ కూడా ఆ ప్రాంత అభివృద్ధి కొరకే ఖర్చు పెట్టడం జరుగుతుంది కాబట్టి, ఆ విషయంలో ప్రజలకు కాని, గౌరవ సభ్యులకు కాని ఆందోళన అవసరం లేదని, మరింత సమర్థవంతంగా అభివృద్ధికి, ప్రజలకు సేవలు అందించడానికి అవకాశం ఉంటుందని గౌరవ సభ్యులు గుర్తించాలని తమరి ద్వారా గౌరవ సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ నారదాసు లక్ష్మణరావు**:- కొత్తగా ఏర్పడిన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు పాలక మండళ్లను ఎప్పటిలోగా ఏర్పాటు చేస్తారు?

**శ్రీ కె. తారక రామారావు**:- సాధ్యమైనంత త్వరలో ఏర్పాటు చేస్తాము.

## ఎం.ఇ.ఓ.లుగా పదోన్నతులు

ప్రశ్న నెం. 2757(8)

శ్రీ ఎన్.రామచంద్ర రావు, ఎం.ఎల్.సి.,:- గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి (విద్యా శాఖ) గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో 250 మండలాల్లో రెగ్యులర్ లేదా శాశ్వత ఎంఇఓలు ఎవరూ లేరన్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, అందుకు గల కారణాలేమిటి;

ఇ) గెజిటెడ్ హెడ్ మాస్టర్లకు ఎంఇఓలుగా అదనపు ఛార్జ్‌ని ఇవ్వడం జరిగిందన్న విషయం కూడా వాస్తవమేనా;

ఈ) అయితే ఎంఇఓలుగా అర్హత గల సీనియర్ టీచర్లకు పదోన్నతులను కల్పించడానికి తీసుకున్న/తీసుకుంటున్న చర్యలేమిటి?

**గౌరవ ఉప ముఖ్యమంత్రి (విద్యా శాఖ) (శ్రీ కడియం శ్రీహరి)**:- అ) అవునండీ. మంజూరైన 528 ఎంఇఓ పదవులలో కేవలం 43మంది రెగ్యులర్ ఎంఇఓలు పనిచేస్తున్నారు. మిగిలిన 485 పదవులకు హెడ్ మాస్టర్లను ఇన్-ఛార్జ్‌లుగా ఏర్పాటు చేయడం జరిగింది.

ఆ) 23-6-2017 తేదీన గౌరవ రాష్ట్రపతిగారు చేసిన సవరణల ప్రకారం ఏకీకృత సర్వీసు నిబంధనలను 2017, ఆగస్టులో గౌరవ హైకోర్టులో సవాలు చేయడమయింది. ఈ అంశం కోర్టు విచారణలో ఉంది. గౌరవ హై కోర్టు యథాతథ స్థితి ఆదేశాలను జారీ చేసింది. అందువల్ల ఎం.ఇ.ఓ. పదవులకు పదోన్నతులు చేపట్టడానికి వీలు లేదు.

ఇ) అవునండీ.

ఈ) పెండింగ్ డబ్ల్యుసిలపై గౌరవ హై కోర్టు ఆదేశాల ఆధారంగా ఈ విషయంలో ప్రభుత్వం ఆ ప్రకారంగా చర్యను చేపడుతుంది.

**శ్రీ ఎన్. రామచంద్ర రావు (పట్టభద్రుల నియోజక వర్గం-మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్)**:- అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ ఎంఇఓల ఖాళీలు భర్తీ కావడం లేదు. చివరిసారిగా 2005వ సంవత్సరంలో భర్తీ చేశారు. అనేక మండలాలలో ఎంఇఓలు లేకపోవడం వలన ప్రాథమిక విద్యా వ్యవస్థ కుంటుపడింది. ముఖ్యంగా సరైన పర్యవేక్షణ

లేకపోవడం వలన పిల్లలు నష్టపోతున్నారనే విషయం మనం గుర్తించవలసి ఉంది. ఆనాడు ఉపాధ్యాయ సంఘాలు శ్రీ వెంకయ్య నాయుడుగారి చొరవతో ఏకీకృత సర్వీసు రూల్స్‌కి గౌరవ రాష్ట్రపతిగారి ఆమోదం పొందడం జరిగింది. తరువాత కొందరు కోర్టుకి వెళ్లడం, దానిపైన అప్పీలు చేయకపోవడం వలన దానికి స్టే వచ్చిందని చాలామంది భావిస్తున్నారు. ఇప్పటికైనా ఆ స్టేను వెకేట్ చేయిస్తే తప్ప, ఎంఇఓల నియామకాలు పూర్తికావని మనవి చేస్తున్నాను.

**శ్రీ కాటేపల్లి జనార్థన్ రెడ్డి (ఉపాధ్యాయుల నియోజకవర్గం - మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్):-** అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు మరియు గౌరవ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి గారి చొరవతో కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రపతి ఉత్తర్వులు తీసుకురావడం జరిగింది. పంచాయతీ రాజ్ వ్యవస్థలో పని చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు కోర్టుకి వెళ్లడం, హైకోర్టులో స్టే రావడం, ఆ కేసులో కేంద్ర ప్రభుత్వాన్ని కూడా ఒక పార్టీ చేయడం వల్ల ఎంఇఓ పోస్టులు భర్తీ కాకుండా ఉండిపోయాయి. మన రాష్ట్ర ప్రభుత్వం ఆ స్టేని వెకేట్ చేయించడం కొరకు ప్రయత్నం చేస్తున్నది. మరొక విషయం ఏమిటంటే ఈ ఎంఇఓ పోస్టులు మరియు హెడ్ మాస్టర్ పోస్టులు సమాన స్థాయిలో ఉన్నాయి. కాబట్టి ఎంఇఓలను అప్‌గ్రేడ్ చేసే ఆలోచన ఏమైనా ఉన్నదా? అంటే తదుపరి ప్రమోషన్ పోస్టుగా ఎంఇఓ పోస్టుని అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందా తెలుపవలసిందిగా కోరుతున్నాను.

మరొక విషయం ఉప విద్యాశాఖాధికారి అంటే డెప్యూటి ఎడ్యుకేషన్ ఆఫీసర్ల పోస్టులు చాలా తక్కువగా ఉన్నాయి. ఆ పోస్టుల సంఖ్య ఎప్పుడో నిర్ణయించడం వల్ల, ప్రస్తుత అవసరాలకు తగినట్లు లేవని మనవి చేస్తున్నాను. అప్పుడు ఒక డెప్యూటి ఇ.ఓ. ఆధీనంలో 40,50 ఉన్నత పాఠశాలలు ఉండేవి. అందువల్ల వారు సమగ్రంగా పాఠశాలలు తనిఖీ చేసేవారు. ప్రతి పాఠశాలను రెండు, మూడు రోజుల పాటు తనిఖీ చేస్తూ, ప్రతి ఉపాధ్యాయుడు బోధించే పాఠ్యాంశాలను పరిశీలించి, వారికి తగు సూచనలు చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ పాఠశాలల సంఖ్య 250-350 వరకు పెరిగింది. అందువల్ల ఉప విద్యాధికారులు సరైన పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. అందువల్ల దయచేసి ఆ ఉప విద్యాధికారి పోస్టులను పెంచినట్లయితే పర్యవేక్షణ సక్రమంగా ఉంటుంది. కాబట్టి నియోజకవర్గానికి ఒక ఉప విద్యాధికారి పోస్టును ఏర్పాటు చేయవలసిందిగా కోరుతున్నాను.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:-** అధ్యక్షా, రాష్ట్రంలో మండల విద్యాధికారి పోస్టులు ప్రాథమిక విద్యను సమర్థవంతంగా నడిపించాలనే ఉద్దేశ్యంతో పర్యవేక్షణాధికారులుగా నియమించడం జరుగుతోంది. 2005 నుండి నేటి వరకు అంటే గడచిన 13 సంవత్సరాలుగా ఈ పోస్టులు భర్తీ కావడం లేదు. అందువల్ల ప్రాథమిక విద్య పూర్తిగా కుంటుపడేటటువంటి ప్రమాదం ఏర్పడింది. అసలు ఈ పోస్టులు ఎవరి పరిధిలో ఉంటాయి? విద్యాశాఖనా లేక పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఉంటాయా? ఈ విషయం ముందుగా స్పష్టం చేయాలి. పంచాయత్ రాజ్ శాఖ వారు ఉపాధ్యాయుల జీతభత్యాలు చెల్లిస్తుంటే 13 సంవత్సరాల పాటు మరి భర్తీ చేయకుండా ఎందుకు ఉండిపోయారు? లీగల్‌గా కాంప్లికేషన్లు ఉన్నట్లయితే, ప్రత్యామ్నాయంగా ఏమి చేయాలో ఆలోచించాలి. ప్రభుత్వం ఇన్ని నిధులు ఖర్చు పెడుతున్నప్పటికీ, ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. కోర్టులో ఉందనే సాకుతో ఏళ్ల తరబడి కాలయాపన చేయడం తగదు. దాని వలన ప్రభుత్వానికి అపఖ్యాతి వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, పోస్టుల భర్తీ గురించి స్పష్టత ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

**శ్రీ పూల రవీందర్ (ఉపాధ్యాయుల నియోజక వర్గం-వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ):-** అధ్యక్షా, ఇరవై సంవత్సరాల సమస్య ఇది. దీని గురించి తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత గౌరవ ముఖ్యమంత్రిగారు మరియు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి గారు మరియు విద్యాశాఖ కార్యదర్శిగారు ఎంతో శ్రద్ధ తీసుకుని, కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చి, రాష్ట్రపతి ఉత్తర్వులు తీసుకురావడానికి చాలా కష్టపడ్డారు. అందుకు మేము వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాము. ప్రస్తుతం దీనిపై హైకోర్టులో స్టే ఉన్నది. మా ఉద్దేశ్యం ఏమిటంటే ఎంతో కష్టపడి తెచ్చుకున్న ఉత్తర్వులను అమలు కానటువంటి పరిస్థితి. దీనిని తొలగించాలంటే స్టే ని వెకేట్ చేయించి, ఏప్రిల్, మే నెల లోపు ఖాళీలను భర్తీ చేసినట్లయితే రాష్ట్రంలో ఉన్న ప్రాథమిక విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు కేవలం మూడు శాతం ఉండి, వారు ఇవి మా పోస్టులే అని కోర్టులో కేసులు వేయడం జరిగింది. వాస్తవంగా పనిచేస్తున్నవారికి ఆ కేసుతో సంబంధమే లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా, మండల్ విద్యాధికారి పేరును మార్చడమా, లేక హెడ్ మాస్టర్ యొక్క స్కేలును పెంచి,

పోస్టును అప్‌గ్రేడ్ చేసి మధ్యలో ఒక పోస్టు ఉండేటట్లుగా అవసరమైతే న్యాయపరమైన సలహా కూడా తీసుకుంటే బాగుంటుందని మా అభిప్రాయం. కాబట్టి ఈ నెల రోజుల్లో కేంద్ర హోం డిపార్టుమెంటు మీద మరొకసారి ఒత్తిడి తీసుకువచ్చి, కోర్టులో అప్పీల్ చేయాలని కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరిః-** అధ్యక్షా, ఈ ఎంఇఓ పోస్టులు రెగ్యులర్‌గా భర్తీ చేయలేకపోవడం వలన, సక్రమంగా పాఠశాలలు తనిఖీ జరగకపోవడం వలన ప్రాథమిక విద్యా వ్యవస్థకు కొంత మేరకు నష్టం కలుగుతున్న మాట వాస్తవమే. అయితే ఈ ఎంఇఓ పోస్టులు ప్రమోషన్ ద్వారా భర్తీ చేయవలసిన పోస్టులు. ఇందులో ప్రభుత్వ ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల ఉపాధ్యాయులు అనే రెండు కేటగిరీల మధ్య సీనియారిటీ వివాదం వల్ల దాదాపు ఇరవై సంవత్సరాలుగా ఈ సమస్య కొనసాగుతున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే 2015 సెప్టెంబర్‌లో సుప్రీం కోర్టు ఏకీకృత సర్వీస్ రూల్స్‌కి సంబంధించి ఫైనల్ జడ్జిమెంట్ ఇవ్వడం జరిగింది. అందులో వారు ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను చేయడానికి మాకు ఏ రకమైన అభ్యంతరమూ లేదు, కాకపోతే మీరు ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్‌కు సవరణలు తెచ్చుకోండి, అందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి, రాష్ట్రపతి ఆమోదంతో సవరణలు పొంది, ఏకీకృత సర్వీసు రూల్స్ ప్రకారం ప్రమోషన్లు ఇచ్చుకోవచ్చు అని సుప్రీం కోర్టు జడ్జిమెంటులో చెప్పడం జరిగింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి, కేంద్ర ప్రభుత్వానికి ఏకీకృత సర్వీసు రూల్స్‌కి సంబంధించిన ప్రతిపాదనలు పంపించడం జరిగింది. దాని పైన పలుమార్లు కేంద్ర ప్రభుత్వం దగ్గరకు, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామాత్యులను, ఆ నాడు కేంద్ర మంత్రిగా ఉన్న శ్రీ ఎం. వెంకయ్యనాయుడు గారిని కలిసి, త్వరితగతిన కేంద్ర ప్రభుత్వ ఆమోదం తీసుకురావడం జరిగింది. అనంతరం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత, కొంత మంది ప్రభుత్వ విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దాన్ని ఛాలెంజ్ చేస్తూ, హైకోర్టుని ఆశ్రయించారు. సవరించిన రాష్ట్రపతి ఉత్తర్వులపైన స్టేటస్‌కో మెయింటెయిన్ చెయ్యాలని హై కోర్టు చెప్పడం జరిగింది. ఈ నెల అంటే మార్చి 31న ఆ కేసు హియరింగ్‌కి రాబోతున్నది. ఈ కేసులో అడ్వకేట్ జనరల్‌గారినే అప్పియర్ కావలసిందిగా మేము లేఖ ద్వారా కోరడం జరిగింది. దీని యొక్క ప్రాధాన్యతను గుర్తించి, ఎవరో ఒక అడ్వకేట్ అప్పియర్ అయితే సరిపోదు, అడ్వకేట్ జనరల్ గారే ఈ కేసులో అప్పియర్ కావలసిందిగా చాలా స్పష్టంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం జరిగింది. మార్చి 31వ తేదీన స్టే ను ఎత్తివేయించే ప్రయత్నాలు రాష్ట్ర ప్రభుత్వపరంగా చేస్తున్నాము. ఆ విధంగా స్టే ఎత్తివేస్తే, తక్షణమే ఏకీకృత సర్వీసు రూల్స్‌ను ఏర్పాటు చేసుకుని, గౌరవ సభ్యులు చెప్పినట్లుగా ఏప్రిల్, మే నెలలోనే ఉపాధ్యాయులందరికీ వారివారి సీనియారిటీని బట్టి ప్రమోషన్లు ఇచ్చుకునే అవకాశం ఉంది.

ఒకవేళ అనుకోని విధంగా స్టేటస్‌కో కొనసాగినట్లయితే, ఇందులో కేంద్ర ప్రభుత్వాన్ని కూడా ఒక పార్టీగా చేశారు కాబట్టి , కేంద్ర ప్రభుత్వం కూడా వారి కౌంటర్‌ను దాఖలు చేయవలసిన నేపథ్యంలో, ఒకవేళ స్టేటస్‌కో కంటిన్యూ అయితే ప్రత్యామ్నాయంగా ఏమి చేయాలో మన గౌరవ సభ్యులు చెప్పారు. మన గౌరవ ముఖ్యమంత్రిగారు కూడా విద్యకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తూ, తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచే ప్రయత్నం చేస్తున్నారు. మునుపు ఎన్నడూ లేని విధంగా అనేక సంస్కరణలు తీసుకవచ్చాము. కాబట్టి మన ముందున్న ప్రత్యామ్నాయాలు ఏమిటో గౌరవ సభ్యులందరితో చర్చించి, ఎవరికీ ఇబ్బంది కలుగకుండా, ఆ ప్రత్యామ్నాయ చర్యలు అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటే, దాని ప్రకారం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఏ రకమైన ఇబ్బంది లేదు. కావలసిందల్లా మన పాఠశాలలు బాగా పనిచేయాలి, అందులో చదువుకునే మన పిల్లలకు నాణ్యమైన విద్య అందించబడాలి, మన పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు త్వరితగతిన ప్రమోషన్లు లభించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆలోచన కాని, ఏవో సాకులు చూపుతూ, వాయిదా వేయాలనే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు త్వరలో రావాలి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించబడాలి, పాఠశాలలు బాగా పని చేయాలి అనే ఆలోచనతోనే ముందుకు వెళుతున్నాము. తప్పకుండా మార్చి 31 తరువాత హైకోర్టు నుండి వచ్చే ఆదేశాలను బట్టి నేను గౌరవ సభ్యులతో చర్చించి, ప్రత్యామ్నాయ మార్గాలు ఏవైతే ఉన్నాయో వాటిని పరిశీలించి ముందుకు వెళతామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

## ఆసరా పింఛన్ల క్రమబద్ధమైన చెల్లింపు

ప్రశ్న నెం.2585 (9)

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, శ్రీమతి ఆకుల లలిత, సర్వశ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి మరియు మహమ్మద్ ఆలీ షబ్బీర్, ఎం.ఎల్.సీ.లుః- గౌరవనీయులైన పంచాయతీ రాజ్ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఆసరా పింఛన్ల క్రింద పింఛన్లను పొందడంలో సమస్యలను ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, అందుకు గల కారణాలేమిటి;

ఇ) అర్హులైన లబ్ధిదారులకు క్రమం తప్పకుండా చెల్లించేలా చూడడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి;

ఉ) లబ్ధిదారుల సంఖ్య అధికంగా ఉన్న గ్రామపంచాయతీలో రెండవ బయోమెట్రిక్ మెషీన్‌ను ఏర్పాటు చేయాలనే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందా ?

**గౌరవనీయులైన పంచాయతీ రాజ్ శాఖ మంత్రి (శ్రీ జూపల్లి కృష్ణారావు) ః–** అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు

ఇ) ఆసరా పింఛన్లను క్రమం తప్పకుండా చెల్లించడం కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలను తీసుకుంటున్నది. 38.95 లక్షల మంది ఆసరా లబ్ధిదారులలో 57 శాతం పింఛన్‌దారులకు (22,06,717 మంది లబ్ధిదారులు) తపాలా శాఖ ద్వారా గ్రామ పంచాయతీ స్థాయిలో బయోమెట్రిక్ పరికరాల ద్వారా చెల్లించడం జరుగుతున్నది. 43 శాతం పింఛనుదారులు (16,88,204 మంది లబ్ధిదారులు) బ్యాంకులు అమలు చేస్తున్న ఎస్ఎల్ఐఏ (రాష్ట్రస్థాయి అమలు ఏజెన్సీ) ద్వారా వారి బ్యాంకు ఖాతాలోకి నేరు లబ్ధి బదిలి ద్వారా ఆ మొత్తాన్ని పొందుతున్నారు.. 24 గంటల లోపల లబ్ధిదారులందరి బ్యాంకు ఖాతాలకు పింఛను మొత్తాన్ని సత్వరమే జమ చేయడమవుతుంది. తదుపరి బ్యాంకు ఖాతాలను ఆధార్‌కు అనుసంధానం చేయడమవుతుంది. డిఓపి, బ్యాంకులతో క్రమం తప్పకుండా నిర్వాహణకు చేపట్టడమవుతున్నది.

డి) అవునండి. ఈ విషయాన్ని ఇది వరకే పరిశీలించి, లబ్ధిదారుల సంఖ్య అధికంగా ఉన్న 370 గ్రామ పంచాయతీలు, 141 బ్రాంచి కార్యాలయాలలో 2 నుండి 3 బయోమెట్రిక్ మెషిన్లతో అమలు చేయడమవుతున్నది.

11.00 ఉ. **శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డిః–** అధ్యక్షా, రాష్ట్రంలో పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారులు సుమారు 40 లక్షల మంది ఉన్నారు. ఇందులో 57 శాతం మంది లబ్ధిదారులకు పోస్టాఫీసుల ద్వారా పెన్షన్లు ఇస్తున్నాం. అదే విధంగా 43 శాతం మందికి బ్యాంకుల ద్వారా ఇస్తున్నాం, వాళ్లకు బ్యాంకుల్లో అమౌంటు జమ అవుతోంది. మనం వృద్ధాప్య పింఛన్లు, వితంతువు పింఛన్లు, దివ్యాంగుల పింఛన్లు, ఒంటరి మహిళలకు పింఛన్లు, చేనేత, గీత, బీడీ కార్మికులకు పింఛన్లు మంజూరు చేస్తున్నాం. ఈరోజు రాష్ట్రంలో గ్రామాలలోని వృద్ధులు, వికలాంగులు ఎవరైతే ఉన్నారో వాళ్లందరూ కూడా మా పెద్ద కొడుకు కెసిఆర్ ఇస్తున్నాడనే మాట అనడం వినబడుతోంది. అయితే అక్కడక్కడ పోస్టాఫీసుల ద్వారా పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారులు మాత్రం కొద్దిగా ఇబ్బంది పడుతున్న మాట వాస్తవం. మంత్రిగారు అంగీకరించినా, అంగీకరించకపోయినా అది నిజం. లబ్ధిదారులు వేలి ముద్రలు వేసేటపుడు కొంత డిఫరెన్స్ వస్తోంది. దానికి ఏదైనా ఆల్టర్నేటివ్ ఉండాలి. దాని గురించి ఆలోచించవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను. తప్పనిసరిగా ఆ దిశలో మంత్రిగారు చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను. ఇది మంచి పథకం, దేశంలో ఏ రాష్ట్రంలో లేని రీతిగా మన రాష్ట్రంలో అమలవుతోంది. ఆ రకంగా అమలవుతున్న పథకంలో ఏ ఇబ్బంది ఎదురైనా దాన్ని అధిగమించేలా మన రాష్ట్ర ప్రభుత్వం ఉండాలి. దానికి ఆల్టర్నేటివ్‌గా ఏమి చర్యలు తీసుకుంటారో చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ మహ్మద్ ఫరీదుద్దీన్ (శాసనసభ నియోజక వర్గం)ః–** అధ్యక్షా, పర్టిక్యులర్‌గా ఈ వృద్ధాప్య పింఛన్ల విషయంలో ఆధార్ కార్డును బేస్ చేసుకొని వయస్సు నిర్ధారణ చేస్తున్నారు. అయితే కొంత మంది సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చేటపుడు పొరపాటున తక్కువ వయసు చెబుతున్నారు. అటువంటి వారి వయసు వివరాలను సరిజేసిన తర్వాత కూడా పెన్షన్లు రావడం లేదు. అదే సందర్భంలో తక్కువ వయసుండి ఎక్కువ చెప్పుకున్న వాళ్లకు పెన్షన్లు వస్తున్నాయి. సరే, పది మంది అర్హులు కాని వారికి పెన్షన్లు వస్తే ఇబ్బంది లేదు కానీ అర్హులైన వారికి రాకపోతే మాత్రం ప్రభుత్వ లక్ష్యం నెరవేరదు. కాబట్టి అటువంటి వాళ్ల విషయంలో వయో నిర్ధారణ చేసి వాళ్లకు కూడా పెన్షన్లు వచ్చేలా చూడాలి. ఎందుకంటే వాళ్లను చూస్తేనే తెలిసిపోతుంది, నడవలేని పరిస్థితి కాదు, కనీసం నిలబడలేని పరిస్థితి ఉన్న వారు కొంత మంది ఉన్నారు. అటువంటి వాళ్లకు పెన్షన్లు అందడం లేదు. పెద్ద ఎత్తున పెన్షన్లు ఇస్తున్నారు కానీ అటువంటి కొంత మంది తప్పిపోతే ప్రభుత్వ లక్ష్యం నెరవేరదు. దానికి ఏవిధంగా చర్యలు తీసుకుంటారో తెలియజేయాలని మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ జూపల్లి కృష్ణారావుః–** అధ్యక్షా, ఈ పెన్షన్ పథకం చాలా పెద్ద పథకం. గౌరవ ముఖ్యమంత్రిగారు పెద్ద మనసుతో

అమలు చేస్తున్న కార్యక్రమం. గతంలో 28 లక్షల పెన్షన్లు ఇస్తే, ఈరోజు సుమారు 40 లక్షల పెన్షన్లు ఇస్తున్నాం, అంటే దాదాపుగా 40 శాతం వరకు పెన్షన్లు పెంచడం జరిగింది. ఈ పెన్షన్లకు సంబంధించి ప్రతి నెలా రెగ్యులర్‌గా పేమెంట్లు జరుగుతున్నాయి. 2017, ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు చూస్తే, ప్రతి నెలా పదో తారీఖు లోపల పేమెంట్ చేస్తున్నాం, ఏప్రిల్ నెలకు సంబంధించిన పెన్షన్ మే నెల మొదటి వారంలో ఇస్తున్నాం. రెగ్యులర్‌గా ప్రతి నెలా మొదటి వారంలో పేమెంటు జరుగుతోంది. గౌరవ సభ్యులు సుధాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ, బయో మెట్రిక్ ద్వారా కొంత ఇబ్బంది జరుగుతోందనే విషయాన్ని ప్రస్తావించారు. వాస్తవానికి పోస్టాఫీసుల ద్వారా పేమెంట్లు జరగడం వల్ల పింఛన్‌దార్లకు ఎక్కువ మేలు జరుగుతుంది. కారణమేమంటే – బ్యాంకుల ద్వారా పేమెంట్లు చేసినపుడు – ఒక మండల కేంద్రంలో ఒక బ్యాంకుకు ఇస్తే, ఆ బ్యాంకు క్రింద పది, పదిహేను గ్రామాలుంటాయి కాబట్టి వాళ్లంతా మండల కేంద్రానికి వెళ్లి తెచ్చుకోవలసి ఉంటుంది, వాళ్లకి ఇబ్బంది అవుతుంది. పోస్టాఫీసుల ద్వారా పెన్షన్ల చెల్లించడం పర్‌ఫెక్టుగా జరుగుతోంది. జనవరి పెన్షన్ ఫిబ్రవరిలో పేమెంటు చేయడం జరిగింది. ఈ పెన్షన్లకు సంబంధించి పోస్టాఫీసుల ద్వారా చెల్లించే పెన్షన్లు 22,06,717 ఉంటే, ఇందులో 17 లక్షలు డైరెక్టుగా బయోమెట్రిక్ ద్వారా పేమెంటు చేయడం జరిగింది. వార్థక్యం కారణంగా, లేదా శ్రామిక వర్గాలకు సంబంధించిన వారి ఫింగర్ ప్రింట్ తేడాలు వచ్చినపుడు, అటువంటి వాళ్లకు ఇబ్బంది కలగకుండా పంచాయతీరాజ్ సెక్రటరీ ద్వారా 11,78,886 మందికి పేమెంట్ చేయడం జరిగింది. ఇక మిగిలింది 3 లక్షలు, అది సుమారుగా 15 శాతం ఉంటుంది. ఇందులో డిలే జరగడానికి ప్రధాన కారణం ఏమంటే – గత రెండు మాసాల నుంచి రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి నగదు ఆలస్యంగా రావడం, నగదు ఒకేసారి ఇవ్వని కారణంగా, దఫదఫాలుగా ఇస్తున్న కారణంగా, క్యాష్ షార్టేజీ కారణంగా పోస్టాఫీసుల ద్వారా జరిగే పేమెంట్లలో కొంత గ్యాప్ వస్తోంది. బయో మెట్రిక్ వల్ల ఇబ్బంది కలగకుండా, ఇంకా పారదర్శకంగా ఉండేందుకు, పంచాయతీరాజ్ సెక్రటరీ ద్వారా కాకుండా, టెక్నాలజీ ద్వారా చేయడం కోసం ఐరిష్ వివరాలను సేకరిస్తున్నాం. పిఓపి మిషన్ ద్వారా ఐరిష్ వివరాలను అనుసంధానం చేసే ప్రక్రియను ప్రయోగాత్మకంగా కొన్ని గ్రామాలలో చేస్తున్నాం. ఒక మాసం లోపల ఆ ప్రక్రియ పూర్తయితే నూటికి నూరు శాతం పెన్షన్లు పర్‌ఫెక్టుగా పంపిణీ చేయడం జరుగుతుంది. బ్యాంకుల మూలంగా జరుగుతున్న ఆలస్యాన్ని అధిగమించడానికి బ్యాంకుల్లో బిజినెస్ కరస్పాండెంట్స్‌ను పెట్టి పేమెంటు చేసేలా ఏర్పాటు చేస్తున్నాం. సుధాకర్ రెడ్డి గారు ప్రస్తావించిన సమస్యను టెక్నాలజీ అనుసంధానం చేయడం ద్వారా పరిష్కారం చేస్తాం.

గౌరవ సభ్యులు ఫరీదుద్దీన్ గారు మాట్లాడుతూ, తక్కువ వయసున్న వారికి వస్తున్నాయి కానీ ఎక్కువ వయసు ఉన్న వాళ్లకి పెన్షన్లు రావడం లేదని చెప్పారు. దానికి సంబంధించి రాష్ట్రంలో ప్రతి నెలా అన్ని జిల్లాల నుంచి, గ్రామాల నుంచి ఎక్కడెక్కడైతే అర్హత ఉండి left over అయిన వాళ్లున్నారో వాళ్ల వివరాలు తెప్పించుకొని ప్రతి నెలా అదనంగా పెన్షన్లు ఇస్తున్నాం. ఆ విధంగా చేయడం వల్ల ఈ ఫిగర్ పెరుగుతోంది. గౌరవ ముఖ్యమంత్రి గారి ఆలోచన మేరకు, పేదవాళ్ల చిన్న చిన్న అవసరాలకు చెయ్యి చాచి దేహీ అని అడుక్కునే పరిస్థితి ఉండకూడదని, వాళ్లంతా ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశ్యంతో ఇంత పెద్ద ఎత్తున చేస్తున్నాం. ల్యాప్సెస్ ఉన్న చోట రెక్టిఫై చేసే ఏర్పాటు చేస్తాం.

**శ్రీ మహ్మద్ ఫరీదుద్దీన్:-** అధ్యక్షా, left over గురించి నేను మాట్లాడడం లేదు. ఎక్కువ వయసుండి కూడా పొరపాటున తక్కువ వయసుగా నమోదైన వాళ్లు పెన్షన్లు పొందలేకపోతున్నారు, వాళ్ల విషయంలో ఏమి చర్యలు తీసుకుంటారని గౌరవ మంత్రివర్యులను అడుగుతున్నాను.

**శ్రీ జూపల్లి కృష్ణారావు:-** వయసు ఎక్కువ ఉండి తక్కువ నమోదైన వాళ్లు రెప్రజెంట్ చేసుకొని, సంబంధిత మండల, జిల్లా అధికారుల ద్వారా ప్రపోజల్స్ పంపితే, ల్యాప్సెస్ ఉంటే వాటిని జిల్లా కలెక్టర్లు రెక్టిఫై చేస్తారు. Any mistake can be rectified at any time. అటువంటి వాటిని సరిజేసే ప్రయత్నం చేస్తాం. 70 ఏళ్ల వయసుంటే 60 ఏళ్లని నమోదు అయి ఉంటే, అటువంటి వారికి న్యాయం చేయడం జరుగుతుంది.

## వ్యవసాయ పంపుసెట్లను సోలార్ పంపుసెట్లుగా మార్చుట

ప్రశ్న నెం.2704(10)

శ్రీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్సీ:- గౌరవనీయులైన ఇంధన శాఖామంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) ప్రస్తుతం ఉన్న వ్యవసాయ పంపుసెట్లను సౌర పంపుసెట్లుగా మార్చే ప్రతిపాదన ఏదైనా ప్రభుత్వం వద్ద ఉన్నదా;

ఆ) అయితే, ఆ వివరాలేమిటి;

ఇ) ఈ విషయంలో చేయనున్న వ్యయ పరిమాణం ఎంత;

ఈ) దీని నిమిత్తం కేంద్ర ప్రభుత్వం నుండి ఏదేని ఆర్థిక సహాయం కోరడమవుతున్నదా;

ఉ) మార్పిడి ప్రక్రియను ఎప్పటిలోగా పూర్తి చేయడమవుతుంది?

**గౌరవనీయులైన ఇంధన శాఖామంత్రి (శ్రీ జి. జగదీష్‌రెడ్డి):-** అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) ఈ ప్రశ్నం ఉత్పన్నం కాదు.

ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఉ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీ కర్నె ప్రభాకర్ (నామినేటెడ్):-** అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై టిఆర్‌యస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంవత్సరం తిరగకముందే గౌరవ ముఖ్యమంత్రిగారు, సంబంధిత గౌరవ మంత్రిగారు, ఆ శాఖకు సంబంధించిన అధికారులు ఎంతో కృషిచేసి కరెంటు కష్టాలను లేకుండా చేసి, ఈరోజు డిమాండు ఎంత ఉందో అంత ఇచ్చి, తద్వారా తెలంగాణ రైతాంగానికి ఒక రిలీఫ్ ఇచ్చినందుకు వాళ్లందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మనం చేస్తున్న పనిపై విశ్వాసం ఉండాలి. విశ్వాసం ఉన్నపుడే లక్ష్యం చేరుకోవడానికి అవకాశం ఉంటుంది. మనం పొరుగు రాష్ట్రం నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాం. ఉన్న డిమాండుకి ఎట్టి పరిస్థితుల్లో తగ్గకుండా, కరెంటుకే కష్టాలని చెప్పిన గతానికి భిన్నంగా 24 గంటలు కరెంటు ఇచ్చి, ప్రయోగం చేసి సక్సెస్ కూడా అయ్యాం. కానీ ఈ భారాన్ని తగ్గించుకోవడానికి, వ్యక్తిగతంగా రైతులకు ఈ సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేస్తే మినిస్ట్రీ ఆఫ్ రెన్యూవబుల్ ఎనర్జీ, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి సహకారం, మిగతా ఏజన్సీల ద్వారా కూడా సహకారం తీసుకున్నట్లయితే, తప్పకుండా రాబోవు కాలంలో ప్రభుత్వంపై పడే భారం తగ్గుతుందనే భావనతో ఈ ప్రతిపాదన చేస్తున్నాను. రైతులకు ఈ సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేస్తే రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందులు తగ్గుతాయనే భావన నాకుంది. అటువంటి ఆలోచన చేస్తే బాగుంటుందని నా ప్రతిపాదన.

**శ్రీ జి. జగదీష్ రెడ్డి:-** అధ్యక్షా, గౌరవ సభ్యులు చేసిన సూచన ప్రభుత్వ దృష్టిలో కూడా ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ ఏదైతే ఉందో అది అన్ని పంపుసెట్లను మార్చడానికి కాకుండా కొత్తగా పెట్టడానికి మాత్రమే వర్తింపజేస్తున్నారు. ఆ స్కీములో టెండర్లు కూడా పిలవడం జరిగింది. సోలార్ విద్యుత్ ద్వారా నడిచే 3 హెచ్‌పి పంపుసెట్టు పెట్టాలంటే రూ.4.15 లక్షలు ఖర్చవుతోంది. దీంట్లో 30 శాతం సబ్సిడీ రూపంలో అంటే రూ.1.50 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తుంది. మిగతాది రైతులు భరించాలి లేదా డిస్కమ్స్ భరించాల్సిన పరిస్థితి ఉంది. డిస్కమ్స్ భరించే పరిస్థితి లేదు. రైతులు 25 శాతం లేదా 30 శాతం భరించమని అడుగుదామంటే అది రూ.50వేల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. మన ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో గౌరవ ముఖ్యమంత్రిగారు నిర్ణయం తీసుకొని, చెప్పిన ప్రకారం మొదటి సంవత్సరం ఆరు గంటలు, రెండో సంవత్సరం తొమ్మిది గంటలు ఒక్క నిమిషం కూడా కరెంటు పోకుండా ఇవ్వడం జరిగింది. దాంతో రైతాంగం చాలా సంతోషంగా ఉన్నారు. అదే సందర్భంలో గౌరవ ముఖ్యమంత్రి గారు 24 గంటలు ఇవ్వాలని నిర్ణయం తీసుకొని, భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా రైతాంగానికి ఉచితంగా ఇస్తున్న రాష్ట్రంగా మనం రికార్డు సృష్టించాం. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు తమ జేబుల్లోంచి పది రూపాయలు కూడా ఖర్చు చేయడానికి సిద్ధంగా లేరు. మొత్తానికి మొత్తంగా ప్రభుత్వమే భరిస్తే తప్ప రైతులు ముందుకు వచ్చే పరిస్థితి లేదు. 24 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను ఇచ్చిన తర్వాత కొన్ని గంటలు వచ్చే సోలార్ విద్యుత్ వైపు పోవడానికి రైతాంగం ఎవ్వరూ కూడా ఇప్పుడు సిద్ధంగా లేరు. ఒకప్పుడు విద్యుత్ లేని కాలంలో, కేవలం ఆరు గంటలు ఇస్తామని, అది కూడా మూడు గంటలకు మించి ఇవ్వకుండా, పావు గంట ఆలస్యంగా ఇచ్చి, పావు గంట ముందు తీసి చేస్తున్న రోజుల్లో కొంత మంది రైతులు అటువైపు దృష్టి పెట్టిన మాట వాస్తవం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎక్కడైనా విద్యుత్ అందుబాటులో లేని చోట, అడవి మధ్యలో గిరిజనులు, గోండులు, కోయలు ఇతర వర్గాల ప్రజలున్న చోట, లైన్స్ వేయడానికి అనుమతులు రావడం ఇబ్బంది ఉంటే, ఎక్కువ ఖర్చయ్యే అవకాశం ఉంటే, అటువంటి చోట్ల ఎవరైనా ముందుకొస్తే సోలార్ పంపుసెట్లు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం. కొత్తగూడెంలో గతంలో 90 సోలార్ పంపుసెట్లు పెట్టడం జరిగింది. కానీ సోలార్ కంటె ఈ విద్యుత్ ఇస్తేనే బాగుంటుందని వాళ్లందరూ కూడా మన వైపే చూస్తున్నారు.

ఇంకొక మాట చెప్పాలంటే - సోలార్ విద్యుత్పత్తిలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఉంది. అతి తక్కువ

కాలంలో, కేవలం మూడు సంవత్సరాల కాలంలో 3300 మెగావాట్ల సోలార్ విద్యుత్పత్తితో దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా మనం రికార్డు సృష్టించాం. ఆ రకంగా రెన్యూవబుల్ ఎనర్జీలో కూడా మనం భారతదేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాం. ఇంకా ఎక్కువ మొత్తంలో సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. రూఫ్ టాప్ ద్వారా, ఇతర పద్ధతుల ద్వారా సోలార్ ఎనర్జీని ఉత్పత్తి చేస్తున్నాం. ఒక్క వ్యవసాయ కనెక్షన్స్‌కు సంబంధించి మాత్రం ప్రారంభంలో మనం పిలిస్తే కూడా రైతులు ముందుకు రాలేదు. కొత్త వాటికి కూడా రావడం లేదు. ఇక పాత వాటిని మార్చడం అన్నది కష్టతరమైన విషయం. దానికి ప్రత్యామ్నాయంగా ఇతర పద్ధతుల్లో సోలార్ ఎనర్జీని ఉత్పత్తి చేస్తున్నాం, రెన్యూవబుల్ ఎనర్జీలో భారతదేశంలోనే మనం నెంబర్‌గా ఉన్నామని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ః–** ఇప్పుడు, ప్రత్యేక ప్రస్తావనలు.

## ప్రత్యేక ప్రస్తావన

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డిః–** అధ్యక్షా, మన రాష్ట్రంలో సర్వశిక్షా అభియాన్ పథకం క్రింద పని చేసే వివిధ రకాలైన కేడర్ ఉపాధ్యాయులకు జీ.ఓ.ఆర్‌టి. నెం.144, తేదీః 31.8.2017 ద్వారా రెమ్యునరేషన్ పెంచాం. ఆవిధంగా పెంచిన రెమ్యునరేషన్‌ను 01.09.2017 నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే అదే సర్వశిక్షా అభియాన్ పథకం ద్వారా దివ్యాంగ విద్యార్థులకు బోధించే ప్రత్యేక ఉపాధ్యాయులు ఎవరైతే ఉన్నారో వారికి కూడా గౌరవ వేతనం పెంచే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుందా? వీళ్లకు కూడా 01.09.2017 నుంచే పెరగబోయే గౌరవ వేతనం ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేస్తారా? దీని విషయంలో గౌరవ ఉప ముఖ్యమంత్రి గారు దయచేసి చెప్పాలని కోరుతున్నాను.

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ః–** టీ విరామం కొరకు సభను 15 నిమిషాల పాటు వాయిదా వేయడమైంది.

(టీ విరామం కొరకు సభ ఉదయం 11.15 గంటలకు వాయిదా పడింది.)

11.40 ఉ.

(స్వల్ప తేనీటి విరామానంతరం సభ తిరిగి 11.45 ని.లకు ప్రారంభమయింది)

(గౌరవ డెప్యూటీ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

## గవర్నరు ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ః–** గవర్నరు ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశ పెట్టవలసిందిగా డా.పల్లా రాజేశ్వర రెడ్డి గారిని కోరుతున్నాను.

**DR. PALLA RAJESHWAR REDDY:-** I rise to move:

"That an address be presented to the Governor as follows:

That the Members of Telangana Legislative Council assembled in this Ninth Session are deeply grateful to the Governor for the Address which he has been pleased to deliver to the Members of Legislative Council on 12-03-2018"."

**SRI NARADAS LAXMAN RAO:-** I second the Motion.

**MR DEPUTY CHAIRMAN:-** Motion moved. Now, discussion on the Motion of Thanks to the Governor's Address.

## గవర్నరు ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం పై చర్చ

**డా. పల్లా రాజేశ్వర రెడ్డిః–** అధ్యక్షా, బడ్జెట్ సమావేశాల సందర్భంగా మన రాష్ట్ర గవర్నరు గారు ఉభయ సభల నుద్దేశించి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడేందుకు అవకాశమిచ్చినందుకు ముందుగా తమకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

తెలంగాణ సాధించక ముందు వివిధ రంగాలలో ఉన్న మన రాష్ట్ర పరిస్థితి, తెలంగాణ సాధించిన తరువాత గత 3 సంవత్సరాల 10 నెలల్లో వాటిని అధిగమించుకుంటూ తెలంగాణ ప్రజల ఇతోధిక అభివృద్ధి కోసం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ కృషిని గురించి మన గౌరవ గవర్నరు గారు చాలా అద్భుతంగా తమ ప్రసంగంలో ప్రస్తావించడం జరిగింది. దానిని, గత సంవత్సరం లేదా ఇప్పటి వరకు ప్రభుత్వం చేసిన కార్యక్రమాల యొక్క సమీక్షగా, ప్రోగ్రెస్ రిపోర్టుగా మనం చూస్తాం.

ఈరోజు ప్రభుత్వాన్ని నడుపుతున్న టి.ఆర్.ఎస్. పార్టీ ప్రతినిధిగా నా అభిప్రాయాలను ఈ సభతో పంచుకుంటున్నాను. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించక ముందు 2012-13 మరియు 2013-14 సంవత్సరాలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జి.ఎస్.డి.పి. 4 శాతంగా ఉంటే, భారతదేశ జి.డి.పి. 5.9 శాతంగా ఉండేది. గత 3 సంవత్సరాల 10

నెలలు అంటే, సుమారుగా 4 సంవత్సరాల పరిపాలనను చూసుకున్నట్లైతే, 2016-17 సంవత్సరానికి చెందిన తెలంగాణ రాష్ట్ర జి.ఎస్.డి.పి. 8.6 శాతంగా, జాతీయ జి.డి.పి. కంటే 1.1 శాతం ఎక్కువగా ఉన్నది. ఇది ఖచ్చితంగా మనం సాధించిన పురోగతికి చిహ్నం.

ఇంతకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతాన్ని చాలా తక్కువగా చూసేవారు. మన ముఖ్యమంత్రి కేసిఆర్ గారు ఉద్యమ నాయకులుగా ఉన్నప్పుడు ప్రధానంగా "నీళ్ళు-నియామకాలు-నిధులు" అనే ట్యాగ్‌లైన్‌తో తెలంగాణ ఉద్యమాన్ని చేపట్టి, "మనకు నిధులున్నాయి, ఆర్థిక వనరులున్నాయి, కానీ అవన్నీ కొల్లగొట్టబడుతున్నాయి, వాటన్నింటినీ మనం తెచ్చుకోలేని పరిస్థితుల్లోకి మనల్ని నెట్టివేస్తున్నారు, ఉమ్మడి రాష్ట్రపాలకులు మనల్ని ఇబ్బందులు పెడుతున్నారు, మన నిధులు మనకి రావాలంటే మన తెలంగాణను మనం తెచ్చుకుంటేనే సాధ్యమవుతుందని" చెప్పారు. ఈనాటి మన ఆర్థిక పరిస్థితిని, మన అభివృద్ధి లెక్కలను చూసినట్లయితే దానికి అనుగుణంగా మారుతున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటికి మన తలసరి ఆదాయం లక్ష రూపాయల కంటే తక్కువగా ఉండేది. ఈరోజు జాతీయ తలసరి ఆదాయం రూ.1.03 లక్షలుండగా, మన తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1.54 లక్షలుగా ఉంది. కాబట్టి, ఖచ్చితంగా అనేక రంగాలలో మన యొక్క కృషి ఫలించింది. అది వ్యవసాయ రంగం కావచ్చు, పారిశ్రామిక రంగం కావచ్చు లేక వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు సంబంధించింది కావచ్చు. అన్ని రంగాలలో మనం చేసిన కృషి ఫలించి, దాని ఫలితాలు, తద్వారా మన ఆర్థికాభివృద్ధి సాధ్యమయ్యిందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

గత పాలకులు వ్యవసాయం దండగ అనే పరిస్థితికి తెలంగాణ ప్రజలను నెట్టి వేశారు. తెలంగాణ ప్రాంతంలో ఉన్న 55 శాతం వ్యవసాయం మీద ఆధారపడిన ప్రజానీకం "మేము బ్రతికి ఉండడం ఎందుకు" అని భావించే విధంగా వారి పరిస్థితిని ఆనాడు తీసుకురావడం జరిగింది.

తెలంగాణ రాక ముందు, నాటి రోజుల్లో తెలంగాణ ప్రాంతంలో ఉన్న నీటి వసతులు, విత్తనాలు, ఎరువుల పరిస్థితి, అతి కష్టకాలంలో పండిన పంటకు రైతుకు వచ్చిన గిట్టుబాటు ధరలను నేటి పరిస్థితితో బేరీజు వేసుకున్నట్లైతే, జరిగిన మార్పు తెలుస్తుంది.

స్వయంగా రైతు అయిన కేసిఆర్ గారు, చిన్నప్పటి నుంచి పంటలు పండించడంలో అనుభవం ఉన్న వ్యక్తిగా, రైతు కష్టాలు తెలిసిన వ్యక్తిగా, భారతదేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నీటి వనరులని ఏవిధంగా ఉపయోగించాలో తెలిసిన వ్యక్తి. తెలంగాణ రాగానే, ఖచ్చితంగా మన నేల అన్నింటికీ అనుకూలంగా ఉంది కాబట్టి, కృష్ణ, గోదావరి నదులు తెలంగాణ రాష్ట్రాన్ని ఒరుసుకుంటూ పోతున్నాయి కాబట్టి, మనకు కావలసిన నీటిని మనం తీసుకొని, మన భూమిని కూడా వ్యవసాయానికి అనుకూలంగా మార్చుకొని, 55 శాతంగా ఉన్న వ్యవసాయ మరియు అనుబంధ ప్రజానీకానికి అనుకూలంగా ఈ తెలంగాణ ప్రాంతాన్ని తయారు చేయాలనే ఉద్దేశంతో వారు అవిశ్రాంత కృషి జరపడం జరిగింది.

వ్యవసాయం చేయాలంటే ఎవరికైనా కావలసింది మొట్టమొదటిగా భూమి, రెండవది నీరు, మూడవది పెట్టుబడి, నాల్గవది విత్తనం. ప్రస్తుతం, నిన్న మొన్న జరిగిన లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో దరిదాపుగా 1.44 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నేడు, అందులో సగం భూమిలో కూడా వ్యవసాయం చేయలేకపోతున్నాం. చేసిన వ్యవసాయంలో కూడా ఒక పంట మాత్రమే సాగు చేయగలుగుతున్నాం. మనకున్న వనరులని 25 శాతం కూడా ఉపయోగించుకోలేని పరిస్థితిలో మనమున్నాం. అందుకే, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడగానే, మిషన్ కాకతీయ పథకం ద్వారా మనకున్న చెరువులన్నింటినీ పునరుద్ధరించుకోవాలని నిర్ణయించుకున్నాం.

కాకతీయుల కాలం నాటివి, ఆజామ్‌జాహి కాలం నాటివి, కుతుబ్‌షాహి కాలం నాటి 75,000 చెరువులు తెలంగాణ ప్రాంతంలో ఉండేవి. వాటిలో గత పాలకులు ధ్వంసం చేయగా మిగిలిన 45,000 చెరువులలో 75 శాతం నుండి 80 శాతం చెరువులను ఈరోజు బాగు చేసుకోవడం జరిగింది. చెరువులను బాగు చేసే కార్యక్రమంలో వారికి ఉపయోగపడే రీతిలో ప్రజలను కూడా భాగస్వామ్యం చేయడం జరిగింది. చెరువు కట్టలు బాగు చేసుకోవడం, తూములు బాగు చేసుకోవడం, చెరువుల్లోని మట్టిని నేరుగా రైతులకు అందించడం, అదే విధంగా ఆయా చెరువులకు ఉన్న ఫీడర్ ఛానెల్స్‌ను బాగు చేసుకోవడం ద్వారా, నేడు 7 లక్షల నుండి 8 లక్షల ఎకరాలకు ఖచ్చితంగా రెండు పంటలకు సాగునీరు అందిస్తూ, మరొక 10 లక్షలు లేక 12 లక్షల ఎకరాలకు ఖచ్చితంగా ఒక పంటకు నీరు వచ్చే విధంగా,

తద్వారా మత్స్య పరిశ్రమకు, ఇతర అనుబంధ పరిశ్రమలకు ఉపయోగపడే విధంగా మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టడం జరుగుతోంది. ఈ కార్యక్రమాన్ని కూడా కొంత మంది విమర్శించారు. కానీ, ఈ వాటర్ షెడ్ ప్రోగ్రామ్‌ను ప్రపంచ వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా ఉన్న నిపుణులందరూ చాలా ప్రశంసించారు. 'రామన్ మెగసెసే' అవార్డు గ్రహీత, శ్రీ రాజేందర్ సింగ్ వంటి నిపుణులు కూడా ఇక్కడికి వచ్చినప్పుడు మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని ప్రశంసించారు. 'నీతి ఆయోగ్' కూడా ప్రశంసించింది. కొన్ని విశ్వవిద్యాలయాలు మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని రీసెర్చ్ యాక్టివిటీగా తీసుకోవడం జరిగింది.

రైతులకి కావలసిన నీటి ఊటను పెంచే విధంగా మిషన్ కాకతీయను స్వల్పకాలిక కార్యక్రమంగా తీసుకున్నాం. మరో వైపు దీర్ఘకాలికంగా అవసరమైన ప్రాజెక్టులను కట్టుకోవాలని నిర్ణయించుకున్నాం. గత పాలకుల పరిపాలనలో ప్రాజెక్టులను చేపట్టి, తద్వారా డబ్బులను సంపాదించి, కాలువల్లో చెట్లు మొలిచే విధంగా వాటిని వదిలి పెట్టిన నాటి దుస్థితిని, నాటి పాలకులను ఎండగడుతూనే, మనం క్రొత్తగా ప్రాజెక్టులను కట్టుకొని, వీలైతే దశాబ్దాల తరబడి కొనసాగుతూ ఉన్న నాటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలనే దిశగా ఆలోచన చేయడం జరిగింది. మహబూబ్ నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టులను 90 శాతం నుండి 95 శాతం పూర్తి చేసుకున్నాం.

భారత దేశంలోనే అతి పెద్ద జిల్లా, ఎక్కువ వలసలు ఉండే జిల్లా, మహబూబ్ నగర్ జిల్లా. కానీ, ఇవాళ ఆ జిల్లాలో రివర్స్ మైగ్రేషన్ చోటుచేసుకుంటోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 2 నుండి 2.5 లక్షల ఎకరాల ఆయకట్టు సాగు క్రింద ఉండగా, ప్రస్తుతం దానికి అదనంగా 6.5 లక్షల నుండి 7 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును చేర్చి, మొత్తం 9 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత పాలకులు ప్రాజెక్టు నిర్మాణాలను సాగదీస్తూ వస్తే, మనం వాటిని పూర్తి చేస్తున్నాం.

ఉమ్మడి వరంగల్ జిల్లా, కరీంనగర్ జిల్లాలకు ఉపయోగపడే దేవాదుల ప్రాజెక్టు ద్వారా స్టేషన్ ఘన్‌పూర్, జనగామ, పాలకుర్తి నియోజకవర్గాలలోని అనేక ప్రాంతాల్లో ఒక లక్ష ఎకరాలకు ఉపయోగపడే విధంగా అక్కడున్న చెరువులను నింపుతాం. 45 నుండి 50 సంవత్సరాలపాటు కరువు ప్రాంతంగా ఉన్న పాలేరు నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు మరొక 9 నుండి 10 నెలల్లోనే భక్త రామదాసు ప్రాజెక్టుని పూర్తి చేసి నీళ్ళిస్తాం. ఈ విధంగా దరిదాపుగా 16 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించడంతోపాటు, 8.5 లక్షల ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరిస్తున్నాం. అంటే, మూడు నుంచి మూడున్నర సంవత్సరాల కాలంలో దాదాపుగా 25 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఖచ్చితంగా నీళ్ళందించేందుకు అందుబాటులో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం.

తెలంగాణ రాష్ట్రంలో ఒక కోటి ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంలో భాగంగా ఎస్సారెస్పీ పునరుద్ధరణ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతోంది. అదే విధంగా, 18 లక్షల ఎకరాల ప్రస్తుత ఆయకట్టు స్థిరీకరణతోపాటు, అదనంగా మరొక 22 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు వచ్చేందుకు ఉపయోగపడుతుందనే అంచనాతో కాళేశ్వరం ప్రాజెక్టును మొదలు పెట్టడం జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు భారత దేశంలోనే కాకుండా, ప్రపంచంలోనే రెండవ అతి పెద్దదైన సాగునీటి ప్రాజెక్టు. అత్యంత వేగంగా పూర్తి చేయబడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టుని శాసన పరిషత్తు గౌరవ ఛైర్మన్, గౌరవ డెప్యూటీ ఛైర్మన్‌తో పాటు ఇక్కడున్న గౌరవ సభ్యులందరూ కూడా వెళ్ళి చూసి వచ్చారు. దానిని ఇంజనీరింగ్ మార్వెల్‌గా అనేకమంది నీటిపారుదల రంగ నిపుణులు, అర్థిక నిపుణులు, ఇంజనీరింగ్ నిపుణులు మెచ్చుకున్నారు, మెచ్చుకుంటున్నారు.

ఖమ్మం జిల్లాలోని 'సీతారామ ప్రాజెక్టు'ను త్వరగా పూర్తి చేయడం ద్వారా ఆ జిల్లాలో 10 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు వచ్చేందుకు, నాగార్జున సాగర్ మరియు ఎస్సారెస్పీ క్రింద ఉన్న ప్రస్తుత ఆయకట్టును స్థిరీకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మహబూబ్ నగర్ జిల్లాలోని మిగతా ప్రాంతాలకు సంబంధించిన పాలమూరు ఎత్తిపోతల పథకాన్నీ, ఎల్లప్పుడూ కరువు కాటకాల బారినపడే నల్గొండ జిల్లాకు చెందిన దేవరకొండ, మునుగోడు ప్రాంతాలతోపాటు మిగతా ప్రాంతాలకు కూడా కావలసిన నీరు అందించే లక్ష్యంతో 'దిండి ప్రాజెక్టు'ని ప్రారంభించుకున్నాం.

ఇంతకు ముందు నుండి అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసుకోవడం ఒక ఎత్తైతే, కొత్తగా ప్రాజెక్టులను చేపట్టి అత్యంత త్వరగా పూర్తి చేసుకోవడం మరొక ఎత్తు. ఈ రెండు విధానాల ద్వారా ఖచ్చితంగా, వచ్చే రెండు సంవత్సరాలలో ఈ రాష్ట్రంలో ఉన్న కోటి ఎకరాలకు నీళ్ళు ఇచ్చేందుకు అపర భగీరథుడైన కెసిఆర్ గారి కృషి ఫలిస్తూ ఉన్నది. అందుకు సంబంధించి ప్రారంభ ఫలితాలు

ఇప్పటికే రావడం జరిగింది. 2016-17 సంవత్సరంలో 101.2 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయ్యాయంటే, ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి వల్ల తప్ప, మరొకటి కాదని తెలియజేసుకుంటున్నాను.

వ్యవసాయానికి కావలసిన ముఖ్యమైన ఇన్‌పుట్స్ విషయంలో కూడా చూసుకుంటే, విత్తనాలు కూడా ఇంతకు ముందు సరైన సమయంలో దొరికేవి కావు. దొరికినా, నకిలీ విత్తనాలు ఇచ్చే పరిస్థితి ఆనాడు ఉండేది. ఈరోజు విత్తన కొరత రాకుండా, మనకు కావలసిన విత్తనాలను నిల్వ చేసుకునేందుకు తగినంతగా గోదాములను నిర్మించు కోవాలనుకున్నాం. 4,17,000 మెట్రిక్ టన్నుల కెపాసిటీ ఉన్న గోదాములుంటే, వాటిని దరిదాపుగా 22 లక్షల మెట్రిక్ టన్నులకు సరిపోయే విధంగా, రాష్ట్రమంతా కలిపి రూ.1000.00 కోట్లతో 356 కొత్త గోదాములను నిర్మించుకున్నాం. ఆ గోదాములు రెండు రకాలుగా ఉపయోగపడతాయి. పంట రాక ముందు విత్తనాలు, ఎరువులు నిల్వ చేసుకుంటూ, పంట చేతికి వచ్చిన తరువాత పంటను కూడా నిల్వ చేసుకునే విధంగా గోదాముల నిర్మాణం చేసుకున్నాం.

మన మొత్తం భూభాగం దక్కన్ పీఠభూమిలో ఉండడం వల్ల, కృష్ణా, గోదావరి నదుల నీళ్ళు మనకు ఎక్కువగా రాకపోవడం వల్ల, మన వ్యవసాయం ఎక్కువగా బావుల మీద, బోర్ల మీద ఆధారపడి ఉంది. భూగర్భంలో అడుగంటిపోతున్న జలాల్ని, క్షీణిస్తున్న జలాలను మిషన్ కాకతీయ ద్వారా కొంత మేర పెంచుకున్నాం. అదే విధంగా ఆగిపోయినటువంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కొంత మేర నీటి నిల్వలు పెంచుకున్నాం. అయినా, ఆ నీళ్ళను పైకి తీసుకురావాలంటే కరెంటు కావలసిందే. తెలంగాణ ఏర్పడే నాటికి కావలసిన కరెంటుని కూడా తెస్తామని మన ప్రస్తుత ముఖ్యమంత్రి గారు ఆనాడే వాగ్దానం చేశారు.

12.00 మ. రాష్ట్రం ఏర్పడే నాటికి ఆరు మాసాల ముందే ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రజలు ఆరు మాసాల సమయం ఇచ్చినట్లయితే విద్యుత్‌ను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తామని ఆనాటి ఉద్యమ నేత, ఈనాటి గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు చెప్పడం జరిగింది. విద్యుత్‌ను ఎలా తీసుకొస్తారని ప్రభుత్వం ఏర్పడిన జూన్ 2వ తేదీ నుండే తెలుగుదేశం, కాంగ్రెస్ మరియు ఇతర ప్రతిపక్ష నాయకులందరు కూడా ఎకసెక్కాలాడారు. భద్రాచలం దగ్గర ఉన్నటువంటి సీలేరు ప్రాజెక్టును మరియు ఏడు మండలాలను కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో కలపడం జరిగింది. కృష్ణపట్నంలో మనకు ఉన్నటువంటి విద్యుత్ వాటాను ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం జరిగింది. ఇతర రాష్ట్రాల నుండి విద్యుత్‌ను తీసుకుందామంటే విద్యుత్ సరఫరాకు అవసరమైన లైన్స్ లేకపోవడం వల్ల ఇబ్బంది పడ్డాము. అటువంటి సమస్యలన్నింటినీ అధిగమించి భారతదేశంలో 29 రాష్ట్రాలు, 7 యూనియన్ టెర్రిటరీలు ఉండగా ఏ రాష్ట్రంలో గానీ, యూనియన్ టెరిటరీలో గాని లేని విధంగా జనవరి 1, 2018 నుండి వ్యవసాయానికి 24/7 నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను నిరంతరంగా అందిస్తున్న రాష్ట్రం మన తెలంగాణ రాష్ట్రం. కొన్ని రాష్ట్రాల్లో 24గంటల విద్యుత్‌ను అందిస్తున్నప్పటికీ, అందుకు కొంత విద్యుత్ ఛార్జీని వసూలు చేస్తారు, ఉచితంగా ఇవ్వరు. మరికొన్ని రాష్ట్రాలు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్నప్పటికీ రోజులో కేవలం 6 గంటలు గానీ, 9 గంటలు గానీ సరఫరా చేస్తారు. 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాల కృషి చేయడం జరిగింది. రాష్ట్రం ఏర్పడిన మొదట్లో దాదాపు 7,500 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉండగా, ఇప్పుడు దానిని దాదాపు 15,000 మెగావాట్లకు పెంచుకోవడం జరిగింది.

విద్యుత్ కొరత వల్ల వ్యవసాయ రంగంలోని బోరు పంపు సెట్లే కాకుండా అనేక ఇతర రంగాలు ఇబ్బంది పడ్డటువంటి పరిస్థితులున్నాయి. అందులో ముఖ్యంగా గృహాల్లో చూసుకుంటే ప్రతి ఇంట్లో, ప్రతి అపార్ట్‌మెంట్‌లో ఒక ఇన్‌వర్టర్ ఉండేది. ఇప్పుడు అటువంటి ఇన్‌వర్టర్స్ లేవు. పాత జనరేటర్స్ ఉపయోగించడం లేదు, కొత్త జనరేటర్స్ ఎవరూ పెట్టుకోవడం లేదు. గృహాలకు 24గంటల విద్యుత్‌ను అందించడం జరుగుతోంది. ఆనాడు పరిశ్రమలకు వారానికి రెండు, మూడు రోజులు కొన్ని, ప్రాంతాల్లో రోజులో 8, 9 గంటలు పవర్ హాలీడేస్ ఇవ్వడం జరిగింది. అప్పుడు ఆయా పరిశ్రమల యజమానులు మరియు కార్మికులు కూడా రోడ్ల మీదకు వచ్చి విద్యుత్ సరఫరా కొరకు ధర్నాలు చేయడం జరిగింది. కానీ, ఈరోజు 24 గంటల విద్యుత్‌ను అందించడం వల్ల పరిశ్రమ అధిపతులందరూ చాలా సంతోషంగా ఉన్నారు. గతంలో కార్మికుల పని దినాలు కూడా 10 నుండి 11 మాసాలు మాత్రమే ఉండేది, కానీ ఈరోజు 12 మాసాల వేతనాలు పోను బోనస్ ద్వారా అదనంగా ఒక మాసం వేతనం కలుపుకుంటే కార్మికులు దాదాపు 13 మాసాల వేతనం పొందడం జరుగుతోంది. ఈవిధంగా వ్యవసాయ, పరిశ్రమలు

మరియు గృహాలకు 24గంటల విద్యుత్‌ను ప్రభుత్వం సరఫరా చేయడం జరుగుతోంది. మొత్తంగా తెలంగాణ వెలుగు, జిలుగులతో నిండియున్నది. ఈవిధంగా తెలంగాణ వస్తే ఏమి వస్తుందన్న వారికి సమాధానంగా నీవు ఇవ్వని విద్యుత్‌ను మేము తెచ్చుకున్నామని, నీవు పెట్టిన ఇబ్బందులను తొలగించు కున్నామని గవర్నర్ గారి ప్రసంగం తెలియజేయడం జరిగింది.

అంతేకాకుండా, 34లక్షల రైతులకు సంబంధించిన దాదాపు రూ.17వేల కోట్ల పైచిలుకు రుణాన్ని మాఫీ చేయడం జరిగింది. రోహిణీ కార్తె వచ్చిందంటే గ్రామాల్లోని రైతులందరూ ఆ గ్రామ ఆసాముల దగ్గరకు గానీ, ఎవరైనా సేట్ల వద్దకు వెళ్లడం గానీ లేదంటే బ్యాంకు రుణాల కొరకు సంబంధిత పత్రాలు తయారు చేసుకోవడం గానీ జరుగుతుండేది. కానీ, జూన్ మాసం ప్రారంభం కాగానే వరుణ దేవుడు ఎప్పుడు కరుణిస్తాడా అని ఎదురు చూడకుండా ఎండాకాలంలోనే చెరువులను నింపు కుంటున్నాము, అనేక కాలువల ద్వారా నీటిని తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాము.

వంద రోజుల్లో 1500 టీములతో భూ రికార్డుల ప్రక్షాళన చేయడం జరిగింది. మనం గ్రామాల్లోకి వెళ్లి చూస్తే భూముల్లో వ్యవసాయం ఒకరు చేస్తారు, భూ రికార్డుల్లో ఒకరి పేరు ఉంటుంది, పహాణీలలో మరొకరి పేరు ఉంటుంది. భూ రికార్డులు ఇలా ఉన్నటువంటి తరుణంలో భూ రికార్డుల ప్రక్షాళన చేయాలన్న ఉద్దేశ్యంతో ఒక అద్భుతమైన కార్యక్రమంతో 72లక్షల ఖాతాలను ప్రక్షాళన చేయడం జరిగింది. 1.44కోట్ల ఎకరాలు వ్యవసాయ భూమిగా గుర్తించడం జరిగింది. వారికి అతి త్వరలో పాస్‌బుక్‌లు కూడా అందజేయడం జరగబోతోంది. స్వామినాథన్ కమిటీ కొన్ని డిమాండ్స్‌ని ఎక్కువ కాలంలో అమలు చేసేవిగా, కొన్ని డిమాండ్స్‌ని తక్కువ కాలంలో అమలు చేసేవిగా గుర్తించడం జరిగింది. అలాంటి డిమాండ్స్‌ని భారతదేశంలోని మన రాష్ట్రం ఒక్కటే తు.చ తప్పకుండా పాటిస్తుంది.

అందుకే 72లక్షల ఖాతాల రైతులకు, 1.44కోట్ల ఎకరాలకు, ఎకరానికి రూ.8వేల చొప్పున, ప్రతి పంటకు రూ.4వేల చొప్పున ఏప్రిల్ 20వ తేదీన ఇవ్వబోతున్నాము. భూరికార్డుల ప్రక్షాళనలో కూడా అనేకమంది అవరోధాలను సృష్టించాలని కొంతమంది చూసినప్పటికీ రెవెన్యూ కార్యాలయాల సిబ్బందితో భూరికార్డుల ప్రక్షాళన అద్భుతంగా చేసుకోవడం జరిగింది.

అదే విధంగా పంటలకు కనీస మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని మనం కూడా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఇటువంటి కార్యక్రమాలను ఆర్గనైజ్ చేసుకొనేందుకని రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేసుకోవడం జరిగింది. భారతదేశంలో రైతులను ఎవరైనా దగ్గరకు తీస్తే రైతులు వారి కష్టాలను చెప్పుకోవడమే తప్ప, వారిని చేరదీసిన సందర్భాలు ఎక్కడా లేవు. రైతులను పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలుగా విడదీస్తున్నటువంటి పరిస్థితులకు భిన్నంగా రైతులందరిదీ వ్యవసాయ కులం అనే ఒకటే కులంగా రైతు సమన్వయ సమితుల పేరుమీద గ్రామాల్లో ఉండేటటువంటి రైతులందరినీ ఏకం చేస్తున్నాము. మండలాల్లో ప్రతి 5వేల ఎకరాలకి ఒక రైతు వేదికను ఏర్పాటు చేసుకుంటున్నాము. ఆ 5వేల ఎకరాల్లో రైతు ఏ పంట వేసుకోవాలి, వాటి యొక్క ఇబ్బందులేమిటి, వచ్చిన పంటను ఎప్పుడు మార్కెట్‌కు తరలించాలనే విషయాలను తెలుసుకోవడం కోసం రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేసుకున్న చరిత్ర భారతదేశంలో తెలంగాణలో తప్ప, మరొక రాష్ట్రంలో ఎక్కడా లేదు.

వచ్చే సంవత్సర కాలంలో రైతుకి సమయానికి పెట్టుబడి ఇవ్వడం, సాగునీరు అందించడం, నీటిని తోడటానికి విద్యుత్‌ను అందించడం, వ్యవసాయ విస్తరణాధికారి ద్వారా వారికి కావాల్సిన టెక్నాలజీని అందించడం, తద్వారా వచ్చే పంటని వ్యవసాయ మార్కెట్లకి అందించే ప్రయత్నం చేస్తున్నాము. అసంఘటితంగా ఉన్నటువంటి రైతులను రైతు సమన్వయ సమితుల ద్వారా సంఘటితం చేసింది గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు తప్ప, మరొక్కరు కాదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

వ్యవసాయ రంగం నుండి వచ్చే ఉపాధి వాటా కేవలం 19శాతం మాత్రమే. కానీ, ఎక్కువ శాతం 58, 59 శాతం సర్వీసెస్ ద్వారా, మ్యాన్యుఫ్యాక్చరింగ్ ద్వారా వస్తుంది. పారిశ్రామిక రంగంలో అభివృద్ధి భారతదేశానిది 30 శాతం, 33 శాతంగా ఉంటే, తెలంగాణ రాష్ట్రానిది 45 శాతంగా ఉందని ఇంతకు ముందే ఐటి శాఖామాత్యులు తెలియజేయడం జరిగింది. కాబట్టి, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నప్పుడు ఉద్యోగాలు కావాలంటే పారిశ్రామిక అభివృద్ధి కూడా జరగాల్సిన అవసరం ఉంటుంది. దాని కోసం వివిధ రాష్ట్రాలు, వివిధ దేశాలు అనేక కొత్త పాలసీలు రూపొందించుకుంటారు, అనేక రాయితీలు ఇస్తుంటాయి,

కొత్త కొత్త అవకాశాలు కల్పిస్తుంటాయి. అలాగే పరిశ్రమలు మొదట్లో అనేక అనుమతులు పొందాల్సి ఉంటుంది. అలాంటి ఇబ్బందులన్నింటినీ గమనించి టిఎస్–ఐపాస్‌ను రూపొందించుకొని 15 రోజుల్లోనే 6200 సంస్థలకు అనుమతులు ఇవ్వడం జరిగింది. తద్వారా దరిదాపుగా రూ.1.18కోట్ల పెట్టుబడులను రాబట్టుకోగలిగాము. వాటిలో దాదాపు 3,300 పరిశ్రమలు ప్రారంభించుకోవడం జరిగింది. 2లక్షల మంది నేరుగా ఉద్యోగాలు పొందడం జరిగింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మనకు మొదటి ర్యాంకు రావడానికి కారణం కూడా అదే.

మ్యాన్యుఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీని గమనిస్తే కూడా యు.ఎస్. ప్రెసిడెంట్‌కు కావాల్సిన విమానాల తయారీలో ఉపయోగించేటటువంటి పరికరాలను కూడా మన తెలంగాణ రాష్ట్రంలోనే తయారు చేయడం జరుగుతోంది. అంతే కాకుండా ఐటి గానీ, ఐటి ఎగుమతుల సర్వీసుల్లో మనయొక్క పెట్టుబడి గతంలో 65వేల లక్షలుంటే, ఇప్పుడదీ 84వేల లక్షలుగా ఉంది. ఐటి ఎగుమతుల్లో వచ్చే ఒకటి, రెండు సంవత్సరాల్లో బెంగుళూరు కంటే మన రాష్ట్రం ముందుండే అవకాశం ఉంది. ఈవిధంగా ఐటి రంగంలో గానీ, పారిశ్రామిక రంగంలో గానీ మనం చాలా అద్భుతంగా దూసుకు పోతున్నాము.

శుద్ధి చేసిన నీరు దొరకకపోవడం ద్వారా భారతదేశంలో దాదాపు 78శాతం మందికి రకరకాల జబ్బులు వస్తున్నాయి. ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టకుండా, ఎన్ని రోజుల్లో చేస్తామని చెప్పకుండా శుద్ధమైన నీరు లేక అనేకమంది రోగాల బారిన పడుతున్నారని, ప్రజల యొక్క కష్టాలు తెలిసిన వ్యక్తిగా గౌరవ ముఖ్యమంత్రి గారు దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ.45వేల కోట్లతో, 10,500 జనావాసాలకి శుద్ధమైన నీటిని అందించాలనే లక్ష్యంతో తెలంగాణలో మిషన్ భగీరథ అనే ఒక అద్భుతమైన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. కృష్ణా, గోదావరి నదుల నుండి సర్ఫేస్ నీటిని పొందడంతో దరిదాపుగా 50శాతం రోగాలు తగ్గిపోతాయి. వాటిని శుద్ధి చేయడం ద్వారా మరొక 25శాతం రోగాలు తగ్గిపోతాయి. ఇలా మనకు వచ్చే రోగాల్లో దాదాపు 75శాతం రోగాలు తగ్గించడానికి శుద్ధి చేసిన నీటిని అందించాలని ఎవరూ అడగకపోయినా తనకు తాను ఒక నియంత్రణ విధించుకొని, ఒక కాల వ్యవధిని నిర్ణయించుకొని, తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఒక్క గ్రామానికి, ప్రతి ఇంటికి నీరందించకపోతే ఓట్లను అడగననే దీక్షని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు తీసుకోవడం జరిగింది. మిషన్ భగీరథ ద్వారా నీరందివ్వడమే కాకుండా మహిళల యొక్క అనేక కష్టాలను తగ్గించడం జరిగింది. మా స్వంత ఊర్లోని బోర్లు ఎండిపోగా వాటి గురించి ఆర్‌డబ్ల్యూఎస్ వారితో నిన్నగాక మొన్ననే మాట్లడగా రెండు, మూడు నెలల్లో బోర్లు వేస్తామని అన్నారు.

మా దగ్గర నీళ్లిచ్చాము, ట్యాంకులు కట్టాము అయినా మీరు ఇంకా ఇవన్నీ ఎందుకు చేస్తున్నారని అనేకమంది మాట్లాడడం జరుగుతోంది. అయినప్పటికీ నీళ్లు లేని బోర్లు, ఎండిపోయిన బావులు చాలా ఉన్నాయి. వీటన్నింటికీ విరుడుగానే ఉన్నటువంటి ట్యాంకులను ఉపయోగించు కొంటూ శుద్ధి చేసిన నీటిని ప్రజలందరికీ అందిస్తూ ఏ మహిళ కూడా బిందె పట్టుకొని బయటకు పోకుండా ఏర్పాటు చేస్తోంది గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారని తెలియజేస్తున్నాను. ప్రతి ఒక్కరి చేతిలో ఇంటర్‌నెట్ సదుపాయం గల రెండు, మూడు ఫోన్లు ఉంటున్నాయి. అటువంటప్పుడు అందరికీ మంచి స్పీడ్‌తో ఉన్నటువంటి ఇంటర్‌నెట్‌ని అందజేయాలనే ఉద్దేశ్యంతో మిషన్ భగీరథ పైప్‌లైన్లతో సహా ఫైబర్ ఆప్టిక్ లైన్ తీసుకుపోవడం ద్వారా తెలంగాణలోని ప్రతి గ్రామానికి నాణ్యమైన టెక్నాలజీని అందజేయడం జరుగుతోంది.

వ్యవసాయానికి పెట్టుబడి అందించే అంశంపై భారతదేశ రైతాంగం తరఫున మొట్టమొదటగా శ్రీ ఎం.ఎస్. స్వామినాథన్ గారు గౌరవ ముఖ్యమంత్రి గారిని అభినందించడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి గారు కేంద్ర ఆర్థిక మంత్రి వర్యులు శ్రీ అరుణ్ జైట్లీ గారిని కలవడానికి వెళ్లినప్పుడు కేంద్ర ఆర్థిక సలహాదారు శ్రీ సుబ్రహ్మణియన్ గారు వ్యవసాయానికి పెట్టుబడి కార్యక్రమం చాలా బాగుందన్నారు. అంటే, ఒక వ్యవసాయ, ఆర్థిక, రాజకీయ నిపుణులే కాకుండా ప్రపంచం మొత్తం ఈ యొక్క కార్యక్రమాన్ని అభినందిస్తున్నారంటే ప్రభుత్వం యొక్క దూరదృష్టికి జేజేలు పలకడం తప్ప, మరొకటి కాదని తెలియజేస్తున్నాను.

పశు సంపద, షీప్ రేరింగ్, మత్స్య పరిశ్రమ వంటి వ్యవసాయ అనుబంధ పరిశ్రమలున్నాయి. గతంలో మత్స్య పరిశ్రమ పెట్టినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ నుండి చేపలు కొని తెచ్చుకునే వారిమి. కానీ, ఇప్పుడు అలా కాకుండా మిషన్ కాకతీయ ద్వారా అనేక చెరువుల పూడిక తీసుకొని తద్వారా అనేక చేప పిల్లలను అందులో వేసుకొని తెలంగాణలో మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటున్నాము. గొర్రెల పెంపకం విషయంలో కూడా ఇది సాధ్యమా అని అనేక మంది

ఎకసెక్కాలాడారు. కానీ, మన రాష్ట్రానికి చుట్టు ప్రక్కల ఉన్నటువంటి రాష్ట్రాలకు పోయి గొర్రెలను తెచ్చుకోవడం జరిగింది. ఆవిధంగా నేటికి 75శాతం సబ్సిడీతో 55లక్షల గొర్రెలు లబ్ధిదారులకు అందించగా, దానికనుగుణంగా మరొక 17లక్షల గొర్రె పిల్లలు అదనంగా రావడం జరిగింది. మాంసం దిగుమతి చేసుకుంటున్న రాష్ట్రంగా కాకుండా వచ్చే సంవత్సరం నుండి తెలంగాణ రాష్ట్రం మాంసం ఎగుమతి చేసే రాష్ట్రంగా ఎదుగుతున్నామంటే షీప్ రేరింగ్‌లో మనం చేసిన కృషి ఫలిస్తుందని చెప్పుకోవచ్చు. మొన్ననే కర్ణాటక మంత్రి శ్రీ రేవన్న గారు మన రాష్ట్రంలో గొర్రెల పెంపకాన్ని ప్రశంసించడం జరిగింది. చాలామంది రాజకీయ నాయకులు హామీలిస్తున్నప్పటికీ, హామీలు నెరవేస్తున్న వారు మాత్రం కొద్దిమంది మాత్రమే. మేము కూడా చాలా రోజులుగా కర్ణాటకలో ఉన్నాము, అనేక వాగ్దానాలు చేసినాము, వాగ్దానాలు చేసినప్పటికీ అతి తక్కువ సమయంలో వాగ్దానాలను పూర్తి చేసింది మాత్రం ఖచ్చితంగా కేసిఆర్ గారేనని అనేక వేలాదిమంది యాదవ సోదరుల సాక్షిగా పార్టీలకు, వర్గాలకు అతీతంగా కర్ణాటక మంత్రి శ్రీ రేవన్న గారు తెలియజేశారంటే, వారియొక్క పలుకులు మనల్ని మరింత ముందుకు తీసుకుపోయే ప్రయత్నం చేస్తాయని తెలియజేస్తున్నాను.

గతంలో ప్రభుత్వ ఆసుపత్రులకు ఎవరు కూడా వెళ్లేవారు కాదు. Institutional Deliveries కేవలం 30 నుండి 33శాతం ఉండేది. కేంద్ర సంస్థ ద్వారా అపాయింట్ అయి ఆ రంగంలో పని చేస్తున్న అంగన్‌వాడీలు గానీ, ఆశా వర్కర్లు గానీ, ఏఎన్ఎంలను గానీ పట్టించుకున్న నాథుడు ఎవరూ లేరు.

12.20 మ. 10-15 సంవత్సరాలుగా ధర్నాలు, రాస్తా రోకోలు, గుర్రపుడెక్కలతో తొక్కించడాలు వంటివి అనేకం ఉమ్మడి రాష్ట్రంలో జరిగాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వారి యొక్క కష్టాలు తెలుసుకొని, వారికి సహకరించాలనే ఉద్దేశంతో వారి యొక్క జీతాలను రెండింతలు చేయడం జరిగింది. అలాగే అంగన్ వాడీలకు, ఆశా వర్కర్లకు, ఏఎన్ఎంలకు జీతాలు పెంచడం జరిగింది. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్లను కూడా రిక్రూట్‌మెంట్ చేయడం జరిగింది. 18 సంవత్సరాలకే పెళ్లి జరగాలనే ఒక మంచి సాంఘిక కోణంలో ఆలోచించి కళ్యాణ లక్ష్మీ పథకాన్ని చేపట్టడం జరిగింది.

అదే విధంగా ప్రయివేటు ఆసుపత్రులలో అవసరం ఉన్నా, లేకున్నా ఆపరేషన్లు చేస్తున్నారు, గర్భిణీ స్త్రీలు కూడా డాక్టర్లు చెప్పిన దానికి భయపడి ఆపరేషన్లు చేయించుకునే సందర్భాలు ఉండేవి. ప్రభుత్వం చేపట్టిన చర్యల వలన ప్రభుత్వ ఆసుపత్రులకు గర్భిణీ స్త్రీలు వెళ్లడం వల్ల ఆపరేషన్ లేకుండా, నార్మల్ డెలివరీలు చేస్తూ, వారికి కొడుకు పుడితే రూ.12,000/- బిడ్డ పుడితే రూ.13,000/-లు నేరుగా ఇస్తూ, రూ.2,000/- కెసిఆర్ కిట్ రూపంలో ప్రభుత్వం ఇవ్వడం వల్ల 33 శాతం ఉన్న Institutional Deliveries 50 శాతానికి పెరగడం జరిగింది. ప్రతి హెడ్ క్వార్టర్లలో అద్భుతమైన ప్రభుత్వ ఆసుపత్రులు ఈరోజు ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ రోజు 29 రాష్ట్రాలలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో మొత్తం 517 రెసిడెన్షియల్ స్కూల్స్‌ను కొత్తగా ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ స్కూల్స్‌లో ఒక పదవ తరగతి వరకే కాకుండా ఇంటర్మీడియట్ వరకు నిర్వహించడం జరుగుతున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు మాత్రమే డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలు ఉండేవి. ఒకటి కర్నూల్ జిల్లాలో, మరొకటి నాగార్జున సాగర్‌లో ఉండేవి. ఆ తర్వాత నాగార్జున సాగర్‌లో రెసిడెన్షియల్ కళాశాల మూత పడింది. ఇవ్వాళ మొట్టమొదటి సారిగా 36 డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలు ఏర్పాటు చేసిన చరిత్ర తెలంగాణ రాష్ట్రానిది. ఎస్సీలకు 36, ఎస్టీలకు 17 మొత్తంగా 53 కొత్త డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసుకోవడం చాలా అద్భుతమైనది. రెసిడెన్షియల్ స్కూల్స్‌తోపాటు, రెసిడెన్షియల్ కళాశాలలు పెట్టిన చరిత్ర ఒక్క తెలంగాణ రాష్ట్రానికే దక్కుతుంది.

అంతేకాకుండా ఉన్నత చదువుల కోసం విద్యార్థులు ఇతర దేశాలకు వెళ్లడానికి ఇంతకుముందు అరకొరగా పది మందికో, ఇరవై మందికో రూ.5.00 లక్షలో, రూ.10.00 లక్షలో ఇచ్చే పరిస్థితి ఉండేది. ఇవ్వాళ అంబేద్కర్ పథకం, జ్యోతిబా పూలే పథకం క్రింద ముస్లిం మైనారిటీలకు వేరే పేరుతో దాదాపు 20 లక్షల మందికి పైగా అనేక దేశాలకు సంబంధించి ఏ కోర్సు చేద్దామనకున్న స్కాలర్‌షిప్ ఇస్తున్న చరిత్ర భారతదేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నది. గతంలో సంక్షేమ కార్యక్రమాలైన కళ్యాణ లక్ష్మీ పథకం, షాదీ ముబారక్, ఆసరా పథకాలకు 28 లక్షల మందికి రూ.800 కోట్లు మంజూరు చేసేవారు. ఇవ్వాళ దాదాపు 38 లక్షల మందికి సంబంధించి అందులో బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, బోదకాలు ఉన్న వారికి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నది.

మొన్న మేము గౌరవ శ్రీ తుమ్మల నాగేశ్వర రావు గారి నియోజకవర్గంలో ఉన్న పాలేరులో ఒక మీటింగుకు

వెళ్లినప్పుడు అక్కడ అనేక మంది బోదకాలుతో బాధ పడుతున్న వారిని మంత్రిగారు గమనించి, గౌరవ ముఖ్యమంత్రి గారి వద్దకు తీసుకెళితే, మనసున్న ముఖ్యమంత్రిగారు వెంటనే స్పందించి, వారందరికి పెన్షన్స్ మంజూరు చేయడం జరిగింది.

వరంగల్ జిల్లాలో ఉన్న ఒంటరి మహిళలకు ఉపాధి లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని మేము చెప్పగానే, అందులో దాదాపు 1.50 లక్షల మందికి పెన్షన్స్ మంజూరు చేయడం, అలాగే బీడీ కార్మికులలో దాదాపు నాలుగున్నర లక్షల మందికి పెన్షన్స్ మంజూరు చేయడం జరిగింది. ఇవ్వాళ ఏదో రకంగా 45 లక్షల మందికి పెన్షన్స్ రూపంలో సంవత్సరానికి సుమారు రు.5,500 కోట్లు తెలంగాణ రాష్ట్రం చెల్లిస్తోంది.

చివరగా మనం ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించాం. మన యొక్క సంస్కృతి, వైభవాన్ని, తెలుగు భాష పట్ల మన ప్రేమని చూసుకున్నట్లయితే, అది కూడా ఒక చరిత్రగా నిలిచిపోయింది. మనకు తెలుగు భాష సరిగా రాదని, పద్యం మనది కాదని, గద్యం రాయ రాదని అనేక మంది వెక్కిరించారు. కానీ పాట గాని, పద్యం గాని, వచనం గాని అనేక ప్రక్రియలలో తెలంగాణలో మనకున్న సంపద ఏమిటని, ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినప్పుడు వేలాది మంది ఆ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఇక్కడ ఉన్నటువంటి సభ్యులకు ఎన్ని పనులు ఉన్నా, ఉదయం గాని, సాయంత్రం గాని, ఆ సమావేశ మందిరానికి వెళ్లి, దానిని ఆస్వాదించి, మన భాషయొక్క గొప్పతనాన్ని తెలుసుకోవడం జరిగింది. ప్రపంచంలో ఉన్న తెలుగు వారందరూ తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ కేంద్రంగా, తెలంగాణలో ఉన్న తెలుగు ప్రజలందరూ కూడా కీర్తించబడే విధంగా, ఆనందించబడే విధంగా ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి.

అదేవిధంగా మిషన్ భగీరథ కావచ్చు, మిషన్ కాకతీయ కావచ్చు, వ్యవసాయ పెట్టుబడి కావచ్చు ఇటువంటి అద్భుతమైన కార్యక్రమాల ద్వారా అభివృద్ధి ఒకవైపు పరుగెత్తుతుంటే, రెండవ వైపు ఆసరా పెన్షన్స్ గాని, కళ్యాణ లక్ష్మీ పథకాలు మరియు మిగతా అన్ని కార్యక్రమాలలో అభివృద్ధి జరుగుతోంది. తెలంగాణ వస్తే మా నీళ్లు, మా నిధులు మాకు వస్తాయనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోంది. ఇప్పటికే అనేక రంగాలలో ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. ఇంకా ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. ముఖ్యంగా సింగరేణిలో ఐదు వేల ఉద్యోగాలు, ఆర్‌టిసి లో ఐదువేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. ఎలక్ట్రిసిటి డిపార్టుమెంటులో సుమారు 25 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగస్తులను పర్మినెంట్ చేసుకున్నాం. అదే విధంగా ఇంజనీరింగ్ సంస్థలలో కూడా అనేక ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. ఇంకా అనేక మంది ప్రభుత్వంలో ఉన్న లక్ష ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. అందులో 15వేల నుండి 20 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ అయినాయి. 35 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్స్ ఇవ్వబడ్డాయి. వచ్చే సంవత్సర కాలంలో మ్యానిఫెస్టోలో గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పిన విధంగా, అవి కూడా పూర్తయ్యే దిశగా ఉన్నాయని తెలియజేస్తున్నాను.

భారతదేశంలోనే తెలంగాణ అనేక రంగాలలో నెంబర్ వన్‌గా ఉండే విధంగా గౌరవ ముఖ్యమంత్రిగారు, మంత్రి వర్గం మరియు ప్రభుత్వం విశేష కృషి జరుపుతున్నది. దానియొక్క ప్రతీకగా గవర్నర్ గారు చేసిన అద్భుత ప్రసంగానికి, తెలంగాణ ప్రభుత్వ రిపోర్టుకి మేమందరం మద్దతు ఇస్తూ, ఈ అవకాశమిచ్చినందుకు తమరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. జై తెలంగాణ.

**శ్రీ నారదాసు లక్ష్మణ రావుః–** అధ్యక్షా, గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడడానికి అవకాశమిచ్చిన తమరికి మొదట నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. గౌరవ సభ్యులు డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ, ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి, సంక్షేమ, సామాజిక, సేవా కార్యక్రమాలు అన్నింటిని వారు ఉదహరించారు. వారు మాట్లాడిన తర్వాత నా స్పీచ్ యొక్క సబ్జెక్టు థీమ్‌ను మార్చుకున్నాను. ఎందుకంటే వారు స్పృశించని అంశం లేదు. దాదాపు అన్ని అంశాల గురించి చెప్పడం జరిగింది. అధికారమంటే తిని పడుకోవడం కాదు, ప్రజల సొమ్ము కాజేయడం కాదు. అధికారమంటే గౌరవ ముఖ్యమంత్రిగారికి అది ఒక బాధ్యత, అధికారమంటే ఒక లక్ష్యాన్ని సాధించడం, అధికారమంటే అనుకున్న లక్ష్యాన్ని ప్రజలకు చేసి చూపించడమనేటువంటి భావన గవర్నర్ గారి ప్రసంగం చూసిన తర్వాత మనకు అర్థమవుతుంది. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని, ప్రజలకోసం వినియోగించాలి. ప్రజలు ఇచ్చిన డబ్బును ప్రజల కోసం ఖర్చు చేయాలనేటటువంటి భావనతో ప్రజలే కేంద్రంగా, ప్రజా సమస్యలే ఇతివృత్తంగా గౌరవ ముఖ్యమంత్రిగారు అత్యంత పారదర్శకంగా పరిపాలన

కొనసాగిస్తున్నారు. ప్రజలకు సంక్షేమం అందించడమే, సంపూర్ణమైన న్యాయమని, అధికారాన్ని దానికి వినియోగించాలని గౌరవ ముఖ్యమంత్రిగారు భావిస్తున్నారు. ఇంతకు ముందు గౌరవ సభ్యులు చెప్పినట్లు, తెలంగాణ వచ్చిన ఈ మూడున్నర సంవత్సరాలలోనే అనేక కార్యక్రమాలను రూపొందించి, వాటిని అమలు చేయడం జరుగుతోంది.

మనిషి పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు జీవన క్రమంలో ఎదురయ్యేటటువంటి అనేక అవసరాలు, కావలసినటువంటి సౌకర్యాలు అన్నింటిని కల్పించాలని గౌరవ ముఖ్యమంత్రిగారు భావిస్తున్నారు. ఆ భావనకు తగినట్లుగా గవర్నర్ గారి ప్రసంగం ఉందని నేను భావిస్తున్నాను. రాజ్యం అంటే ఏమిటో కాదు, అది ప్రజల సంక్షేమానికి సంబంధించింది. ప్రజల జీవన క్రమంలో ఎదురయ్యేటటు వంటి అనేక సమస్యల పరిష్కారం కొరకు రాజ్యం తన యొక్క విధి విధానాలను మార్చుకోవలసి ఉంటుంది. ఒకప్పుడు యథా రాజ, తథా ప్రజ అనే సామెత ఉండేది. ఇవ్వాళ ఆ సామెతను గౌరవ ముఖ్యమంత్రిగారు తిరగరాస్తు, యథా ప్రజ, తథా రాజ అనే కొత్త సామెతకు శ్రీకారం చుట్టారు. ఇవ్వాళ కొట్లాడి సాధించుకున్న తెలంగాణను నవ తెలంగాణగా, బంగారు తెలంగాణగా తీర్చి దిద్దడానికి ఆయన అనేక రకాల బాటలు వేస్తున్నారు. ఆ బాటలో భాగంగా వ్యవసాయ రంగం, సంక్షేమ రంగం, పారిశ్రామిక రంగం, విద్యా, వైద్య, శాంతిభద్రతల రంగాలన్నింటికీ ప్రధాన ప్రాధాన్యతను ఇచ్చి, వందల వేల గంటలు మానసికమైనటువంటి పరిశీలన చేసి, ఒక్కొక్క కార్యక్రమాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారే స్వయంగా పరిశీలిస్తూ, అమలు చేస్తున్నారు. తద్వారా ఇవ్వాళ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రజలందరూ, ఒక సుఖమైనటువంటి, సమాన న్యాయం కలిగినటువంటి పరిపాలన కొనసాగుతుందనే భావనకు వచ్చారు. ఈ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడంలో గౌరవ ముఖ్యమంత్రిగారి యొక్క సోషల్ ఇంజనీరింగ్, సోషల్ కాన్సెప్ట్ చాలా గొప్పది.

మన రాష్ట్రం నూటికి ఎనభై నుంచి తొంభై శాతం వరకు బడుగు బలహీన వర్గాలు ఉన్నటువంటి రాష్ట్రం. ఈ వర్గాలను అన్ని రకాలుగా తీర్చిదిద్దకపోతే రాష్ట్రం అభివృద్ధి చెందినట్లు కాదు అని భావించి, అటు రాజకీయాలలో గాని, ఇటు సామాజిక రంగాలలో గాని అదేవిధంగా పరిపాలన రంగాలలో గాని రాజ్యాంగబద్ధమైనటువంటి పదవులను ఇవ్వడంలో, సామాజికంగా అనేక వర్గాలకు ఉపాధిని కల్పించడంలో వారు గొప్ప సోషల్ ఇంజనీరింగ్‌ను అమలు చేస్తూ, సమానత్వాన్ని సాధిస్తూ ఈ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లుగా మన గవర్నర్ గారి ప్రసంగాన్ని చూసినప్పుడు మనకు అర్థమవుతుంది.

అలాగే సమాజంలో ఉన్నటువంటి అన్ని సంపదలలో మానవ సంపద గొప్ప సంపద. ఇందులో ప్రధానమైనటువంటి వారు విద్యార్థులు. వారిని ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దాలి. వారందరికీ విద్యను సమానంగా అందించనంత వరకు ఆ సమాజం అభివృద్ధి చెందదు. విద్య లేనిదే వికాసం లేదని, విద్య ద్వారానే సకల ఆర్థిక అభివృద్ధి అని, విద్య లేకపోతే బడుగు బలహీన వర్గాలు వారియొక్క హక్కులు కోల్పోయి, అణచివేతకు గురవుతారని, వారి యొక్క స్వేచ్ఛకు భంగం కలుగుతుందని, వారందరికీ విద్యను సమానంగా అందించాలనే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ మరియు ఇతర పేద వర్గాల విద్యార్థులందరికీ 517 రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించడం జరిగింది. అందులో ఉచిత పుస్తకాలు, దుస్తులతో పాటు మంచి సన్న బియ్యం ద్వారా భోజనం కల్పిస్తూ అన్ని రకాలుగా విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేటట్లు వారిని సమగ్ర సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం కలిగినటువంటి పౌరులుగా తీర్చిదిద్దే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ ప్రయత్నంలో భాగంగానే ప్రభుత్వం విద్య అభివృద్ధి కొరకు గొప్ప ప్రణాళికలు ఏర్పాటు చేయడం జరిగింది.

అదేవిధంగా మానవ మనుగడకు చెట్లు అనేవి చాలా మూలాధారం. ప్రకృతి సమతుల్యతకు, మానవ మనుగడకు వర్షాలు ఎంత ప్రధానమో, ఆ వర్షాలకు మూలమైనటువంటి వనాలను కొన్ని సంవత్సరాల నుండి పట్టించుకోక పోవడం వలన, దేశంలో వర్షాభావ పరిస్థితులు ఎదురైనాయి. అందువల్ల వనాలలో ఉండవలసినటువంటి కోతులు జనాలలోకి వచ్చి, జన జీవితాన్ని కొంత ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. అటువంటి సందర్భంలో గౌరవ ముఖ్యమంత్రి కెసిఆర్ గారు 'వానలు వాపసు రావాలి, కోతులు వాపసు పోవాలి' అనే నినాదంతో రాష్ట్రంలో 230 కోట్ల మొక్కలను పెంచాలనే ఉద్దేశంతో, ఇప్పటివరకు సగానికి కంటే ఎక్కువ మొక్కలను నాటి, వాటిని కాపాడి, వాతావరణ సమతుల్యతకు, మానవ మనుగడకు జీవనాధారానికి వర్షాలు కురిసే విధంగా గొప్ప పథకాలను ప్రారంభించి, ఈ రాష్ట్రంలో హరితహారాన్ని విజయవంతం చేయడం జరుగుతున్నది.

అలాగే వ్యవసాయ రంగం గురించి గౌరవ సభ్యులు డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి గారు చాలా విషయాలు చెప్పడం

జరిగింది. గత ప్రభుత్వాలు రైతే రాజు అన్నారు, రైతు లేనిదే రాజ్యం లేదని అన్నారు. రైతు దేశానికి వెన్నెముక అన్నారు. యావత్తు దేశానికే అన్నదాత అన్నారు. 70 సంవత్సరాల భారతదేశ చరిత్రలో ఇప్పటికి సమారు 15 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటే, అది ఎంత శోచనీయమో మనం ఆలోచించాలి అధ్యక్షా. మనకు ప్రధానమైనటువంటి ఆదాయ ఆర్థిక వనరు వ్యవసాయం. మన మూల రంగం వ్యవసాయం. అలాంటి మూల రంగమైనటువంటి వ్యవసాయం అభివృద్ధి చెందకుండా దేశంగాని, రాష్ట్రంగాని ఆర్థికంగా అభివృద్ధి చెందదు. గత ప్రభుత్వాలు వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసినటువంటి పరిస్థితుల్లో అన్నదాతలు అయిన వ్యవసాయదారులు, వ్యవసాయాన్ని విడిచి పొట్టచేత పట్టుకొని గల్ఫ్ దేశాలకు తట్ట మోయడానికి పోయినటువంటి పరిస్థితులు మనం చూడడం జరిగింది.

దేశం లోపలగాని, రాష్ట్రం లోపలగాని పుష్కలమైన నీరు ఉన్నది, సారవంతమైన భూములు ఉన్నాయి. రాత్రనకా, పగలనకా రెక్కలు ముక్కలు చేసుకొని శ్రమించే లక్షలాది మంది రైతులు, శ్రమజీవులు ఉన్నారు. గోదావరి, కృష్ణా నదీ జలాలున్నాయి. సారవంతమైన నదీ తీర ప్రాంతం ఉన్నది. ఇవన్నీ ఉన్నప్పటికీ రైతులు ఈ రకంగా ఎందుకున్నారని ఆలోచన చేసిన వారు మన గౌరవ ముఖ్యమంత్రిగారు. కానీ, గత పాలకులకు చిత్తశుద్ధి లేక పరిపాలన అంటే తిని పడుకోవడం అని భావించి, పరిపాలన అంటే ప్రజల సొమ్ము కాజేయడంగా భావించి, ప్రధానమైన రైతాంగాన్ని ఆ రకంగా ఇబ్బందులకు గురి చేయడం జరిగింది. అటువంటి దుర్భర పరిస్థితుల నుండి ఇవ్వాళ వారు ఆనందంతో వెల్లివిరిసే విధంగా ఉండడానికి అనేక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి గౌరవ ముఖ్యమంత్రిగారు శ్రీకారం చుట్టారు.

వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కోటి ఎకరాలకు నీళ్లు ఇవ్వాలి, వెయ్యి టిఎంసిల నీళ్లను వినియోగంలోకి తేవాలి. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో దాదాపు 1326 టిఎంసిల నీళ్లను మనం వాడుకునే అవకాశం ఉన్నప్పటికీ, గత ప్రభుత్వాలు కనీసం 200 టిఎంసిల నీళ్లను కూడా వాడుకోలేని పరిస్థితుల్లో ఉండి, వ్యవసాయమంటే రైతులకు విముఖత కలిగించే విధంగా తయారుచేశారు. అటువంటి సందర్భంలో కాళేశ్వరం వద్ద ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం, కన్నేపల్లి, తుపాకులగూడెం వంటి ప్రధానమైన ఆరు బ్యారేజీల నిర్మాణానికి, రోజు ఐదు లక్షల సిమెంటు బస్తాలను వినియోగిస్తూ, ప్రతిరోజు 24వేల మంది 24 గంటలు శ్రమిస్తూ, ఈరోజు 1000 టిఎంసిల నీళ్లను నిలువచేసి కోటి ఎకరాలకు నీరందించడానికి చేస్తున్నటువంటి మిషన్ భగీరథ ప్రయత్నాన్ని చూస్తే, ఇవ్వాళ రాష్ట్ర ప్రజలు, దేశ ప్రజలే కాకుండా ప్రపంచమే అబ్బురపడే విధంగా ప్రాజెక్టు నిర్మాణం అద్భుతంగా కొనసాగుతోంది.

**12.40 మ.** ఈ విషయాలన్నీ తెలంగాణ రాష్ట్రం రావడం వల్ల మాత్రమే సాధ్యం కాలేదు, నేడు రాష్ట్ర రాజకీయాలలో, పరిపాలన రంగాలలో ఒక నూతన ఒరవడిని, నూతన రాజకీయ సంస్కృతిని సృష్టిస్తూ, టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం పరిపాలన చేయడం వలన ఇదంతా సాధ్యమైనది. రాజకీయాలంటే రొటీన్ కాదు, పరిపాలన అంటే మూస విధానాలు, పద్ధతులు కాదు. కొత్త అన్వేషణలతో, కొత్త ఆలోచనలతో ప్రజలకు ఏం అందించాలి అని ప్రతినిత్యం పరిశోధనలు చేస్తున్నారు, మన గౌరవ ముఖ్యమంత్రిగారు. సమకాలీన రాజకీయ పరిశోధకుడు. వారి యొక్క మస్తిష్కంలో ఉన్నటువంటి అనేక ఆలోచనలకు ఆచరణ రూపం ఇస్తూ ఈ పథకాలను ప్రారంభించారు.

మహిళలకు ప్రకృతి ఇచ్చినటువంటి గొప్ప వరం మాతృత్వం. ఆ మాతృత్వం మహిళలకు మధురంగా, తీపి గుర్తుగా ఉండాలి గానీ, నరకంగా ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఒక మానవీయ కోణంలో గౌరవ ముఖ్యమంత్రిగారు ఆలోచన చేశారు. గర్భిణీ స్త్రీలు పనులకు పోవడం ద్వారా తల్లి, పిల్లలు అనారోగ్యానికి గురవుతారనే ఉద్దేశ్యంతో వారికి రూ.12,000లను మూడు విడతలుగా ఇవ్వాలని నిర్ణయించారు. అదేవిధంగా 16 వస్తువులతో రూ.2000ల విలువ గల 'కేసిఆర్ కిట్' పుట్టిన పిల్లకు, తల్లికి ఎంతగానో ఉపయోగపడే విధంగా తయారు చేసి ప్రభుత్వ ఆసుపత్రులలో ఇవ్వడం జరుగుతోంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరూ ఆనందంగా ఉన్నారు. అదే విధంగా 'అమ్మ ఒడి', 'ఆరోగ్య లక్ష్మి' కార్యక్రమాల ద్వారా మహిళల యొక్క ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని చాటడానికి గౌరవ ముఖ్యమంత్రిగారు ఎంతగానో కృషిచేస్తున్నారు. దేశంలో సగ భాగం మహిళలే కాబట్టి, వారిని అభివృద్ధి పరచకుండా, అన్ని రకాల సౌకర్యాలు కల్పించకుండా, రాజకీయ సాధికారత కల్పించకుండా మహిళలు అభివృద్ధి చెందరు. వారు అభివృద్ధి చెందనంత వరకు దేశం కాని, రాష్ట్రం కాని అభివృద్ధి చెందినట్లు కాదనే

భావనతో మహిళలను రాజకీయ, సామాజిక రంగాలలో తీర్చిదిద్దడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే వ్యవసాయ మార్కెట్ కమిటీలలో మహిళలకు రిజర్వేషన్‌ను కల్పించడం జరిగింది. గౌరవ ముఖ్య మంత్రిగారు దేశంలో ఉన్న గొప్ప గొప్ప సామాజిక శాస్త్రవేత్తల, సంస్థల, పత్రికా సంపాదకుల మన్నలను పొందుతున్నారు.

మనిషిచేస్తున్న పనులను బట్టి కులాలను నిర్ణయించడ మైనది. ఆ కులాలను బట్టి కులవృత్తులు ఏర్పడ్డాయి. ఒకప్పుడు దేశ, రాష్ట్ర, గ్రామాలలో ప్రజలు కుల వృత్తులను చేపట్టి ఆదాయాన్ని సంపాదించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉండేవి. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని రంగాలు ఏ విధంగానైతే విధ్వంసం అయ్యాయో అదే విధంగా కుల వృత్తులు కూడా విధ్వంసం కావడం జరిగింది. కులాలు ఆర్థికంగా అభివృద్ధి చెందకుండా కుల నిర్మూలన జరగదు. కుల నిర్మూలన జరగాలంటే కులాలు మొట్ట మొదట ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. కనుక కులవృత్తి, చేతివృత్తుల వారిని ఆదుకోవాలి అనే గొప్ప ఆలోచనతో మత్స్యకారులకు, చేనేత కార్మికులకు, కురుమలకు వారి వారి సామర్థ్యాలను, శక్తిని, అనుభవాలను బట్టి వృత్తిపరమైన సౌకర్యాలను కల్పించడం ద్వారా వారిని ఆర్థికంగా ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి ఇటువంటి కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. కుల వృత్తులను ప్రోత్సహించడం అంటే కులాలను ప్రోత్సహించడం కాదని, మాదిగ వారు చెప్పులే కుట్టుకోవాలి, కురమలు గొర్రెలనే మేపుకోవాలి అనే విధంగా కాకుండా వారు కూడా ఉన్నత చదువులు చదువుకొని ఆర్థికంగా ఎదగడానికి అనేక పథకాలను రూపొందించడం జరిగింది. ఆర్థికంగా ఎదగకుండా వారు ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు కాలేరు. అందుకు మొట్టమొదట కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. అర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే ఆ కుటుంబంలో ఉన్న పిల్లలను చదివించుకునేటటువంటి అవకాశం ఉంటుంది. విద్యార్హతలు ఉన్నవారికి ఉద్యోగావకాశాలు, వారి పిల్లలకు రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకునే అవకాశాలు కల్పించడం జరిగింది. కులవృత్తులకు ప్రోత్సాహం లేక ఆ కులవృత్తిని చేయకుండా ఉన్నవారికి ఆర్థిక సహాయం చేసి గొల్ల కురుమలకు గొర్రెలు, మత్స్యకారులకు చేపలను ఇవ్వడం జరిగింది తప్ప, ఏ కులవృత్తుల వారు ఆ కులాలనే చేయాలనే ఉద్దేశ్యం తెలంగాణ ప్రభుత్వానికి లేదన్నారు. టియస్–ఐపాస్ మరియు ఇతర పథకాల ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించి అన్ని రకాలుగా ప్రభుత్వం వారిని ఆదుకోవడం జరిగింది.

ఉద్యోగం అంటే పని, పని అంటే సంపాదన, సంపాదన అనేది మానవ మనుగడ కోసం అవసరం. ఒక వ్యక్తి తన కుటుంబం యొక్క ఆర్థిక అవసరాలను తీర్చడం కోసం తమకు తాము సృష్టించుకునే పనే ఉద్యోగం. ఉద్యోగం అంటే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలే కాదు, ఏ వృత్తి అయినా ఉద్యోగమే. ఆ రకంగా ఏ వృత్తి చేసుకునే వారికి ఆ వృత్తికి సంబంధించిన ఉపాధి అవకాశాలను, ప్రోత్సాహాన్ని కల్పించాలి. మనిషి జీవించడానికి, తనకున్న నైపుణ్యాన్ని పెంపొందించి, బ్రతకడానికి కావలసినటువంటి అవకాశాలను కల్పించడమే ప్రభుత్వాల పని. అటువంటి అవకాశాలను కల్పించడం ద్వారానే వారికి ఉద్యోగాలు ఇచ్చినట్లుగా భావించబడుతుందని గౌరవ ముఖ్యమంత్రిగారు కుల వృత్తులను, చేతి వృత్తులను ప్రోత్సహించడం ద్వారా వారి యొక్క దార్శనికతను చాటుకున్న సందర్భాన్ని గవర్నర్‌గారి ప్రసంగం ప్రతిబింబించింది.

మన యొక్క ఆలోచనలో మార్పు రావాలి. ఏ పార్టీ వారు అయినా అధికారంలోకి వచ్చినప్పుడు ఎందుకు వచ్చాము అనేటటువంటి ఆలోచన చేయాలి. అప్పుడే రాజకీయ రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టగలుగుతాము. ప్రజలు ఆశించిన విధంగా, ప్రజలు మెచ్చే విధంగా పరిపాలనను అందించగలుగుతాము. గవర్నర్ గారి ప్రసంగం సందర్భంగా జరిగిన సంఘటనలు చూస్తే చాలా బాధాకరంగా అనిపించాయి. గతంలో 20, 30 సంవత్సరాలు అధికారంలో ఉన్నవారు, అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేని వారు, టిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అనేక మంచి పనులను చూసి జీర్ణించుకోలేక సభలో ప్రవర్తించిన తీరు బాధని కలిగించింది. గవర్నర్ గారి ప్రసంగం తెలంగాణ ప్రభుత్వం యొక్క దార్శనికతను, అమలు చేస్తున్నటువంటి అభివృద్ధి, సామాజిక, సంక్షేమ, సేవా కార్యక్రమాలను ప్రతిబింబిస్తున్నట్లుగా ఉందని భావిస్తూ, గవర్నర్ గారి ప్రసంగానికి నా పూర్తి మద్దతును తెలియజేస్తూ నాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన గౌరవ డెప్యూటీ చైర్మన్ గారికి మరొక్కసారి ధన్యవాదాలను తెలియజేస్తూ జై తెలంగాణ, జై జై బంగారు తెలంగాణ.

**శ్రీ ఎన్. రామచంద్రరావుః–** గవర్నర్ గారి ప్రసంగం మీద మాట్లడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. అధ్యక్షా, ఇంతవరకు డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి గారు, శ్రీ నారదాసు లక్ష్మణ్‌రావుగారు గవర్నర్ గారి ప్రసంగం మీద మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం అమలు చేసినటువంటి అనేక విషయాలను మనకు తెలియజేయడం జరిగింది.

గత సంవత్సరం, మరియు ఈ సంవత్సరం గవర్నర్ గారి ప్రసంగాన్ని పోల్చి చూసినట్లైతే అప్పటి ప్రసంగంలో 35 పేజీలు, ఇప్పటి ప్రసంగంలో 24 పేజీలే ఉన్నాయి. పేజీలు తగ్గాయంటే చేసే పనులు తగ్గాయా? లేకపోతే అమలు చేస్తున్న పథకాలు తగ్గినట్లుగా భావించుకోవాలా? గత వాటితో పోల్చి చూడడం వలన చాలా అంశాలు, కొత్త విషయాలు గవర్నర్ గారి ప్రసంగంలో రాలేదు. తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలోని ప్రజల ఆశల, ఆకాంక్షల మేరకు ఈ ప్రభుత్వ పని తీరు లేదని చాలా మంది భావిస్తున్నారు. ప్రసంగంలో అనేక అంశాలను పొందుపరచి ఉండవచ్చు, మంచి పథకాలను మీరు ముందుకు తీసుకొని వచ్చి ఉండొచ్చు. మంచి పథకాలైతే ఎవరైనా మంచిని మంచే అని ఒప్పుకుంటారు. చాలా ప్రసంగాలలో జాతీయ నాయకులే మంచిగా ప్రశంసిస్తున్నారని మీరే చెప్పారు. మంచి పథకాలు అయితే తప్పకుండా మేము ప్రశంసిస్తాము.

కాళేశ్వరం ప్రాజెక్టు గురించి చెప్పారు. ఈ రాష్ట్రానికి సాగు నీరు కావాలి. నీటి కొరత పోవాలంటే తప్పకుండా ప్రాజెక్టులు కావలసిందే. దానికి సంబంధించిన క్లియరెన్సులను పక్కనున్న మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. మహారాష్ట్రలో కూడా భారతీయ జనతా పార్టీ ప్రభుత్వమే. పథకాలను ప్రశంసించేటప్పుడు what is the importance of effective performance, effective implementation of the schemes అనే దాని మీద ఈరోజు చర్చిస్తే బాగుంటుందని తమరి ద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను.

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మనకు ఉన్నటువంటి అనేకమైన అంశాలలో గవర్నర్ గారి ప్రసంగం అనే అంశాన్ని ప్రస్తుతం సభలో చర్చిస్తున్నాము. తలసరి ఆదాయం, వ్యవసాయ రంగం మీద వారు మాట్లాడడం జరిగింది. ముందుగా తలసరి ఆదాయం అనే విషయానికి వస్తే జీఎస్‌డిపీ పెరిగిందన్నారు. అది వాస్తవం కావచ్చు. కొన్ని కేంద్ర ప్రభుత్వం యొక్క పథకాల ద్వారా, కొన్ని రాష్ట్ర ప్రభుత్వం యొక్క పథకాల ద్వారా రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. తలసరి ఆదాయం పెరిగిన మాట వాస్తవం. ఆదాయం పెరిగితే పెరిగి ఉండవచ్చు. కానీ మనకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపుల ద్వారా ప్రజల మీద ఎంత అప్పు పడుతున్నది, ఎంత భారం పడుతున్నటువంటి విషయాల గురించి కూడా ఆలోచించాలి.

ఇక వ్యవసాయ రంగానికి వస్తే, ఈ రంగం గురించి కూడా చాలా మంది చాలా రకాలుగా మాట్లాడారు. పాలీ హౌస్‌ను నూతనంగా ఆధునీకరించడం గురించి గతంలో కూడా చెప్పాను. ట్రెడిషనల్ అగ్రికల్చర్ నుండి మోడ్రన్, సైంటిఫిక్ అగ్రికల్చర్ చేపట్టవలసిన అవసరం ఉన్నది. ఎండిపోయిన భూములు ఉన్నటువంటి తెలంగాణలో పాలీ హౌస్‌ల ఉత్పత్తి, ఉపయోగం ఎక్కువగా ఉంటుంది మరియు దాని వలన లాభం కూడా ఎక్కువగానే ఉంటుంది. కానీ దాని మీద అవగాహన కల్పించి ఎంత మందిని దానిలోకి తీసుకురాగలిగారు? ఎంత మంది రైతులు దాని ద్వారా లాభం పొందగలిగారు? అనే విషయాలు గవర్నర్‌గారి ప్రసంగంలో కనబడలేదు. వ్యవసాయం రంగాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పరుస్తుంటే రాష్ట్రంలో రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు? నాలుగు సంవత్సరాల పరిపాలనలో దాదాపు 3000 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లుగా వివిధ రిపోర్టులు తెలుపుతున్నాయి.

**శ్రీ ఎమ్.ఎస్.ప్రభాకర్ రావు (స్థానిక సంస్థలు - హైదరాబాద్)ః–** తెలంగాణ రాష్ట్రంలో కాదు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం జరిగింది.

**శ్రీ ఎన్. రామచంద్రరావుః–** ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కాదు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం జరిగింది. ఈనాడు మహారాష్ట్ర, ముంబాయిలో రైతులు ధర్నాలు చేస్తే అక్కడ ఉన్నటువంటి ప్రభుత్వం రైతుల డిమాండ్స్‌ను ఒప్పుకోవడం జరిగింది. కానీ మన రాష్ట్రంలో రైతులకు బేడీలు వేసారు. ఆత్మహత్యలు ఎక్కువ అవుతున్నాయి కాబట్టి రైతులకు ఏ విధంగా మంచి జరిగిందని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను. రుణ మాఫీ చేసిన తరువాత కూడా రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు.

అంతేకాకుండా భూముల క్రమబద్ధీకరణ చేస్తారన్నారు. ఆ శాఖలో వెయ్యి మందికి పైగా సిబ్బంది చాలా కష్టపడి పని చేసారు. అది మంచి ఆలోచన. తెలంగాణ రాష్ట్రంలో

రెవెన్యూ రికార్డ్స్ సరిగా లేక భూ వివాదాలు బాగా జరుగుతున్నాయి. అయితే ఇంతవరకు పట్టా పాస్‌పుస్తకాలు ఇవ్వడంలో ఆలస్యం జరుగుతోంది. ఇంత వరకు సర్‌ప్లస్ భూములు ఎన్ని ఉన్నాయి? ఎన్ని భూములను ప్రభుత్వ భూములుగా గుర్తించగలిగాము? ఎన్ని భూములు వివాదాస్పదంగా ఉన్నాయి? వాటికి సంబంధించిన విషయాలను గవర్నర్ గారు తన ప్రసంగంలో చెప్పడం జరగలేదు.

ఇక నీటిపారుదల శాఖకు సంబంధించి 23 మేజర్ ఇరిగేషన్స్, 13 మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ ఉన్నాయని చెప్పారు. మైనర్ ఇరిగేషన్స్‌లో కూడా పెండింగ్ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. నారాయణ్‌ఖేడ్, వరంగల్‌కు సంబంధించిన ప్రాజెక్టులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి కొన్ని వందల కోట్ల రూపాయలు కేటాయిస్తే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయవచ్చని అనేక సార్లు సభలో చెప్పడం జరిగింది. మన రాష్ట్రంలోని అనేక ప్రాజెక్టులకు ప్రధానమంత్రి కృషిసించాయి యోజన యొక్క సహాయ సహకారాలు అందించడం జరిగింది.

1.00 మ. అనేక సందర్భాలలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తున్నదని చెబుతూ వస్తున్నారు. అందుకే నేను ఆ వివరాలన్నీ చెప్పడం జరిగింది. మొన్నటి వరకు పక్క రాష్ట్రానికి చేస్తున్నారు, మాకు ఏమీ చేయడం లేదని అంటూ వచ్చారు. ఈ రోజు రెండు రాష్ట్రాలకు చెయ్యడం లేదంటూ, జై ఆంధ్రా అంటున్నారు. అలా అన్నారు. నేను జై తెలుగు అని అంటున్నాను. జై భారత్ అంటున్నాను. దేశంలో ఉన్న ఇరవై తొమ్మిది రాష్ట్రాలు భారతీయ జనతా పార్టీకి సమానమే. మేము అందరినీ కూడా సమానంగా చూస్తాము. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అనేది మా విధానం.

(అంతరాయం )

నేను చెప్పేది ఒకటే. ఏ పథకానికి కేంద్ర ప్రభుత్వం సహాయం అందజేస్తున్నది అనే విషయం ప్రజలకు తెలియవలసిన అవసరం ఉంది. కేంద్రం ఏమీ సాయం చేయడం లేదు అని చెబుతుంటే ప్రజలు నమ్ముతున్నారు. రూ.43 వేల కోట్లు రోడ్ల కొరకు కేంద్రం మంజూరు చేసింది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీగారి ఆఫీసుకి వెళితే అక్కడ మనకు ఒక స్లోగన్ కనబడుతుంది. “American roads are good not because America is rich, but America is rich, because American roads are good”.

ఇది వాస్తవం. తెలంగాణలో కూడా రోడ్ల వ్యవస్థ బాగుంటే, మౌలిక వసతులు బాగుంటే తెలంగాణ కూడా అభివృద్ధి చెందుతుంది. ఆ విధంగా తెలంగాణ అభివృద్ధి చెందాలన్నది మా కోరిక. తెలంగాణ వచ్చిన తరువాత కేంద్రం నుండి ఎన్ని నేషనల్ హైవేస్ వచ్చాయి, గ్రామీణ సడక్ యోజన పథకం క్రింద ఎన్ని కోట్ల రూపాయలు వచ్చాయి అనేది చెప్పవలసిన అవసరం ఉంది. అదే విధంగా మన నగరంలో ఉన్న రోడ్ల పరిస్థితి గురించి కూడా ఆలోచించాలి. మన హైదరాబాద్‌లో ఉన్న రోడ్లు కాని, ఇక్కడ ఉన్న డ్రైనేజి సిస్టం గాని ఎలా ఉంది? ఇక్కడ ఒక చిన్న వర్షం కురిస్తే సగం సిటీ మునిగిపోయే పరిస్థితి ఉంది. Hyderabad is not safe when rain comes. అనేక ప్రాంతాలలో డ్రైనేజి సిస్టంగాని, సివరేజి సిస్టం గాని లేదు. కాని ఈ రోజు హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంటు గురించి చాలా గొప్పగా చెబుతున్నారు. What is the urban development that you have done in the last four years? నిజంగా ఈ రోడ్లు ఎక్కడ బాగున్నాయో చెప్పండి? మల్కాజిగిరి లేదా తుకారాం గేట్ ప్రాంతాలకు వెళ్లి, చూడండి. జిహెచ్‌ఎంసి మరియు ఆర్ అండ్ బి మధ్య సమన్వయం లేకపోవడం వల్ల, వివాదాలు ఏర్పడుతున్నాయి. ప్రాజెక్టులు పూర్తి కావడం లేదు. జిహెచ్‌ఎంసి రోడ్ల మీద ప్రయాణం చేస్తే తెలుస్తుంది వాటి పరిస్థితి. ఒకసారి కుషాయిగుడా రోడ్ల మీద ప్రయాణం చేసి చూస్తే తెలుస్తుంది. ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో. Urban development means not only roads and other things. అర్బన్ డెవలప్‌మెంట్‌లో మెట్రో రైలు గురించి చెప్పారు.

మెట్రో ప్రాజెక్టు తీసుకురావడం చాలా మంచిది. You have done a good thing. కొంచెం ఆలస్యం అయినప్పటికీ మొదలు పెట్టారు. We congratulate the Government. Why are you neglecting old city under Phase-II Metro Rail project? ఎందుకు పాత బస్తీ వరకు ఈ మెట్రో ప్రాజెక్టును తీసుకుపోవడం లేదు? వాళ్లు మనుషులు కారా? Are they not entitled for this? మీరు మెట్రో ప్రాజెక్టులో పాత బస్తీని మినహాయించారు. పాత బస్తీలో Joint Action Committeeని పెట్టుకొని ఆ విధంగా చేశారు. కాని అక్కడ ప్రజలు ఆందోళన చేస్తున్నారు. Metro is confined to new city. Why old city is being neglected? అని ఈ రోజు నేను అడుగుతున్నాను. అర్బన్ డెవలప్‌మెంట్ అంటే land acquisition is not a difficult

task for us. When you can acquire land in new city, why not in old city? It is a question of commitment to development in old city. You are not developing the old city because of political pressures, because of your friends who are MLAs and MPs there.

ఇంతకుముందు మాట్లాడిన గౌరవ సభ్యులు చెప్పారు ప్రైవేటు రంగంలో కూడా ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయని. పెరగాలి కూడా. ఎందుకంటే Government cannot give employment to all. కాబట్టి ప్రైవేటు రంగంలో ఎంప్లాయ్‌మెంటు జనరేట్ కావాలి. భారీ పరిశ్రమల వల్ల ఎక్కువగా ఉద్యోగాలు వస్తాయి. బోయింగ్, టాటా వంటి అనేకమైన పరిశ్రమలు హైదరాబాద్ పరిసరాల్లో వచ్చాయి. It is because of Make in India Project by Narendra Modi's Government that these industries have come here. We should not forget that. Let us not forget about it. It is because of Make In India and Start up India and because of Stand up India, these industries are coming and we are getting employment to our young generation. కాని ఈ రోజు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల గురించి చెబుతున్నారు. లక్ష పై చిలుకు ఉద్యోగాల గురించి చెప్పారు. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ జారీ చేసిన నోటిఫికేషన్‌ల గురించి ఈ రోజు కోర్టులలో కేసులు పెట్టారు. టీచర్స్ ఎగ్జామినేషన్ ఎందుకు ఆగిపోయింది? సుప్రీం కోర్టు ఆదేశాల మీద ఎందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారు? Why the Government is not careful with regard to announcement of the employment notifications? ఆ విధంగా కోర్టులలో కేసులు పెండింగ్‌లో ఉంటే, మన యువత నష్టపోతున్నది. ఎప్పటికో కోర్టు కేసులు తేలినప్పటికీ, యువతకి వయో పరిమితి ముగిసి పోతుంది. They will become age-barred.

(అంతరాయం)

కోర్టుల విభజన కూడా చేస్తున్నాము. ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య స్నేహం ఏర్పడింది. చర్చించుకుని, సెటిల్ చేసుకోవచ్చు. పెద్ద సమస్య కాదు. లక్ష ఇరవై వేల ఉద్యోగాల గురించి చెప్పారు. కాని ఇరవై వేల ఖాళీలు మాత్రమే భర్తీ చేశామని మీరే ఒప్పుకుంటున్నారు. అందులో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు మాత్రమే ఎక్కువగా ఉన్నాయి. But what about jobs in other Departments?

విద్యా రంగం గురించి చెబుతూ, గురుకులాలు అన్నారు. Are all Gurukulas are fully equipped? అక్కడ సపోర్టింగ్ స్టాఫ్‌ని నియమించారా? When education field is important for us, why half of the faculties are not filled in Osmania and other Universities? సింగరేణిలో ఐదు వేల మంది కాంట్రాక్టు సిబ్బందిని పర్మనెంట్ చేస్తామని చెప్పారు. విశ్వ విద్యాలయాల్లో ప్రొఫెసర్లు, లెక్చరర్ల ఖాళీలు ఎందుకు నింపడం లేదు? పాలమూరు యూనివర్శిటీలో ఈ రోజు కేవలం నలుగురు ఫాకల్టీ మాత్రమే ఉన్నారు. అలాగే శాతవాహన, మహాత్మా గాంధీ యూనివర్శిటీలలో కూడా సరైన ఫాకల్టీ లేదు. అటువంటి పరిస్థితిలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ఏ విధంగా బలోపేతం చేస్తారని నేను అడుగుతున్నాను. అలాగే పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీలలో కూడా శాంక్షన్డ్ పోస్టులు ఉన్నప్పటికీ కూడా, మనం భర్తీ చేయలేక పోతున్నాము. Our education system is running with the hired teachers, contract lecturers but not with permanent teachers. ఈ విధంగా ఉంటే మన పిల్లలకు ఏ విధమైన విద్యను అందిస్తామనే విషయం గురించి అందరమూ ఆలోచించవలసిన అవసరముంది.

అలాగే ఉర్దూ విషయం గురించి మాట్లాడారు. ఉర్దూ భాష అంటే నాకు చాలా ఇష్టం. ఫారూఖ్ సాబ్ లాగా నేను కూడా షాయరీ చెబుతా. కాని ఉర్దూతో పాటు నేను మరొక మాట చెప్పదలచుకున్నాను. సంస్కృత భాష ఉంది. It is being neglected. సెకండ్ లాంగ్వేజ్ క్రింద సంస్కృతం చదివే చాలా మంది విద్యార్థులు, సంస్కృతం బోధించే ఉపాధ్యాయులు చాలా మంది ఉన్నారు. కాని ఈ రోజు సంస్కృత పేపర్ల ఎవాల్యుయేషన్ కావడం లేదు. ఎందుకంటే Sanskrit is being abolished అనే పెద్ద ప్రచారం జరుగుతున్నది. Sanskrit is our ancient language. It has to be protected. Love Urdu, love Telugu but at the same time protect Sanskrit. కాబట్టి సంస్కృత భాషను రక్షించవలసిందిగా ఈ ప్రభుత్వాన్ని తమరి ద్వారా కోరుతున్నాను. చాలా మంది పిల్లలకు సంస్కృత భాషను నేర్చుకోవాలనే ఆసక్తి కూడా ఉంది. సంస్కృత భాషను బోధించే టీచర్లు, లెక్చరర్లు అనేక మంది ఉన్నారు. వాళ్ల బతుకులు, భవిష్యత్తు ఏమవుతుందనే విషయం గురించి కూడా ఆలోచించాలి. ప్రతి విశ్వ విద్యాలయంలో ఒక సంస్కృత విభాగం ఉంది.

ఈ రోజు సభ్యులు పబ్లిక్ సేఫ్టీ గురించి కూడా మాట్లాడారు. అంటే లా అండ్ ఆర్డర్. సిసి కెమేరాలు వచ్చిన తరువాత నేరస్థులను త్వరగా పట్టుకుంటున్నారు. But at the same time Cyber crimes are increasing and drug peddling cases are increasing. కేసులు పట్టుకుంటున్నారు, కరెక్టే. But how drugs are coming into Telangana? ఈ డ్రగ్స్ మన యువతను పాడుచేస్తున్నాయి. పబ్లిక్ సేఫ్టీలో లా అండ్ ఆర్డర్ చాలా ముఖ్యమైన అంశం. ఎక్కడా ధర్నాలు జరగవద్దు. ఎక్కడా పబ్లిక్ మీటింగులు జరగవద్దు. Public safety and law and order should be protected while protecting the Fundamental Rights of the common citizens.

ఆ రోజు మన ముఖ్యమంత్రిగారు చెప్పారు మన తెలంగాణ వచ్చిన తరువాత ధర్నా చౌక్‌ల అవసరముండదు అని. అప్పుడు మనకు అర్థం కాలేదు. అంటే ధర్నా చౌక్ ఉండదు కాబట్టే ధర్నాలు ఉండవు అని వారి భావం. నిజంగా ఈ రోజు మేము ధర్నాలు చెయ్యాలన్నా, పబ్లిక్ మీటింగులు పెట్టుకోవాలన్నా, అనౌన్స్‌మెంట్ రాగానే మమ్మల్ని గృహ నిర్బంధం చేసి, హౌస్ అరెస్టులు చేస్తున్నారు. It is undeclared Emergency in Telangana. There is no Law and Order as far as political activities are concerned. Law and Order should be protected, while protecting the Fundamental Rights of the common citizen. People are not able to exercise their Fundamental Rights freely. పోలీస్ రూల్ నడుస్తున్నది.

(అంతరాయం)

You are suppressing and you are curbing their rights. జైళ్లకు పంపిస్తున్నారు. సోషల్ మీడియాలో ఎవరైనా వార్తలు రాస్తే, Section 506, 507 of I.P.C. క్రింద జైలుకు పంపిస్తామని ప్రతిపాదన పెట్టినటువంటి ప్రభుత్వం ఇది. How can you express Fundamental Rights? ఇది పబ్లిక్ సేఫ్టీయా? Is this the way to maintain Law and Order? This is not Law and Order.

(అంతరాయం)

మనం తెలంగాణలో ఉన్నాము. యు.పి. గురించో, మహారాష్ట్ర గురించో మాట్లాడమంటారా? Let us have a Session. మహారాష్ట్రలో, ఉత్తర ప్రదేశ్‌లో లేదా భారతీయ జనతా పార్టీ పాలిత రాష్ట్రాల నుండి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న లా అండ్ ఆర్డర్‌ను కంపేర్ చేద్దాము. Which State is better in implementing the fundamental rights అన్నది అప్పుడు తెలుస్తుంది. I am ready. అవును. Telangana is No.1 in announcing the Schemes, Telangana is No.1 in making large promises. Telangana is No.1 in many other things, but Telangana is last in performance. మనం అది గుర్తు పెట్టుకోవాలి. How many jobs you have given? మీ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాం డబుల్ బెడ్ రూం ఇళ్లు, it does not find a place in Governor's speech. How many double bed room houses you have constructed? ఎంతమందికి మీరు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చారు?

(అంతరాయం)

మొన్న కాళేశ్వరం ప్రాజెక్టు విజిట్‌కు వెళ్లినప్పుడు భూపాలపల్లికి వెళ్లాము. గౌరవ స్పీకర్‌గారి నియోజకవర్గంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించాను. I appreciated the construction. లప్పం ఫినిషింగ్, యూరోపియన్ టాయిలెట్లు చాలా బ్రహ్మాండంగా ఉన్నాయి. కాని పక్కనే చాలా బ్లాక్స్ ఇంకా కంప్లీట్ కాలేదు. నేను కారణం అడిగితే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించనందున, పనులు ఆగిపోయినట్లు చెప్పారు. They have completed only 2 to 3 percent.

(అంతరాయం)

**మిస్టర్ డెప్యూటి ఛైర్మన్:-** వెంకటేశ్వర్లు గారు, మధ్యలో మీరు మాట్లాడకండి. వారిని పూర్తి చేయనివ్వండి. మీకు అవకాశం వచ్చినప్పుడు మీరు చెప్పదలచుకున్నది చెప్పండి. మధ్యలో మాట్లాడేది రికార్డుల్లోకి పోదు. దయచేసి మీరు కూర్చోండి. వారు చెప్పేది వారిని చెప్పనివ్వండి. మీరు చెప్పదలచుకున్నది తరువాత చెప్పండి. మీకు రేపు అవకాశం ఇచ్చినప్పుడు అన్నీ చెప్పండి.

**శ్రీ ఎన్. రామచంద్ర రావు:-** ఒక్క నియోజకవర్గంలో చేస్తే, అంతా చేసినట్లు కాదు. బోయిగూడ వెళ్లి చూడండి. నా నియోజక వర్గం మహబూబ్ నగర్‌లో కూడా పరిస్థితి అలాగే ఉంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం క్రింద ఎంత మందికి ఇళ్లు ఇచ్చారు? గతంలో ఒకసారి శ్రీ వెంకయ్యనాయుడు గారు చెప్పారు పథకాలు కేంద్ర ప్రభుత్వానివే అయినప్పటికీ కూడా, అమలు చేసేది మాత్రం

రాష్ట్ర ప్రభుత్వమే అని. అయితే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన క్రింద రాష్ట్రానికి 90 వేల ఇళ్లు శాంక్షన్ చేశారు. How many houses have been given to the beneficiaries by the State Government? Housing is an important subject for us. Housing is important for every one. It is a dream for every one in Telangana to have a house. తెలంగాణలోనే కాదు, ఏ పేదవాడికైనా నాకు ఒక ఇల్లు కావాలని ఉంటుంది. అందుకే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అనే పథకం పెడితే, దాని అమలు ఎంత వరకు వచ్చింది? ఎందుకు చెబుతున్నానంటే మీరు చెబుతున్న అనేక పథకాల్లో కేంద్ర ప్రభుత్వం యొక్క సహాయం కూడా ఉంది. కేంద్ర ప్రభుత్వ పథకాలు కూడా అమలు చేసే బాధ్యత ఈ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఉంది. గవర్నర్‌గారి ప్రసంగంలో సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్ గురించి ప్రస్తావించి ఉంటే బాగుండేదని నా అభిప్రాయం.

(అంతరాయం)

ప్రజలకు వాస్తవాలు తెలవాలి కాబట్టి చెబుతున్నాను. అందుకే అంటున్నాను it is a purposeful omission of not mentioning Central Government assistance in all the Schemes. కెసిఆర్ కిట్‌లో చూసినట్లయితే సగం డబ్బులు కేంద్ర ప్రభుత్వానివే ఉన్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు 32 శాతం మాత్రమే నిధులిచ్చేవాళ్లు. అప్పుడు మన ముఖ్యమంత్రులంతా ప్లానింగ్ కమీషన్ దగ్గరకు వెళ్లి నిధుల గురించి అడుక్కునే వాళ్లు. ఆ నాడు ముఖ్యమంత్రిగా పని చేసిన శ్రీ నరేంద్ర మోదీగారికి కూడా ఈ అవమానం జరిగింది కాబట్టే ఈరోజు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు 42 శాతం నిధులు రాష్ట్రాలకు ఇస్తున్నారు. దానిని మనం గుర్తించవలసి ఉంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా ఉండేది. కాని ఈ రోజు కేంద్రంలో ప్రభుత్వం మారిన తరువాత రాష్ట్రాలకు 42 శాతం నిధులు కేటాయించడం జరుగుతున్నది. So we are proud that after Sri Narendra Modi has become Prime minister the State Governments are getting better share in everything.

1.20 మ. ఈరోజు రేషన్ కార్డుల కోసం చాలా మంది పేదవాళ్లు ఎదురు చూస్తున్నారు. రేషన్ కార్డులు ప్రింట్ కాలేదు, కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. ఆ రేషన్ కార్డుల గురించి, సివిల్ సప్లైస్ గురించి గవర్నర్ గారి ప్రసంగంలో మీరెక్కడా మెన్షన్ చేయలేదు.

చివరగా రెండు విషయాలు చెప్పి ముగిస్తాను. సిక్కు భవన్, క్రిస్టియన్ భవన్ మంజూరు చేశారు. అన్ని కులాలు, మతాల వారికి భవనాలు ఇస్తున్నారు, చాలా మంచిదే. అయితే మీరు ఆ భవనాల కోసం ఇస్తున్న ల్యాండు క్లియర్‌గా లేదు. క్రిస్టియన్ భవన్‌కు ఇచ్చిన ల్యాండు వివాదంలో ఉంది. సిక్కు భవన్‌కి ఇచ్చిన ల్యాండు కూడా వివాదంలో ఉందేమో చూసుకోండి. బ్రాహ్మణులకు కూడా భవన్ మంజూరు చేశారు, దాని ఇనాగురేషన్‌కి నేను కూడా వెళ్లాను. వాటికి ప్రభుత్వం ఇచ్చే భూములు వివాదరహితంగా ఉండాలి. ఆ విషయంలో ఏ కులమైనా, మతమైనా సరే, let them not feel insulted. బంజారా భవన్ నడుస్తోంది కానీ క్రిస్టియన్ భవన్ నడవడం లేదు. పాపం రాజేశ్వర్‌రావు గారు ఎంతో కష్టపడి దాన్ని తీసుకొచ్చారు. యాప్రాల్ దగ్గర దానికి సంబంధించి భూ వివాదం నడుస్తోంది. మీరు ఇవ్వండి, but try to give clear title land.

మీరు హైదరాబాదులో ప్రపంచ తెలుగు మహాసభలు పెట్టారు, చాలా సంతోషం. అటువంటి ఈవెంట్స్ జరిగితే, it will enhance the prestige of the State. మనకు ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించే అవకాశం వచ్చింది. తెలుగు మహాసభలలాగే - it would have been an international affair. But the University has lost the opportunity because of the policies of the state government. It has gone to Manipur, which is a small state. Indian Science Congress, which was supposed to be held in Osmania University in its centenary celebrations, which was a pride and prestige of the University, has gone to a small State. You (referring to Dr. Palla Rajeswara Reddy) are also alumni of Osmania University. We have lost the great opportunity.

అధ్యక్షా, ఏవైతే వైఫల్యం చెందిన పథకాలున్నాయో, ఏదైతే వైఫల్యం చెందిన పరిపాలన ఉందో, వైఫల్యం చెందిన విషయాలు ఏవైతే ఉన్నాయో వాటి గురించి బయట పడకుండా, ఆర్థిక సహాయం చేసిన కేంద్ర ప్రభుత్వానికి అక్నాలెడ్జ్ చేయకుండా తయారు చేసిన ఈ గవర్నర్ ప్రసంగం is a bunch of *** అని తెలియజేస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను. భారత్ మాతాకి జై, జై తెలంగాణ.

*** రికార్డుల నుంచి తొలగించడమైంది.

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్:-** రామచంద్రరావు గారూ, *** అనే పదాన్ని వాడకూడదు, మీరు ఆ పదాన్ని ఉపసంహరించుకోండి.

**SRI N. RAMACHANDRA RAO:-** O.K Sir. I am sorry for using that word. I am withdrawing that word.

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్:** *** అనే పదాన్ని రికార్డుల నుంచి తొలగించడమైంది.

**శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు:-** థ్యాంక్యూ సర్. రాష్ట్ర గవర్నర్ గారు ఉభయ సభలనుద్దేశించి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరుగుతున్న చర్చలో పాల్గొనడానికి నాకు అవకాశం కల్పించినందుకు ముందుగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. చాలా మంది సభ్యులు చాలా విషయాలు మాట్లాడారు. My learned friend రామచంద్రరావు గారు మాట్లాడుతూ చాలా విషయాలు చెప్పారు, కానీ అవాస్తవాలు చెప్పారు. వాస్తవాలు చెప్పి ఉంటే బాగుండేది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత అనేక రంగాలలో అభివృద్ధి చెందుతోంది. ఒకవైపు మీరు(బిజెపి) అంగీకరిస్తున్నారు, మరొక వైపు ఖండిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నపుడు తెలంగాణ ప్రాంతం ఏవిధంగా దోపిడీకి గురైందో మనందరికీ తెలుసు. ఉమ్మడి రాష్ట్రంలో మనకు రావలసిన నిధులు కానీ, నియామకాలు కానీ రాక చాలా రకాలుగా అన్యాయం జరిగింది. సరే రాష్ట్రం వచ్చింది, నూతన ముఖ్యమంత్రి కూడా వచ్చారు. కొత్త పాలసీలు వచ్చాయి. రాష్ట్రాభివృద్ధిలో ప్రతి కులం, ప్రతి మతానికి సరైన ప్రాతినిథ్యం కల్పిస్తూ ముందుకెళుతున్నాం. రాష్ట్రం వచ్చిన తర్వాత ముఖ్యంగా ఇరిగేషన్ విషయంలో కానీ, ఎడ్యుకేషన్ విషయంలో కానీ, అర్బన్ డెవలప్‌మెంటులో అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతున్నాం. ఇంతకు ముందు గౌరవ సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి గారు మాట్లాడుతూ చాలా కరెక్టుగా చెప్పారు. రాష్ట్రం ఏర్పడడానికి రెండు సంవత్సరాల ముందు జి.ఎస్.డి.పి.కి సంబంధించి ఆల్ ఇండియా గ్రోత్ రేట్ 5.9 శాతం ఉంటే, తెలంగాణ ప్రాంతానికి సంబంధించి చాలా తక్కువగా అంటే 4 శాతం ఉండేది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత నేషనల్ యావరేజ్ 7.5 శాతం ఉంటే, తెలంగాణాలో అది 8.6కి చేరుకుంది. దీన్ని బట్టి చూస్తే ఏవిధంగా మనం అభివృద్ధి చెందుతున్నామో స్పష్టంగా కనిపిస్తోంది. గ్రోత్ రేటు, ఎకానమీ రేటు పెరిగినపుడు మన రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకెళుతోందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

తలసరి ఆదాయ విషయానికి వస్తే – జాతీయ తలసరి ఆదాయం రూ.1.03 లక్షలుంటే, తెలంగాణాలో రూ.1.54 లక్షలుగా అంచనా వేయడం జరిగింది. మన రాష్ట్రంలో వ్యవసాయం ప్రధాన రంగం. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రైతాంగానికి ఎన్నో ఇబ్బందులుండేవి. అప్పుడు రైతులందరూ నానా కష్టాలు పడుతూ, చివరికి ఫలితం దక్కక ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితిని మనం చూశాం. అప్పుడు ప్రతి రైతు కూడా ప్రకృతి పైన, బోరు బావులపైనే ఆధారపడి వ్యవసాయం చేయడం జరిగేది. నీళ్లుంటే కరెంటు ఉండేది కాదు, కరెంటు ఉంటే నీళ్లు ఉండేవి కావు. బయటి నుంచి అధిక వడ్డీకి రైతులు అప్పులు తెచ్చుకొని వ్యవసాయం చేస్తే, చివరకి పంటలు పండక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అవన్నీ చూసి, టిఆర్‌యస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత, ప్రతి రైతుకి లక్ష రూపాయల వరకు పంట రుణాలను మాఫీ చేయాలని ఒక మంచి నిర్ణయం తీసుకొని, 35.30 లక్షల మంది రైతులకు రుణ మాఫీ చేయడం జరిగింది. ఆ ఘనత గౌరవ ముఖ్యమంత్రి గారికి, టిఆర్‌యస్ ప్రభుత్వానికే దక్కింది. గత ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయంలో ఎన్నో సంస్కరణలు తీసుకురావడం జరిగింది. ముఖ్యంగా ఫార్మ్ మెకానిజం టేకప్ చేయడం జరిగింది. ప్రతి రైతుకి నాణ్యమైన విత్తనాలు ఇస్తున్నాం, నాణ్యమైన ఎరువులు ఇస్తున్నాం. గత ప్రభుత్వంలో రైతులకు విత్తనాలు ఇస్తే, అవి నకిలీ విత్తనాలని వెల్లడయ్యేది. ఎరువులు సరైన కాలంలో ఇచ్చే వాళ్లు కాదు. రైతులు గతంలో ఎన్నో ఇబ్బందులు పడ్డారు. కానీ టిఆర్‌యస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇస్తున్నాం. పాలీ హౌసెస్/గ్రీన్ హౌసెస్ ఇస్తున్నాం. ఇవన్నీ చేయడం వల్ల వ్యవసాయోత్పత్తి అధికమైనట్లుగా రికార్డులు చెబుతున్నాయి. 2016-17 లో రికార్డు స్థాయిలో 101.29 లక్షల టన్నుల వ్యవసాయోత్పత్తి రాష్ట్రంలో జరిగింది. ప్రభుత్వ ఆలోచన విధానం, తీసుకున్న పాలసీలు, వ్యవసాయ శాఖ తీసుకున్న చర్యల వల్ల ఈ విధంగా వ్యవసాయోత్పత్తి సాధ్యపడింది.

అగ్రికల్చర్‌కి – పవర్‌కి చాలా దగ్గరి సంబంధం ఉంది. పవర్ ఉంటేనే అగ్రికల్చర్ చేయగలం. ఈరోజు మనం రైతులకు క్వాలిటీ పవర్ ఇస్తున్నాం. రైతు నుంచి ఒక్క పైసా

*** రికార్డుల నుంచి తొలగించడమైంది.

తీసుకోకుండా 24 గంటల పాటు ఉచితంగా నాణ్యమైన కరెంటును ఇస్తున్న పరిస్థితిని మనం చూస్తున్నాం. 23 లక్షల వ్యవసాయ పంపుసెట్లు రాష్ట్రంలో ఉచిత విద్యుత్తుతో నడుస్తున్నాయి. ఇదొక గొప్ప నిర్ణయం, ఒక మంచి నిర్ణయం. రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ఎంతైనా ముదావహం.

మన రాష్ట్రంలో ఎన్నో కుల వృత్తుల వారున్నారు. గొల్ల కురుమలు, మత్స్యకారులు తదితర కుల వృత్తుల వారున్నారు. ముఖ్యంగా గొల్ల కురుమలకు 75 శాతం సబ్సిడీతో 84 లక్షల గొర్రెలను పంపిణీ చేయాలని టార్గెట్ పెట్టుకుంటే, ఇప్పటికే 50.10 లక్షల గొర్రెలను పంపిణీ చేయడం జరిగింది. గొల్ల కురుమలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా మాంసం ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించి, రాష్ట్రాన్ని ఒక ప్రధాన ఎగుమతిదారుగా తయారు చేయాలని ప్రణాళిక తయారు చేయడం జరిగింది. ఎగుమతులు పెరిగితే రాష్ట్ర రెవెన్యూ పెరుగుతుంది, రెవెన్యూ పెరిగితే ఎకానమీ పెరుగుతుందనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి గారు తీసుకున్న ఒక మంచి నిర్ణయం వల్ల ఎంతో మంది లాభం చేకూరుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఇరిగేషన్‌కి సంబంధించి ప్రధానంగా 23 మేజర్ ప్రాజెక్టులు, 13 మీడియం ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే కోటి ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఇటీవల మనందరమూ వెళ్లి కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించాం. అదొక ఇంజినీరింగ్ అద్భుతం. అది చూసిన తర్వాత మన నిర్ణయాలు మారిపోయాయి. చూడక ముందు ఎన్నో విషయాలు మాట్లాడాము, విమర్శలు చేశాం. పెద్ద ఎత్తున అక్కడ జరుగుతున్న పనులను చూశాం. రామచంద్రరావు గారు, ప్రతిపక్షాలకు చెందిన సభ్యులు. వారు కూడా ఆ పర్యటనలో పాల్గొనడం జరిగింది. అక్కడ 25 వేల మంది రాత్రి, పగలు కష్ట పడుతూ ప్రాజెక్టు నిర్మాణంలో పాలు పంచుకుంటున్నారు. అది పూర్తయితే మాత్రం, ప్రపంచంలోనే టాప్ మోస్ట్ ప్రాజెక్టు అవుతుందని వాళ్లు చెప్పడం జరిగింది. ఇంత పెద్ద ఎత్తున ప్రాజెక్టును చేపట్టాలంటే ఆషామాషీకాదు. ఎన్నో అనుమతులు రావలసి ఉంటుంది. అటవీ అనుమతులు, పర్యావరణ అనుమతులు, సిడబ్ల్యుసి నుండి అనుమతులు రావలసి ఉంటుంది. గౌరవ ముఖ్యమంత్రి గారు, సంబంధిత మంత్రి గారు చొరవ తీసుకొని, కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి, అవసరమైన అనుమతులన్ని తీసుకొచ్చి ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ముందుకెళ్లడం జరుగుతోంది. ఈ ప్రాజెక్టు వల్ల సాగునీరు, తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీరు రాబోవు రోజుల్లో సంపూర్ణంగా, పుష్కలంగా అందుతుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

పవర్ సెక్టారులో అద్భుతాలు చేశాం. ఉమ్మడి రాష్ట్రంలో స్థాపిత ఉత్పత్తి సామర్థ్యం 7788 మెగావాట్లుంటే, ఈరోజు దాన్ని 15334 మెగావాట్లకు పెంచాం. ఇంత స్వల్ప కాలంలో, నాలుగు సంవత్సరాలలో ఇంత పెద్ద ఎత్తున మనం పవర్ జనరేషన్ చేశాం. భవిష్యత్తులో రాష్ట్రాన్ని పవర్ సర్‌ప్లస్‌గా తయారు చేయడానికి మరొక 12931 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన ప్రాజెక్టుల పనులు వివిధ దశలలో ఉన్నాయి.

అధ్యక్షా, అర్బన్ డెవలప్‌మెంటు గురించి, హైదరాబాదు గురించి గౌరవ సభ్యులు రామచంద్రరావు గారు మాట్లాడారు. నేను హైదరాబాదులో లోకల్ బాడీస్ నుండి రెప్రజెంట్ చేస్తున్నాను కాబట్టి నగరానికి సంబంధించిన విషయాలు చెప్పదలుచుకున్నాను. ఈరోజు హైదరాబాదులో చాలా అద్భుతాలు జరుగుతున్నాయి. మెట్రో రైలు మియాపూర్ నుంచి అమీర్‌పేట్, అమీర్‌పేట్ నుంచి నాగోలు వరకు ప్రారంభమైంది. ప్రధాన మంత్రిగారు వచ్చి మెట్రో రైలు ప్రాజెక్టును ప్రారంభించి రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించి వెళ్లారు. ఓల్డ్ సిటీ గురించి రామచంద్రరావు గారు చెప్పారు. అక్కడ కూడా మెట్రో రైలు పనులు వేగంగా జరుగుతున్నాయి. అక్కడ దర్గాలు, మసీదులు, గుళ్లు వంటి రిలిజియస్ స్ట్రక్చర్స్ మెట్రో రైలు మార్గంలో వస్తున్నాయి కాబట్టి, సంబంధిత రిలిజియస్ హెడ్స్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. ఎస్ఆర్‌డిపి ప్రాజెక్టు క్రింద రూ.20 వేల కోట్లను బాండ్స్ రూపంలో సేకరించి, ఆ నిధులతో రాబోవు రోజుల్లో నగరంలో టన్నెల్స్, ఫ్లైఓవర్స్ నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టబోతున్నాం. సిటీ రోడ్లకి సంబంధించి ప్రత్యేకంగా రోడ్డు డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రాబోవు రోజుల్లో హైదరాబాదును ఒక మంచి నగరంగా, విశ్వ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

లా అండ్ ఆర్డర్ విషయానికి వస్తే – నగరంలో మనం ఫ్రెండ్లీ పోలీసింగ్‌ని చూస్తున్నాం. కెమెరాలు అద్భుతంగా పని చేస్తున్నాయి. క్రైమ్ రేటు చాలా తగ్గింది. మహిళల రక్షణ

కోసం షీ టీములను ఏర్పాటు చేశారు. ఐటి కంపెనీల పెద్ద ఎత్తున హైదరాబాదుకు వస్తున్నాయంటే దానికి కారణం – మన సుపరిపాలన, రాజకీయ సుస్థిరత, శాంతిభద్రతల పరిరక్షణ. ఇవన్నీ ఉన్నాయి కాబట్టే వాళ్లందరూ కూడా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఈ రకంగా చెప్పుకుంటే పోతే అనేక రంగాలలో మనం అభివృద్ధి చెందుతున్నాం.

రామచంద్రరావు గారు మాట్లాడుతూ, కేంద్రం నుంచి వచ్చే నిధుల గురించి చెప్పడం లేదనే విషయాన్ని ప్రస్తావించారు. It is the part of the system. మీరు(కేంద్ర ప్రభుత్వం) ఇక్కడకు వచ్చి ఫేవర్ చేయడం లేదు. మీరు ఫండ్స్‌ని షేర్ చేయవలసిన అవసరం ఉంది. అందరమూ కలిసి పని చేయవలసిన అవసరం ఉంది. మన తెలంగాణ రాష్ట్రం నుండి కేంద్రానికి ఎంత రెవెన్యూ పోతోందో ఆ విషయం కూడా చెప్పండి. కేంద్రం నుంచి వచ్చిన రెవెన్యూ ఎంతో చెప్పండి. దాని వల్లే కదా ఈ conflict వస్తోంది ! ఈ పెత్తనం ఎందుకని అడుగుతున్నారు కదా ! అందరమూ కలిసి పని చేయాలనే ఉద్దేశమే కదా ఇందులో ఉన్నది. హైదరాబాదు పర్యటనకు వచ్చిన ప్రతి కేంద్ర మంత్రి కూడా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను మెచ్చుకుంటున్నారు, అభినందిస్తున్నారు. మీరు పెద్దగా, గొప్పగా ఆలోచించవలసిన అవసరం ఉంది. తెలంగాణాలో అద్భుతంగా పనులు జరుగుతున్నాయి, మీ స్కీములు అద్భుతంగా ఉన్నాయి, వాటిని మా రాష్ట్రంలో కూడా అమలు చేస్తామంటూ హైదరాబాదుకి వచ్చిన కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల మంత్రులు అంటున్నారు. వాళ్లంతా ఎంతో గొప్పగా చెప్పారు. దేశానికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలబడింది. మూడు, నాలుగు సంవత్సరాలలోనే తెలంగాణాకి ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాం. ఈరోజు రాష్ట్రంలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. అన్ని కులాలు, మతాలు వారు సుభిక్షంగా, సంతోషంగా ఉన్నారు. మహిళలు సుభిక్షంగా, సురక్షితంగా ఉన్నారు. ప్రతి వారికి కూడా సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఆ స్కీములన్నీ చాలా ప్రాపర్‌గా ఇంప్లిమెంటు అవుతున్నాయి. చాలా సీరియస్‌గా ఇంప్లిమెంటు చేస్తున్నారు. ప్రతి దాన్నీ ముఖ్యమంత్రి గారు స్వయంగా రెవ్యూ చేసుకుంటూ పకడ్బందీగా అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ ఒక మంచి రాష్ట్రం, సుభిక్ష రాష్ట్రం, అందరూ సంతోషంగా ఉన్నారని చెబుతూ, గవర్నర్ గారికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి మద్దతు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ః–** బుధవారం, 14.3.2018 ఉదయం 10.00 గంటలకు తిరిగి సమావేశమయ్యేందుకు సభను వాయిదా వేయడమైంది.

(బుధవారం, 14.3.2018 ఉదయం 10.00 గంటలకు తిరిగి సమావేశమయ్యేందుకు సభ మధ్యాహ్నం 1.35 గంటలకు వాయిదా పడింది.)

* * *

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council and Printed at the Assembly Press, Public Gardens, Hyderabad.”**